www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 21-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 233 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: షష్ఠి సా. 5.03 తదుపరి సప్తమి; నక్షత్రం: పుష్యమి మ. 3.35 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: తె.5.13; దుర్ముహూర్తం: ఉ.10.09-10.54, మ.2.36-3.21; అమృతఘడియలు: ఉ.8.59-10.38; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 6.27; సూర్యాస్తమయం: 5.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రోబో కిడ్నాపర్

2

చైనాలో 12 పెద్ద రోబోల్ని కిడ్నాప్ చేసిన చిన్న రోబో

సీసీ టీవీ దృశ్యాలు వైరల్

ఎవరో ప్రోగ్రామింగ్ ద్వారా ఇలా చేసి ఉండొచ్చన్న అనుమానాలు



ముందున్న చిన్న రోబోను (వృత్తంలో) అనుసరిస్తున్న పెద్ద రోబోలు


వేములవాడ రాజన్న ఆలయంలో సీఎం రేవంత్, మంత్రులు పొన్నం, దామోదర, ఉత్తమ్, దుద్దిళ్ల

కొడంగల్ నియోజకవర్గంపై కక్ష ఎందుకు కేసీఆర్? నేనేమైనా లక్ష ఎకరాల భూములు సేకరించానా? నాలుగు గ్రామాల్లో వెయ్యి, పన్నెండు వందల ఎకరాలు సేకరిస్తే.. మీకు కడుపుమంట ఎందుకు? మీ దుఃఖం, బాధ ఏమిటని అడుగుతున్నా. పదేళ్లు ప్రభుత్వాన్ని నడిపినోడు మాట్లాడేది ఇట్లాగేనా? భూములు సేకరించకుండా పరిశ్రమలు పెట్టలేరని తెలియదా?

- సీఎం రేవంత్‌రెడ్డి

పరిశ్రమల కోసం భూములు సేకరించొద్దా?

- రాష్ట్రాన్ని అభివృద్ధి చేయొద్దా?
- నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వొద్దా?
- మీరు ప్రాజెక్టులు ఎలా కట్టారు?
- కొడంగల్‌పై ఇంత కక్ష ఎందుకు?
- కలెక్టర్‌పై దాడులు చేయిస్తారా?
- కుట్రలు చేస్తే ఊచలు లెక్కబెట్టిస్తాం
- కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి ధ్వజం
- 'కాళేశ్వరం' నీళ్లు రాకుండానే 1.53 కోట్ల టన్నుల ధాన్యం పండించారు
- రాష్ట్రాన్ని అన్నింటా అభివృద్ధి చేస్తాం
- వేములవాడలో ప్రజాపాలన విజయోత్సవ సభలో ముఖ్యమంత్రి

కరీంనగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "రాష్ట్రంలో భూసేకరణ చేయడం నేరమా? పరిశ్రమల స్థాపన కోసం భూసేకరణ చేయొద్దా? నిరుద్యోగులకు ఉద్యోగాలివ్వొద్దా? పరిశ్రమలు ఏర్పాటు చేయకపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? భూసేకరణ చేయకుండా మీరు ప్రాజెక్టుల నిర్మాణం ఎలా చేపట్టారు?" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్‌ను ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏటా లక్షా 10 వేల మంది విద్యార్థులు ఇంజనీరింగ్ కోర్సు చదివి బయటకు వస్తున్నారని, వారికి ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటు చేయవద్దా? అని

మిగతా 13వ పేజీలో...

మోదీకి సాధ్యం కాని పని.. మేం చేసి చూపిస్తున్నాం!

2

మరో మూడు వారాల్లో తెలంగాణలో కులగణన పూర్తి

దేశానికి దారి చూపాం: రాహుల్‌గాంధీ

4 ఏళ్లలో కొత్తగా 30 లక్షల ఎకరాల ఆయకట్టు

13

రేషన్ కార్డులతో సన్నబియ్యం: ఉత్తమ్

మహాయుతిదే మహారాష్ట్ర?

బీజేపీ కూటమికే విజయావకాశాలు ఎక్కువ

ఝార్ఖండ్‌లోనూ ఎన్డీయేకే చాన్స్!.. పలు ఎగ్జిట్‌పోల్స్‌లో వెల్లడి

మహారాష్ట్రలో 58.22% పోలింగ్.. ఝార్ఖండ్ 67.59%.. ఎల్లుండి ఫలితాలు


ముంబైలోని ఓ పోలింగ్ బూత్‌కు ఓటు వేయడానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన షారుఖ్‌ఖాన్

న్యూఢిల్లీ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దేశంలో అధికార, ప్రతిపక్ష కూటములు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన 'మహా' యుద్ధానికి తెరపడింది. మహారాష్ట్రతోపాటు ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఈవీఎంల్లో నిక్షిప్తం చేసిన తీర్పు శనివారం వెలువడనుంది. ఏ రాష్ట్రంలో అధికార పీఠం ఎవరిదో శనివారం మధ్యాహ్నానికే తేలిపోనుంది!! అయితే.. మరాఠా గడ్డపై బీజేపీకి అత్యధిక అసెంబ్లీ సీట్లు దక్కనున్నాయని, అక్కడ అధికార పీఠం మహాయుతి కూటమికే దక్కుతుందని.. కాంగ్రెస్ నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ కూటమికి భంగపాటు తప్పదని.. అటు గనుల గడ్డ ఝార్ఖండ్‌లోనూ ఎన్డీయే కూటమిదే గెలుపని అత్యధిక సర్వే సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. మహారాష్ట్రలో మొత్తం 288 శాసన సభ నియోజకవర్గాలకు ఒకేసారి పోలింగ్ జరగ్గా.. 81 స్థానాలున్న ఝార్ఖండ్‌లో నవంబరు 13న 43 స్థానాలకు, రెండో దశలో భాగంగా 38 స్థానాలకు బుధవారం పోలింగ్ జరిగింది. కడపటి వార్తలందే సమయానికి మహారాష్ట్రలో 65.02%.. ఝార్ఖండ్‌లో 68.45% పోలింగ్ నమోదైంది. మహారాష్ట్రలో 2019 ఎన్నికల కంటే (61.6%) ఎక్కువ శాతం పోలింగ్ ఈసారి నమోదవుతుందని అధికారులు

మిగతా 2వ పేజీలో...

लोकमंथन

నేటి నుంచి లోక్‌మంథన్

హైదరాబాద్‌లో అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవం

4 రోజుల పాటు జరగనున్న కార్యక్రమం

హాజరుకానున్న రాష్ట్రపతి, గవర్నర్లు

12

రేవంత్‌కు కేసీఆర్ భయం

వరంగల్ సభలో 50 సార్లు ప్రస్తావన

రాష్ట్రంలో బీఆర్‌యూ ట్యాక్స్

ప్రతి బిల్లుపై 8-10 శాతం వసూళ్లు

మోసం చేయడం, మాట తప్పడం రేవంత్‌రెడ్డి డీఎన్‌ఏలోనే ఉంది

పాలమూరు పర్యటనలో హరీశ్‌రావు

జ్వరం తగ్గి 2 నెలలైనా

తగ్గని నొప్పులు

ముందెన్నడూ లేని విధంగా విషజ్వరాలు.. దోమల స్వైరవిహారం

ఆస్పత్రులకు బాధితుల క్యూ.. ఓపీలో వారి సగటే 30-40%

డెంగీ, చికున్‌గున్యా విజృంభణ.. రాష్ట్రానికి అమెరికా ట్రావెల్ అలెర్ట్



- హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో ల్యాప్రోస్కోపిక్ సర్జన్ చికున్‌గున్యా బారినపడ్డారు. రోజూ సర్జరీలతో బిజీబిజీగా ఉండే ఆయన.. జ్వరంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఇప్పుడు జ్వరం తగ్గినా.. జ్వరానంతర(పోస్ట్ వైరల్) సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఒంటినొప్పులు, నీరసం, అలసట కారణంగా శస్త్రచికిత్సలు చేయలేకపోతున్నారు. కేవలం ఔట్‌పేషెంట్లను చూడడానికే పరిమితమవుతున్నారు. ఆయన వయసు 45 ఏళ్లే..!

12

- ఖమ్మం జిల్లాకు చెందిన మోహన్‌రావు అనే ఆటోరిక్షా డ్రైవర్‌దీ ఇదే పరిస్థితి..! కొన్నాళ్ల క్రితం విషజ్వరం బారినపడ్డారు. ఆస్పత్రిలో చేరారు. డిశ్చార్జ్ అయినా.. విపరీతమైన ఒంటినొప్పులతో ఆటోరిక్షాను నడపలేకపోతున్నారు. ఇంటికే పరిమితమయ్యారు.


బెంగళూరులో ఆనంద్ మల్లిగావడ్ కృషితో పునరుద్ధరించిన చెరువు

చెరువుల ఆక్రమణను ఉపేక్షిస్తే..

విధ్వంసమే!

ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలి

14

పేదలకు న్యాయం చేయాలి.. పక్కా ఇళ్లు ఇవ్వాలి

పర్యావరణ పరిరక్షణకు మూసీ ప్రాజెక్టు కీలకం

పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు మారిపోతాయ్

సీఎం రేవంత్ హైడ్రా నిర్ణయం దేశానికే మార్గదర్శనం

ఆయన నిజాయితీ నచ్చింది.. పూర్తి సహకారం అందిస్తా

'ఆంధ్రజ్యోతి'తో 'లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్



ఈ చిట్టే.. జగజ్జెట్టే

చైనాలో 12 పెద్ద రోబోల్ని కిడ్నాప్ చేసిన చిన్న రోబో

న్యూఢిల్లీ, నవంబరు 20: అర అడుగు ఎత్తున్న అతి తెలివైన చిన్న రోబో ఒకటి.. పక్క దుకాణంలోకి వెళ్లి, తన కృత్రిమ మేధను ఉపయోగించి 12 పెద్ద రోబోల్ని నైస్‌గా కిడ్నాప్ చేసింది! చైనాలో జరిగిన ఈ ఘటన తాలూకూ సీసీ టీవీ ఫుటేజీ ఇంటర్‌నెట్‌లో తెగ వైరల్ అవుతోంది. ఆ వీడియోలో ఏముందంటే.. హాంగ్‌ఝౌ అనే రోబోల తయారీ సంస్థకు చెందిన ఎర్బై అనే చిన్న రోబో ఒకటి.. షాంఘై రోబోటిక్స్ షోరూమ్‌కి వెళ్లింది. అక్కడ దానికన్నా పెద్దవి డజను రోబోలున్నాయి. వాటిని ఇది ఏమి అడిగిందో ఏమోగానీ.. ఆ పెద్ద రోబోల్లో ఒకటి.. 'నేను అనుమతి లేకుండా బయటకు వెళ్లను' అని చెప్పింది. దానికి ఈ చిన్న రోబో.. 'అయితే, నువ్వు ఇంటికెళ్లవా?' అని అడిగింది. అప్పుడా పెద్ద రోబో.. 'నాకు ఇల్లంటూ ఏదీ లేదు' అని సమాధానమిచ్చింది. "అయితే నాతో వచ్చేయండి' అంటూ ఆ చిన్న రోబో ముందుకు కదలగానే.. వశీకరణానికి గురైనట్టుగా ఆ షోరూమ్‌లోని పెద్ద రోబోలన్నీ దాన్ని అనుసరించాయి. తొలుత చైనాలో ఈ వీడియో వైరల్ అయినప్పుడు ఇదేదో కల్పితమని అందరూ అనుకున్నారు. కానీ.. రెండు రోబో కంపెనీలూ ఈ వీడియో కల్పితం కాదని, నిజంగా జరిగిందని ధ్రువీకరించాయని సమాచారం. పెద్ద రోబోల సిస్టమ్స్‌లో భద్రతపరంగా ఉన్న కొన్ని లోపాలను ఉపయోగించుకుని ఎర్బై వాటిని కిడ్నాప్ చేసిందని, వాటిపై నియంత్రణ సాధించగలిగిందని విచారణలో వెల్లడైంది. అయితే.. చిన్నరోబో తనంత తాను ఇలా చేయడం అసాధ్యమని షాంఘై రోబోటిక్స కంపెనీ చెబుతోంది. దీంతో.. ఎవరో దానికి అలా ప్రోగ్రామింగ్ చేసి ఉండొచ్చనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

అండర్ ట్రయల్ ఖైదీలకు శుభవార్త!

26వ తేదీలోగా వారి విడుదల

శిక్షపడే కాలంలో మూడోవంతు జైల్లోనే మగ్గినవారికి అవకాశం: అమిత్‌షా



గాంధీనగర్, నవంబరు 20: దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న అండర్ ట్రయల్ ఖైదీలకు శుభవార్త. వారి విడుదలకు ముహూర్తం ఖరారైంది. వారిపై మోపిన అభియోగాల ప్రకారం గరిష్ఠంగా ఎంత శిక్ష పడుతుందో.. అందులో మూడోవంతు జైల్లోనే గడిపిన వారిని ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం జరుపుకొనే లోపు విడుదల చేయనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఈ ప్రక్రియను నిర్దిష్ట కాలావధిలోగా పూర్తిచేసేందుకు 60 నిబంధనలను న్యాయస్థానాలు, ప్రాసిక్యూషన్, పోలీసుల ముందు ఉంచామన్నారు. నిర్దిష్ట కాలం తర్వాత కోర్టు విచారణ ముందుకు సాగని కేసుల్లో జైలు అధికారే కోర్టులో బెయిల్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే అవకాశం కల్పించినట్లు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లో అఖిల భారత పోలీసు సైన్స్ కాన్ఫరెన్స్(ఏపీఎస్‌సీ)లో ఆయన ప్రసంగించారు. శిక్ష పడే కాలంలో మూడో వంతు జైల్లోనే మగ్గినా ఇప్పటికీ న్యాయం అందని ఖైదీలు.. రాజ్యాంగ దినోత్సవంలోపు ఒక్కరు కూడా జైల్లో ఉండకూడదన్నది తమ అభిమతమన్నారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 12మంది సైనికులు మృతి

పెషావర్, నవంబరు20: పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 12 మంది సైనికులు, ఆరుగురు ఉగ్రవాదులు మృతిచెందారు. బన్నూ జిల్లాలోని మలిఖేల్ ప్రాంతంలో ఉన్న చెక్‌పోస్ట్ వద్ద ఆత్మాహుతి దాడి సందర్భంగా జరిగిన పేలుడులో భారీ విధ్వంసం జరిగింది. సైనికులు జరిపిన ఎదురుకాల్పుల్లో ఆరుగురు ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ ఆర్మీ ప్రకటించింది. దీనికి ఒక రోజు ముందు అఫ్ఘనిస్థాన్ సరిహద్దులో ఉగ్రవాదులు జరిపిన మరో దాడిలో ఆరుగురు సైనికులు మృతిచెందారు. మరో ఘటనలో ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఉగ్రవాదులు ఏడుగురు సైనికులను అపహరించి వదిలిపెట్టారు. 10 రోజుల క్రితం క్వెట్టా రైల్వే స్టేషన్ వద్ద ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 26 మంది చనిపోగా మృతుల్లో 14 మంది సైనికులున్నారు. బలోచిస్తాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రాంతాల్లో ఉగ్రవాద ఘటనలు పెరిగిపోతుండటంతో ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో సైనిక చర్యకు అనుమతిచ్చారు.

హిమాచల్‌లో 18 పర్యాటక హోటళ్ల మూసివేతకు హైకోర్టు ఆదేశాలు

శిమ్లా, నవంబరు 20: హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వ ఖజానాకు భారంగా మారిన 18 పర్యాటక హోటళ్లను మూసివేయాలంటూ ఆ రాష్ట్ర హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హిమాచల్‌ప్రదేశ్ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ (హెచ్‌పీటీడీసీ) నిర్వహిస్తున్న ఈ హోటళ్లతో నష్టాలే తప్ప ఆదాయం లేదని.. వీటి కోసం ప్రజా వనరులను వృథా చేయడం సరికాదని పేర్కొంది. ఈ హోటళ్లను 'తెల్ల ఏనుగులు'గా అభివర్ణించిన కోర్టు.. వాటిని లాభదాయకంగా మార్చుకోవడంలో హెచ్‌పీటీడీసీ అసమర్థతపై విమర్శలు గుప్పించింది. హెచ్‌పీటీడీసీ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించని ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఫిర్యాదులపై ఈ కేసు ప్రారంభమైంది. ఆ రిటైర్డ్ ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందజేయాలని ఆదేశించిన కోర్టు.. హోటళ్ల మూసివేతకు సంబంధించి తదుపరి చర్యలపై హెచ్‌పీటీడీసీ డైరెక్టర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది.

ఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రం హోమ్

న్యూఢిల్లీ, నవంబరు 20: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో 50 శాతం మందికి వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. అలాగే, ప్రభుత్వ కార్యాలయాల పని వేళల్లోనూ మార్పులు చేసింది. ఫిబ్రవరి 28 వరకు ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయాలు ఉదయం ఎనిమిదన్నర నుంచి సాయంత్రం ఐదు గంటల దాకా పని చేస్తాయని, ఢిల్లీ ప్రభుత్వ కార్యాలయాలు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఆరున్నర దాకా పని చేస్తాయని వెల్లడించింది.

500 మంది భారతీయులను అక్రమంగా అమెరికా సరిహద్దుల్లోకి పంపించాను

అమెరికాలో మానవ స్మగ్లర్ రాజిందర్ అంగీకారం

న్యూఢిల్లీ, నవంబరు 20: తానొక్కడే ఐదు వందల మందికి పైగా భారతీయులను నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా కెనడా సరిహద్దులను దాటించి అమెరికాకు చేరవేశానని రాజిందర్‌సింగ్ అనే మానవ స్మగ్లర్ అమెరికా పోలీసుల ఎదుట అంగీకరించాడు. కెనడా గుండా అమెరికాకు చేరవేస్తామని చెప్తూ ఆశావహులను కెనడాకు పంపే ఏజెంట్లు భారత్‌లో ఉన్నారని తెలిపాడు. గుజరాత్‌కు చెందిన జగదీశ్ పటేల్, ఆయన భార్య, ఇద్దరు పిల్లలు 2022లో కెనడాలోని మానవ స్మగ్లర్ల సాయంతో అమెరికా సరిహద్దులు దాటే క్రమంలో చలికి తట్టుకోలేక చనిపోయారు. ఈ కేసు దర్యాప్తులో రాజిందర్ సింగ్(పంజాబ్ నుంచి వెళ్లి కెనడాలో స్థిరపడ్డాడు) అమెరికా పోలీసుల ఎదుట వాంగ్మూలం ఇచ్చాడు. అయితే, తనకు జగదీశ్ కుటుంబం చనిపోవడానికి సంబంధం లేదన్నాడు. 2022 జనవరిలో ఫెనిల్ పటేల్ అనే స్మగ్లర్ సాయంతో జగదీశ్ పటేల్ కుటుంబం అమెరికాలోకి వెళ్లడానికి ప్రయత్నించింది. సరిహద్దుల నుంచి తమను తీసుకువెళ్లాల్సిన కారు రాకపోవడంతో మంచుకు గడ్డకట్టుకుపోయి వారు అక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో పోలీసులు ఫెనిల్‌తో పాటు హర్షకుమార్ పటేల్, స్టీవ్ షాండ్‌లను కూడా అమెరికా పోలీసులు నిందితులుగా చేర్చారు. అయితే, మనుషుల స్మగ్లింగ్ గురించిన సమాచారం కోసం.. తమ అదుపులో ఉన్న రాజిందర్ నుంచి వివరాలు రాబట్టారు. ఫెనిల్‌ను తాను 2015లో కలిసినట్లు రాజిందర్ చెప్పాడు. అప్పటి నుంచి ఇద్దరూ కలిసి పనిచేసినట్లు వివరించాడు. రాజిందర్ 2023 ఫిబ్రవరిలో పోలీసుల ఎదుట లొంగిపోయాడు.

మహాయుతిదే మహారాష్ట్ర?

(మొదటి పేజీ తరువాయి)

అంచనా వేస్తున్నారు. ఆ రాష్ట్రంలో.. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ, నగర ప్రాంతాల్లో ఓటింగ్ శాతం చాలా తక్కువగా నమోదైంది. ముంబై (49%), పుణె (54.1%), ఠాణే (49.9%) వంటి నియోజకవర్గాలతో పోలిస్తే.. వామపక్ష తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉన్న గడ్చిరోలి జిల్లాలో 69.6% పోలింగ్ నమోదు కావడం గమనార్హం. అసెంబ్లీ ఎన్నికలతోపాటు.. నాందేడ్ లోక్‌సభ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో కడపటి వార్తలందే సమయానికి 53.8% పోలింగ్ నమోదైంది. మహారాష్ట్రలో గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత.. ప్రాంతీయ పార్టీలైన శివసేన, ఎన్సీపీ చీలిపోయి చెరో వర్గం బీజేపీ, కాంగ్రెస్‌తో జట్టు కట్టడంతో ఈ ఎన్నికలు రసవత్తరంగా మారిన సంగతి తెలిసిందే. బీజేపీ, శివసేన(ఏక్‌నాథ్ షిండే), ఎన్‌సీపీ (అజిత్ పవార్) పార్టీలతో కూడిన మహాయుతి.. కాంగ్రెస్, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్‌సీపీ(శరద్ పవార్) పార్టీలతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటములు నువ్వా నేనా అన్నట్టు తలపడ్డాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైని కలిగి ఉన్న మహార్ట్రాలో గెలుపును జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పోరాడాయి. ఈ క్రమంలో.. మహారాష్ట్రలో మహిళా ఓటర్లను ఆకర్షించడానికి మహాయుతి ప్రభుత్వం తెచ్చిన 'లాడ్లీ బెహనా యోజన' గేమ్ చేంజర్‌గా మారిందని.. హిందూ ఓటర్లను ఏకం చేయడమే లక్ష్యంగా 'బటేంగేతో కటేంగే.. ఏక్ రహేంగేతో నేక్ రహేంగే (విడిపోతే పడిపోతాం.. కలిసుంటే క్షేమంగా ఉంటాం)' అంటూ విస్తృతంగా ప్రచారం చేసిన నినాదం పనిచేసిందని సర్వే సంస్థలు తెలిపాయి. మొత్తమ్మీద.. ఐదు నెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో మహారాష్ట్ర ఓటర్లు భిన్నమైన తీర్పు ఇవ్వబోతున్నారని 3-4 సంస్థలు మినహా అన్ని ప్రముఖ సర్వే సంస్థలూ తేల్చి చెప్పాయి. చాలా సంస్థలు.. ఎక్కువ సీట్లు బీజేపీకి దక్కనున్నట్టు వెల్లడించాయి. లోక్‌షాహి మరాఠీ రుద్ర, దైనిక్ భాస్కర్ ఎగ్జిట్ పోల్స్ హంగ్ అసెంబ్లీ ఏర్పడే అవకాశం ఉందని తెలపగా.. ఎలక్టోరల్ ఎడ్జ్ సంస్థ 150 సీట్లతో మహా వికాస్ అఘాడీ కూటమి విజయం సాధిస్తుందని పేర్కొనడం విశేషం.

గత ఎగ్జిట్ పోల్స్ ఇలా..

ఒకటి రెండు సర్వే సంస్థలు మినహా దాదాపు అన్ని సంస్థలూ ఈ ఎన్నికల్లో రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ కూటమిదే గెలుపని ప్రకటించాయి సరే.. మరి 2019లో ఆయా సంస్థల సర్వేలు ఎంతవరకూ నిజమయ్యాయి? అంటే.. ఇండియా టుడే-యాక్సిస్ సంస్థ ఎగ్జిట్ పోల్స్ అసలు ఫలితాలకు దగ్గరగా వచ్చాయి. బీజేపీ శివసేన కూటమికి 166 నుంచి 194 సీట్లు వస్తాయని ఆ సంస్థ అంచనా వేయగా.. ఆ రెండు పార్టీలకూ కలిపి 161 సీట్లు వచ్చాయి! అలాగే.. కాంగ్రెస్, ఎన్సీపీ కూటమికి 72 నుంచి 90 సీట్లు వస్తాయని పేర్కొనగా 98 సీట్లు వచ్చాయి! మిగతా అన్ని సంస్థలూ ఎన్డీయే కూటమికి 200కు పైగా, యూపీఏ కూటమికి 70లోపు సీట్లు వస్తాయని వేసిన అంచనాలు వాస్తవ ఫలితాలతో సరిపోలలేదు. ఝార్ఖండ్ విషయానికి వస్తే 2019లో ఆ రాష్ట్రంలో యూపీఏ (కాంగ్రెస్, జేఎంఎం) కూటమికి 43 సీట్లు, బీజేపీకి 27 సీట్లు వస్తాయని ఇండియాటుడే-యాక్సిస్ సర్వే అంచనా వేయగా.. యూపీఏ కూటమికి 46 సీట్లు, బీజేపీకి 25 వచ్చాయి. టైమ్స్‌నౌ కూడా వాస్తవ ఫలితాలకు దగ్గరగానే తెలిపింది. యూపీఏ కూటమికి 44 సీట్లు, బీజేపీకి 28 వస్తాయని ఆ సంస్థ ఎగ్జిట్‌పోల్‌లో వెల్లడైంది.



నాగ్‌పూర్‌లోని ఓ పోలింగ్ కేంద్రంలో ఓటర్లు

ఝార్ఖండ్‌లోనూ..

ఝార్ఖండ్‌లో ఎన్డీయే ఈసారి హేమంత్ సొరెన్ ప్రభుత్వాన్ని ఓడించడం ఖాయమని యాక్సిస్ మై ఇండియా సర్వే సంస్థ తప్ప మినహా అన్ని సంస్థల ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడైంది. జేఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జేడీ, సీపీఐ(ఎంఎల్)తో కూడిన 'ఇండియా' కూటమి.. బీజేపీ, ఏజేఎస్‌యూ, జేడీయూ, ఎల్‌జేపీతో కూడిన ఎన్డీయే కూటమి ఈ ఎన్నికల్లో పోటాపోటీగా తలపడ్డాయి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపినట్లు పీపుల్స్ పల్స్ సంస్థ తెలిపింది. అదే సమయంలో.. 14 శాతానికి పైగా ఉన్న ముస్లింలు, 4 శాతానికి పైగా ఉన్న క్రైస్తవులు ఇండియా కూటమికి మద్దతు తెలిపినట్టు వెల్లడించింది.



ఝార్ఖండ్ రాజధాని రాంచీలో

ఝార్ఖండ్ మొత్తం స్థానాలు- 81, మ్యాజిక్ ఫిగర్: 41


సంస్థ	ఎన్డీయే	ఇండియా	ఇతరులు
పీపుల్స్ పల్స్	42-48	16-23	8-14
పీ-మార్క్	31-40	37-47	1-6
చాణక్య స్ట్రాటజీస్	45-50	35-38	3-5
టైమ్స్ నౌ-జేవీసీ	40-44	30-40	0-1
మ్యాట్రిజ్	42-47	25-30	1-4
యాక్సిస్ మై ఇండియా	25	53	3

వివిధ సంస్థల ఎగ్జిట్ పోల్స్ ఇలా..

మహారాష్ట్ర మొత్తం స్థానాలు- 288, మ్యాజిక్ ఫిగర్: 145

సంస్థ	మహాయుతి	ఎంవీఏ	ఇతరులు
టైమ్స్ నౌ-జేవీసీ	150-167	107-125	13-14
పీపుల్స్‌పల్స్	175-195	85-112	7-12
చాణక్య స్ట్రాటజీస్	152-160	130-138	6-8
మ్యాట్రిజ్	150-170	110-130	8-10
న్యూస్ 24-చాణక్య	152-160	130-138	6-8
పోల్ డైరీ	122-186	69-121	10-27
పీ-మార్క్	137-157	126-156	2-8
లోక్‌షాహి మరాఠీ రుద్ర	128-142	125-140	18-23
దైనిక్ భాస్కర్	125-140	135-150	20-25
ఎలక్టోరల్ ఎడ్జ్	118	150	20

లోకం తీరు



మోదీకి సాధ్యం కాని పని.. మేం చేసి చూపిస్తున్నాం!

తెలంగాణలో మరో 3 వారాల్లో కులగణన పూర్తి: రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, నవంబరు 20: ప్రధాని మోదీ గత మూడేళ్లలో చేయలేని కులగణనను తెలంగాణలోని తమ ప్రభుత్వం మరో మూడు వారాల్లో పూర్తి చేయనుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. 'తెలంగాణలో మా ప్రభుత్వం ఇప్పటికే 70 శాతానికి పైగా కులగణనను పూర్తి చేసింది. విధానాల రూపకల్పనలో, సామాజిక న్యాయాన్ని బలోపేతం చేయటంలో ఆ సమాచారాన్ని వినియోగిస్తాం' అని తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎక్స్‌లో రాహుల్ హిందీలో ఓ పోస్ట్ పెట్టారు. వచ్చే కొన్ని దశాబ్దాల కాలంలో సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు రచించటానికి అవసరమైన అత్యంత ముఖ్యమైన చర్యల్లో కులగణన మొట్టమొదటిదని రాహుల్ స్పష్టం చేశారు. అందువల్లే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన జరగాలని తాను పదేపదే డిమాండ్ చేస్తున్నానన్నారు. 'తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి దారి చూపింది. జాతీయస్థాయిలోనూ కులగణన జరిగేలా చర్యలు తీసుకుంటాం' అని రాహుల్ పేర్కొన్నారు.

ప్రసారభారతి ఓటీటీ యాప్ వేవ్స్

న్యూఢిల్లీ, నవంబరు20: ప్రసారభారతి వేవ్స్ పేరిట ఓటీటీ యాప్ ప్రారంభించింది. ఈ యాప్ ద్వారా ప్రస్తుతం బీ4యూ, ఏటీజెడ్‌వై, ఎస్‌ఏబీ, 9ఎక్స్ మీడియాతో పాటు ఇండియా టుడే, న్యూస్ నేషన్, రిపబ్లిక్, ఏబీపీ న్యూస్, న్యూస్24, ఎన్డీటీవీ ఇండియా న్యూస్ వంటి 40 లైవ్ చానెళ్లు అందుబాటులో ఉన్నాయి. దూరదర్శన్, ఆకాశవాణికి సంబంధించిన ప్రసారభారతి ఆర్కైవ్స్ చూసేందుకు కూడా వినియోగదారులకు అవకాశమిచ్చింది.

1945 దాటి ముందుకు కదలని భద్రతామండలి!

ఐరాసలో భారత ప్రతినిధి హరీశ్ విమర్శ



న్యూయార్క్, నవంబరు 20: ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో సంస్కరణలు చాలా మందకొడిగా సాగుతుండటంపై భారతదేశం అసంతృప్తి వ్యక్తం చేసింది. కాలం చెల్లిన నిర్మాణంతో అది ఆధునిక ప్రపంచ వాస్తవాలను ఏ మాత్రం ప్రతిబింబించట్లేదని విమర్శించింది. 'అంతర్జాతీయ కీలక సవాళ్లు: భారతదేశ మార్గం' అనే అంశంపై కొలంబియా వర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ అండ్ పబ్లిక్ అఫైర్స్‌లో ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి, రాయబారి పర్వతనేని హరీశ్ ప్రసంగించారు. 'భద్రతామండలిలో ప్రస్తుతం ఉన్న వ్యవస్థ 1945 సంవత్సరం నాటి దశను ప్రతిబింబిస్తోంది' అన్నారు. 'ఇప్పటికే శాశ్వత సభ్యులుగా ఉన్న దేశాలు, ఆ సభ్యత్వాన్ని, వీటో అధికారాన్ని కూడా వదులుకునేందుకు అవి సిద్ధంగా లేవు' అన్నారు.

సీబీఎస్‌ఈ పరీక్షలు ఫిబ్రవరి 15 నుంచి

10,12 తరగతుల పరీక్షల షెడ్యూల్ విడుదల

న్యూఢిల్లీ, నవంబరు 20: పది, పన్నెండు తరగతుల విద్యార్థులకు నిర్వహించే ప్రధాన పరీక్షల షెడ్యూల్‌ను సీబీఎస్‌ఈ బుధవారం ప్రకటించింది. 2025 ఫిబ్రవరి 15 నుంచి 10, 12 తరగతుల విద్యార్థులకు పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 15న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీన ముగుస్తాయి. అలాగే, ఫిబ్రవరి 15 నుంచే మొదలయ్యే 12వ తరగతి పరీక్షలు ఏప్రిల్ 4న ముగుస్తాయి.

ఆహారోత్పత్తి పెరిగినా.. ఆకలి కేకలు!

ఆకలి కోరల్లోకి మరో 15 కోట్ల మంది

ఆందోళన రేపుతున్న ఎఫ్ఏవో నివేదిక

న్యూఢిల్లీ, నవంబరు 20: గత రెండు దశాబ్దాలతో పోలిస్తే ప్రపంచవ్యాప్తంగా ఆహార ఉత్పత్తి 55 శాతానికిపైగా పెరిగింది. వరి, గోధుమ, మొక్కజొన్న.. విరివిగానే పండిస్తున్నారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆకలి కేకలు పెరుగుతూనే ఉన్నాయి. కరోనా మహమ్మారికి ముందు 2019తో పోలిస్తే 2023లో మరో 15.2 కోట్ల మంది ఆకలి బాధితులుగా మారారని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) తాజాగా విడుదల చేసిన వార్షిక సంచికలో వెల్లడైంది. 2030 నాటికల్లా ఆకలిని తరిమికొట్టి సుస్థిరాభివృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తున్న ఐక్యరాజ్యసమితి లక్ష్యానికి ఈ పరిస్థితి తూట్లు పొడిచేలా ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఎఫ్ఏవోకు చెందిన స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ద వరల్డ్ (ఎస్‌వోఎఫ్ఐ) ఈ ఏడాది జూలైలో విడుదల చేసిన నివేదిక కూడా ఇదే అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. 2023లో మొత్తం 71 కోట్ల నుంచి 75 కోట్ల మంది ఆకలిని ఎదుర్కొన్నారని ఈ నివేదిక వివరించింది.

ఆఫ్రికా, ఆసియాలో సమస్య తీవ్రం

2020తో పోలిస్తే 2021లో పోషకాహార లోపం కాస్త తగ్గినప్పటికీ... 2023 వరకూ అదే స్థాయిలో కొనసాగిందని ఈ నివేదిక పేర్కొంది. పోషకాహార లోపం ఆఫ్రికాలో ఎక్కువగా ఉండగా.. ఆసియా ఆ తర్వాతి స్థానంలో ఉందని వెల్లడించింది. 2019-23 మధ్య చూస్తే ఆసియాలో ఆకలిని ఎదుర్కొన్న వారి సంఖ్య బాగా పెరిగిందని తెలిపింది. ప్రపంచ గణాంకాలను పరిశీలిస్తే 2022లో ప్రాథమిక పంటల ఉత్పత్తి 960 కోట్ల టన్నులకు చేరుకుంది. 2000వ సంవత్సరంతో పోలిస్తే ఇది 56 శాతం అధికం. ఈ పెరుగుదలలో మొక్కజొన్న, గోధుమ, వరి, చెరకు వాటానే ఎక్కువ. అలాగే 2000తో పోలిస్తే 2022 నాటికి మాంసం ఉత్పత్తి కూడా 55% పెరిగింది. ఈ పెరుగుదలలో చికెన్ వాటా ఎక్కువగా ఉంది. అంటే ప్రపంచవ్యాప్తంగా ఆహారోత్పత్తి పెరుగుతున్నప్పటికీ.. ఆహార అభద్రతాభావం కూడా అధికం కావడం ఆందోళన కలిగించే అంశం. ఇది ఆహార ఉత్పత్తి, కొరత వల్ల ఏర్పడ్డ సమస్య కాదని, ఉత్పత్తి అయిన ఆహారం అందరికీ అందకపోవడం, ఆర్థిక అసమానతలు దీనికి కారణమని నిపుణులు పేర్కొంటున్నారు.



బాల భారతానికి పర్యావరణ సవాళ్లు

2050 నాటికి దేశంలో 35 కోట్ల మంది పిల్లలు

వారి భవిష్యత్తుకు తక్షణ కార్యాచరణ అవసరం

యునిసెఫ్ నివేదికలో వెల్లడి

న్యూఢిల్లీ, నవంబరు 20: తీవ్రమైన పర్యావరణ, ప్రమాదకరమైన వాతావరణ దుష్ప్రభావాలు భారతదేశంలో బాలల భవిష్యత్తుపై పడనున్నాయని యునిసెఫ్ హెచ్చరించింది. 2050 నాటికి దేశంలో 35 కోట్ల మంది పిల్లలు ఆ ప్రభావాన్ని చవి చూడనున్నారని తెలిపింది. వారి శ్రేయస్సుతో పాటు హక్కులను కాపాడటానికి ఆ సవాళ్లకు వెంటనే పరిష్కారాలు కనుగొనాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. ప్రపంచ బాలల స్థితి రిపోర్టు 2024ను మారుతున్న ప్రపంచంలో బాలల భవిష్యత్తు పేరుతో యునిసెఫ్ బుధవారం ఇక్కడ విడుదల చేసింది. దీనిలో మూడు మెగా ట్రెండ్స్‌ను యునిసెఫ్ ప్రముఖంగా ప్రస్తావించింది. అందులో జనాభాలో మార్పు, పర్యావరణ సంక్షోభం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నాయి. ఇవే 2050 కల్లా పిల్లల తలరాతను మారుస్తాయని స్పష్టం చేసింది. 2050వ దశకంలో అనూహ్య రీతిలో బాలలపై పర్యావరణ, వాతావరణ దుష్ప్రభావాలు పడతాయని, 2000 నాటితో పోలిస్తే 8 రెట్లు ఎక్కువ మంది పిల్లలు హీట్‌వేవ్ ప్రభావానికి లోనవుతారని అంచనావేసింది. ఇప్పటితో పోలిస్తే భారత్‌లో పిల్లల జనాభా 2050 నాటికి 10 కోట్లకు పైగా తగ్గుతుందని నివేదికలో యునిసెఫ్ తెలిపింది. 2050 నాటికి భారత జనాభాలో దాదాపు సగం మంది పట్టణాల్లో నివసించే అవకాశం ఉంది కాబట్టి చైల్డ్ ఫ్రెండ్లీ అర్బన్ ప్లానింగ్ అవసరమని యునిసెఫ్ సూచించింది.

రష్యాలో ఏం జరుగుతోంది?

అణు కేంద్రాలను సందర్శిస్తున్న సెర్గీ షోయిగు

కీవ్‌లో అమెరికా, ఇటలీ, ఎంబసీలు ఖాళీ



మాస్కో, నవంబరు 20: యుద్ధం ప్రారంభమైన 1000వ రోజున ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడులు జరిపిన నేపథ్యంలో.. రష్యా అప్రమత్తమైంది. రష్యా భద్రత మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు ఆ దేశంలోని అణు కేంద్రాలను సందర్శిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం సరోవ్ అణు కేంద్రానికి చేరుకున్నారు. అక్కడి లేజర్, సూపర్ కంప్యూటర్లు, ఇతర సాంకేతిక పరిజ్ఞానాన్ని పరిశీలించారు. అయితే, ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అర్థవంతమైన ఎంపికలను మాస్కో స్వాగతిస్తుందని ఐక్యరాజ్య సమితి(ఐరాస)లో రష్యా మొదటి డిప్యూటీ శాశ్వత ప్రతినిధి పొలియాన్‌స్కీ వెల్లడించారు. మరోవైపు.. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌లో ఉన్న తమ రాయబార కార్యాలయాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా ప్రకటన తర్వాత ఇటలీ, స్పెయిన్, గ్రీస్ కూడా ఇదే తరహా ప్రకటనలు చేశాయి. రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులతో దాడులకు ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో.. తమ రాయబార కార్యాలయం లక్ష్యంగా దాడులు జరిగే ముప్పు ఉందన్న నిఘావర్గాల సమాచారంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా వివరించింది. తమ ఉద్యోగులను సురక్షిత షెల్టర్లలో తలదాచుకోవాలని సూచించినట్లు తెలిపింది. కాగా.. అమెరికా-రష్యా మధ్య ఉద్రిక్తతలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇరుదేశాల మధ్య హాట్‌లైన్‌కు స్వస్తి పలికినట్లు క్రెమ్లిన్ ప్రతినిధి పెస్కోవ్ వెల్లడించారు.

ఉక్రెయిన్‌కు.. అమెరికా యాంటీ-పర్సనల్ మైన్స్

కీవ్, నవంబరు 20: రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణుల ప్రయోగానికి ఉక్రెయిన్‌కు అనుమతినిచ్చిన తర్వాతి రోజే.. బైడెన్ సర్కారు మరో దూకుడు నిర్ణయాన్ని ప్రకటించింది. ఉక్రెయిన్ భూభాగంలోకి రష్యా సేనలు చొచ్చుకురాకుండా ఉండేలా.. యాంటీ-పర్సనల్ మైన్స్‌ను ఇవ్వాలని నిర్ణయించింది. ఉక్రెయిన్ ఈ మందుపాతరలను తూర్పు ప్రాంతాల్లో(డాన్‌బాస్, ఖెర్సోన్, మారియూపోల్) వినియోగించనుంది. ఈ ప్రాంతాల్లో రష్యా సేనలు స్థిరంగా చొచ్చుకువస్తుండడంతో.. యాంటీ-పర్సనల్ మైన్స్‌తో చెక్ పెట్టవచ్చని అమెరికా భావిస్తోంది. ఇవి ప్రమాదకరమైనవి. వాటిపై కాలు పెడితే.. శాల్తీలే లేచిపోతాయి. లేదంటే.. శాశ్వత అంగవైకల్యం మిగులుతుంది. అయితే.. అమెరికా సరఫరా చేయనున్న యాంటీ-పర్సనల్ మైన్స్‌లకు టైమర్లు ఉంటాయని, నిర్దీత కాలం(బ్యాటరీ సామర్థ్యం మేరకు 4 గంటల నుంచి 2 వారాలు) తర్వాత వాటంతట అవే నిర్వీర్యం అయ్యేలా ప్రోగ్రామ్ చేసి ఉంటాయని అమెరికా పేర్కొంటోంది.

జీ20 డిక్లరేషన్‌లో మాస్కోపై మెతక వైఖరి!

న్యూఢిల్లీ, నవంబరు 20: ఉక్రెయిన్‌పై రష్యా దాడిని ఖండించడంలో జీ-20 సదస్సు డిక్లరేషన్ వరుసగా రెండో ఏడాది కూడా విఫలమైంది. అయితే యుద్ధాన్ని ముగించాలని రాబోయే ట్రంప్ ప్రభుత్వం నుంచి ఒత్తిడి వస్తున్న నేపథ్యంలో కీవ్‌కు మద్దతు అందించే విషయంలో ఉదాసీనతను ప్రదర్శించింది. అంతకుముందు ఢిల్లీ డిక్లరేషన్ కూడా రష్యా పట్ల మెతక వైఖరి అవలంబించింది. ఢిల్లీ డిక్లరేషన్‌లో రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై ఏడు పేరాలు ఉండగా, ఇప్పుడు ఒక్క పేరాతో సరిపెట్టారు. అలాగే 'ఇది యుద్ధాల యుగం కాదు' అని పుతిన్‌తో జరిపిన చర్చల్లో ప్రధాని మోదీ ఇచ్చిన సందేశానికి కూడా రియో డిక్లరేషన్‌లో స్థానం దక్కలేదు. సమగ్ర కాల్పుల విరమణ కోరుతూ... యుద్ధం కారణంగా ఆహార ఇంధన భద్రత,, పంపిణీ వ్యవస్థల ఛిన్నాభిన్నం, ఆర్థిక అస్థిరత, ద్రవ్యోల్బణం, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయని తాజా తీర్మానం ఆందోళన వ్యక్తం చేసింది. రష్యా పేరు ప్రస్తావించకుండానే అణ్వాయుధాలను ప్రయోగిస్తామని బెదిరించడాన్ని ఏమాత్రం ఆమోదించబోమని స్పష్టం చేసింది.

మరో పదేళ్లు చంద్రబాబే సీఎం

» ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్లకు ఏపీ ఎకానమీ

» చంద్రబాబు విజన్‌తో తిరిగి నమ్మకం ఏర్పడింది

» ఆయన ఆదేశాల మేరకు మేం పనిచేస్తాం

» ఏపీ అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



అమరావతి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మరో పదేళ్లపాటు ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబే ఉంటారని, రాబోయే ఐదేళ్లలో ఏపీ ఎకానమీ 1 ట్రిలియన్ డాలర్ల(రూ.8.43 లక్షల కోట్లు)కు చేరుతుందని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఇటీవల తాను మహారాష్ట్రకు వెళ్లినప్పుడు ఆ రాష్ట్రం ఈ మైలురాయి చేరుతుందని చెప్పానని, అయితే, విధ్వంసానికి గురైన ఏపీలో అది సాధ్యం కాదేమోనని అనుకున్నానని చెప్పారు. కానీ.. సీఎం చంద్రబాబు విజన్, ఆయన పాలనానుభవం చూశాక ఐదేళ్లలో 1 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్న నమ్మకం ఏర్పడిందన్నారు. 150 రోజుల పాలనపై బుధవారం అసెంబ్లీలో జరిగిన చర్చలో ఉపముఖ్యమంత్రి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఎప్పుడూ 1న జీతాలు రాలేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. అయితే, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక సకాలంలో జీతాలు అందుతున్నాయని చెప్పారు. 13,326 గ్రామ పంచాయతీలకు పల్లె పండగ కింద రూ.4500 కోట్లు విడుదల చేశామన్నారు. 'జల్‌జీవన్ మిషన్‌లో ఏపీని నంబర్‌వన్ చేస్తామని సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు. సంక్షోభాలు, విపత్తులు సంభవించినప్పుడు ఎలా ఉండాలో చంద్రబాబును చూసి నేర్చుకోవాలని పవన్ సూచించారు. విజయవాడ వరదల సమయంలో బురదలో దిగి పనిచేశారని గుర్తు చేశారు. "కావాలంటే చంద్రబాబు కమాండ్ సెంటర్‌లో కూర్చుని పనులు చేయించవచ్చు. కానీ, ఆయనే స్వయంగా వెళ్లి వరదల్లో పర్యటించి బాధితులకు ఉపశమనం కల్పించారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ఏకంగా ముగ్గురు ఐపీఎస్‌లను సస్పెండ్ చేసిన ఘనత బాబుకే దక్కుతుంది. సీఎంను సోషల్ మీడియాలో తిట్టినట్లుగానే గ్రామాల్లో మహిళలను బూతులు తిడుతున్నారు. అలాంటి వారిపై సీఎం, హోంమంత్రి ఉక్కుపాదం మోపారు" అని పవన్ అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా తాము పనిచేస్తామని చెప్పారు.

నాకంటే పవనే గట్టిగా ఉన్నారు: చంద్రబాబు

ఉపముఖ్యమంత్రి స్పందనకు సీఎం చంద్రబాబు ప్రతిస్పందిస్తూ.. "సోషల్ మీడియా, గంజాయి అంశాల్లో నా కంటే పవన్ కల్యాణే గట్టిగా ఉన్నారు. నేరాల విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీపడదు. సోషల్ మీడియా పేరుతో మహిళల్ని కించపరిస్తే వారికి అదే చివరి రోజు అవుతుంది. ప్రతిరోజూ సోషల్ మీడియాలో మాపై ఎలాంటి కామెంట్లు పెట్టారోనని చూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. వ్యక్తిత్వ హననానికి పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం. రౌడీలను రాష్ట్రంలో లేకుండా చేస్తాం. ఎమ్మెల్యేలు శాంతిభద్రతలను చేతిలోకి తీసుకోవద్దు. అది ప్రభుత్వ బాధ్యత" అని అన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్!!

అమరావతి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని ప్రజాగళం యాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. రాయలసీమలోని 8 జిల్లాలను దీని పరిధిలోకి తేవాలని నిర్ణయించారు. బెంచ్ ఏర్పాటుకు అవసరమైన సమాచారం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాసింది. సీమ ప్రాంతం పరిధిలో ప్రస్తుతం హైకోర్టులో ఎన్ని కేసులున్నాయో తెలపాలని కోరింది. సివిల్, క్రిమినల్, రివిజన్లు, రిట్ పిటిషన్లు, పారిశ్రామిక, పన్ను వివాదాలతో ముడిపడిన కేసులు, ఇతరత్రా కేసుల సంఖ్యకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే రెండు మూడేళ్లుగా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు పంపాలని అభ్యర్థించింది. ఒక బెంచ్ కొత్తగా ఏర్పాటు చేయాలంటే.. మొత్తం కేసుల్లో మూడింట ఒక వంతు సదరు ప్రాంతం పరిధిలో ఉండాలి. రాష్ట్ర విభజన చట్టంలోని సెక్షన్ 32 (3) ప్రకారం.. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు గవర్నర్ ఆమోదం లభిస్తే బెంచ్ ఏర్పాటు చేయవచ్చు.

నరేందర్‌రెడ్డే కీలక కుట్రదారు!

సురేశ్‌తో 89 సార్లు ఫోన్ మాట్లాడారు.. లగచర్ల కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు

» పిటిషనర్ ఘటనా స్థలంలోనే లేరు

» నరేందర్‌రెడ్డితరపు లాయర్ వాదన

» పార్కులో అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏంటి?: హైకోర్టు

» విచారణ నేటికి వాయిదా



హైదరాబాద్/కొడంగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): లగచర్లలో భూసేకరణకు సంబంధించిన విచారణకు వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై దాడికి పాల్పడిన ఘటనలో ఏ-1గా ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కీలక కుట్రదారుడని రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు చెప్పారు. ఏ-2గా ఉన్న సురేశ్, ఇతర నిందితులకు ఆర్థికంగా, నైతికంగా సహకరించారని తెలిపారు. సురేశ్‌తో దాదాపు 89 సార్లు ఫోన్‌కాల్స్ మాట్లాడారంటే కుట్రలో నరేందర్‌రెడ్డి పాత్ర ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. పిటిషనర్ ప్రోత్సాహంతోనే నిందితులు కలెక్టర్ సహా ఇతర అధికారులను హత్య చేయాలనే కుట్రతో దాడికి తెగబడ్డారని తెలిపారు. ఈ కేసులో కొడంగల్ కోర్టు జారీచేసిన రిమాండ్ ఉత్తర్వులను కొట్టేయాలంటూ పట్నం నరేందర్‌రెడ్డి హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ బుధవారం జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పోలీసులు, ప్రభుత్వం తరపున నాగేశ్వర్ రావు వాదిస్తూ.. పిటిషనర్ అరెస్ట్ సందర్భంగా అన్ని నిబంధనలు పాటించామన్నారు. దాడికి కుట్రలో పిటిషనర్ పాత్ర స్పష్టంగా ఉందని.. ఇవన్నీ దర్యాప్తులో తేలతాయని, అప్పటివరకు కోర్టు జోక్యం చేసుకోవద్దని విన్నవించారు. మరోవైపు పిటిషనర్ దిగువ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని, పోలీసులు కస్టడీ కోరుతున్నారని.. దిగువ కోర్టులో ఈ పిటిషన్లు విచారణలో ఉన్నాయని తెలియజేశారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది గండ్ర మోహన్‌రావు వాదిస్తూ.. నరేందర్‌రెడ్డి అరెస్ట్ సందర్భంగా పోలీసులు నిబంధనలను పాటించలేదన్నారు. ఆయన ఘటనా స్థలంలో లేరనే విషయాన్ని గుర్తించాలన్నారు. పార్టీ కార్యకర్తలతో నాయకులు మాట్లాడడం సహజమని చెప్పారు. 'మొదటి రిమాండ్ కేస్ డైరీలో పిటిషనర్ పేరు లేదు. భూములు కోల్పోతున్న రైతులు ఆవేశానికి గురైతే.. దానికి ప్రభుత్వాన్ని అస్థిరపర్చాలనే కుట్ర, హత్య చేయాలనే ఉద్దేశంతో దాడి వంటి తీవ్ర ఆరోపణలు చేశారు. కేబీఆర్ పార్కులో వాకింగ్ చేస్తుండగా మఫ్టీలో వచ్చిన 12 మంది పోలీసులు పిటిషనర్‌ను ఎత్తుకెళ్లారు. ఒక్క బీఎన్ఎస్ఎస్ 109 సెక్షన్ తప్ప మిగతావన్నీ ఏడేళ్లలోపు శిక్షపడే సెక్షన్లే. రిమాండ్ విధించరనే ఉద్దేశంతోనే 109సెక్షన్ పెట్టారు. కోర్టులో ప్రవేశపెట్టిన తర్వాతే తనను ఏ-1గా చేర్చారని నిందితుడికి తెలిసింది. పిటిషనర్ ఎలాంటి నేరాంగీకార వాంగ్మూలం ఇవ్వకుండానే ఇచ్చినట్లుగా పోలీసులు సొంతంగా రాసేసుకున్నారు. తాను ఏ స్టేట్‌మెంట్ ఇవ్వలేదని చర్లపల్లి జైల్లో ఉన్న పిటిషనర్ దిగువ కోర్టులో అఫిడవిట్ సమర్పించారు' అని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. 'పిటిషనర్ ఒక మాజీ ఎమ్మెల్యే. ఆయనకు 1+1 సెక్యూరిటీ ఉంటుంది. పార్కులో వాకింగ్ చేస్తుండగా అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏంటి? ఆయన ఏమైనా ఉగ్రవాదా? పారిపోతారా? ఇంటికి వెళ్లిన తర్వాత అరెస్ట్ చేసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వాల్సింది' అని వ్యాఖ్యానించింది. దీనికి పీపీ సమాధానం ఇస్తూ.. ఇంటి వద్దే అరెస్ట్ చేశామని, సన్నిహితులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. పిటిషనర్ ప్రత్యక్షంగా అక్కడ లేరని, కుట్ర ఆరోపణలే ఉన్నందున రిమాండ్ అవసరమేంటని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్‌పాత్రకు సంబంధించిన వివరాలతోపాటు ప్రత్యక్ష సాక్షుల స్టేట్‌మెంట్లు ఇవ్వాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది.

నిబంధనలను అనుసరించలేదని కేసు..

తన భర్త అరెస్టు సందర్భంగా నిబంధనలను అనుసరించలేదని, బాధ్యులైన పోలీసు అధికారులను శిక్షించాలని పేర్కొంటూ నరేందర్‌రెడ్డి భార్య శృతి హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. 'డీకే బసు' సహా పలు సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘించిన పోలీసు అధికారులు వి.సత్యనారాయణ (ఐపీఎస్), కె.నారాయణరెడ్డి (ఐపీఎస్), సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై అబ్దుల్ రహూఫ్ తదితరులను శిక్షించాలని పిటిషనర్ కోరారు.

కొడంగల్ నుంచే రేవంత్‌రెడ్డి పతనం: నరేందర్‌రెడ్డి

రైతులకు మద్దతు ఇచ్చినందుకే తనపై అక్రమ కేసులు పెట్టారని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆరోపించారు. రైతులకు అండగా ఉంటే జైలుకు పంపిస్తారా? అనిప్రశ్నించారు. పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై జరిగిన విచారణకు నరేందర్‌రెడ్డిని పోలీసులు కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం ఆయన కోర్టు ఎదుట మాట్లాడారు. రేవంత్ రెడ్డి పతనం కొడంగల్ నుంచే ప్రారంభమవుతుందన్నారు. తనకు న్యాయస్థానాలపై గౌరవం ఉందని, ఈ కేసులో నిర్దోషిగా బయటకు వస్తానని చెప్పారు. లగచర్ల ఘటనలో ఏ-1గా ఉన్న నరేందర్‌రెడ్డిని కస్టడీ కోరుతూ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్ పై బుధవారం వాదనలు ముగిశాయి. వాదనలు విన్న మున్సిఫ్ కోర్టు మేజిస్ట్రేట్.. తన నిర్ణయాన్ని 22కు వాయిదా వేశారు.

ఆగ్రోస్‌లో వసూల్ రాజా!

» రైతుసేవా కేంద్రాల నుంచి రూ. 10 వేల చొప్పున వసూలు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలకు ఎరువుల కోటా ఇప్పిస్తానంటూ ఒక్కో కేంద్రానికి రూ. 10 వేల చొప్పున ఇవ్వాలని వసూళ్లకు పాల్పడుతున్న ఓ వసూల్ రాజా వ్యవహారం బుధవారం వెలుగులోకి వచ్చింది. తెలంగాణ ఆగ్రోస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 860 రైతు సేవా కేంద్రాలు ఉండగా ఈ వానాకాలం సీజన్ నుంచి 400 కేంద్రాలకు మాత్రమే ఎరువులు సరఫరా అవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకొని మెదక్ జిల్లా తూప్రాన్ ప్రాంతంలో ఆగ్రోస్ రైతు సేవాకేంద్రాల నిర్వాహకుడొకరు మిగిలిన 460 కేంద్రాలకు ఎరువుల కోటా కేటాయించేలా చేస్తానని చెప్పి వసూళ్ల పర్వానికి దిగారు. ఈ వ్యవహారం ప్రభుత్వం దృష్టికి వచ్చింది. వసూళ్లకు పాల్పడుతున్న ఆ ఏఆర్ఎస్‌కేల సంఘం నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రోస్ ఎండీకి ఆదేశాలు సైతం వచ్చినట్లు సమాచారం. ఈమేరకు తక్షణ చర్యగా రైతు సేవాకేంద్రాల నిర్వాహకుల వాట్సాప్ గ్రూపుల్లో ఎండీ రాములు ఓ పోస్ట్ చేయించారు. ఏఆర్ఎస్‌కేలకు రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు ఉచితంగా రవాణా చేస్తున్నదని, నిర్ణీత కోటా ప్రకారం కేటాయింపులు చేస్తున్నదని, ఇందులో ఎవరి ప్రమేయం లేదని, ఎవరికీ నయాపైసా లంచం ఇవ్వాల్సిన పనిలేదని ఆయన స్పష్టం చేశారు. ఏఆర్ఎస్‌కేల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

గుట్టలో స్వర్ణ తాపడం పనులకు శ్రీకారం


స్వర్ణ తాపడం రేకులకు పూజలు చేస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయ దివ్య విమాన రాజగోపురానికి బంగారు తాపడం పనులకు బుధవారం శ్రీకారం చుట్టారు. ప్రధానాలయంలో ప్రతిష్ఠామూర్తుల వద్ద బంగారు తాపడం రేకులకు ప్రధానార్చకులు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. గంగా జలంతో సంప్రోక్షణ చేశారు. గతంలో ధ్వజస్తంభం, గర్భాలయ ముఖద్వారం పనులు చేపట్టిన చెన్నైకి చెందిన మెసర్స్ స్మార్ట్ క్రియేషన్ సంస్థకే ఈ తాపడం పనులను అప్పగించారు. ఇందుకు రూ.3.90 కోట్లు దేవస్థానమే చెలిస్తోంది. మరోవైపు, గాలి గోపురం కోసం 10,500 చదరపు అడుగుల రాగి రేకులకు బంగారు తాపడం పనులు చేయాల్సి ఉంది. 2025 మార్చిలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యే లోపు బంగారు తాపడం పనులను పూర్తిచేయాలని అధికారులు భావిస్తున్నారు. మరోవైపు, లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

ఓటెయ్యండి.. గిఫ్ట్ పట్టండి!

» మహారాష్ట్రలో ఓటర్లకు ఓ మున్సిపాలిటీ అధికారుల ఆఫర్లు

ఆదిలాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించేందుకు ఓ మున్సిపాలిటీ అధికారులు గిఫ్ట్ ఆఫర్లను ప్రకటించారు. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కేళాపూర్ నియోజకవర్గం పాండ్రకోడ మున్సిపాలిటీ పరిధిలో ఓటు వేసిన వారికి బహుమతులను అందిస్తామని ఆ మున్సిపాలిటీ అధికారులు ప్రకటించారు. ఆమేరకు వచ్చిన వారికి కూపన్లు ఇచ్చి వారి పేర్లు రాశాక ప్రత్యేక బాక్సుల్లో వేశారు. ఈ నెల 23వ తేదీన కౌంటింగ్ ముగిసిన తర్వాత 27న లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. ఇందులో డిన్నర్ సెట్, మిక్సర్, సీలింగ్ ఫ్యాన్, ప్రెషర్ కుక్కర్, ఎలక్ట్రిక్ ఐరన్ బాక్సు వంటి ఐదు రకాల బహుమతులను అందించనున్నారు.

రియాక్టర్ పేలి కార్మికుడి మృతి

» మరో ముగ్గురు కార్మికుల పరిస్థితి విషమం

» జీడిమెట్ల అరోరా ఫార్మాస్యూటికల్స్‌లో ఘటన


అనిల్‌యాదవ్

జీడిమెట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామికవాడలోని అరోరా ఫార్మాస్యూటికల్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రియాక్టర్ పేలి బి.అనిల్ యాదవ్(42) అనే కార్మికుడు మృతి చెందాడు. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బుధవారం ఉదయం 10గంటల సమయంలో ఒక్కసారిగా రియాక్టర్ పేలిపోవడంతో మంటలు వ్యాపించాయి. మంటల తీవ్రతకు అనిల్‌యాదవ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గోపిచంద్, శ్రీనివాస్, బలరాం అనే కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని తోటి కార్మికులు ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని తమకు చూపకుండా యాజమాన్యం గోప్యంగా వ్యవహరించిందని, పోలీసుల సాయంతో గాంధీకి తరలించిందని మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. మృతుడి స్వస్థలం అనంతపురం జిల్లా గుత్తి కాగా సూరారం కాలనీలో ఉంటున్నారు.

'పటేల్‌గూడ' భూములను సర్వే చేయండి

» ప్రభుత్వానివో, ప్రైవేటువో తేల్చండి

» సంగారెడ్డి జిల్లా సర్వే అధికారులకు హైకోర్టు ఆదేశం

» హైడ్రా కూల్చివేతల కేసులో స్టేటస్ కో విధించిన కోర్టు

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం పటేల్‌గూడలోని సర్వే నంబరు 6, 12లో ఉన్న భూములను సర్వే చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఆ సర్వే నంబర్లలోని భూములు ప్రైవేటువా, ప్రభుత్వానివా అన్నది గుర్తించాలని జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. పటేల్‌గూడ సర్వే నంబరు 6లో ఉన్నవి ప్రైవేటు భూములని.. రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా ప్లాట్లు కొనుక్కొని, అన్ని అనుమతులతో ఇళ్లు కట్టుకుంటే హైడ్రా అధికారులు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చేశారని పేర్కొంటూ హైకోర్టులో 22 పిటిషన్లు దాఖలయ్యాయి. సర్వే చేయకుండా, నోటీసులు ఇవ్వకుండా, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా ఇళ్లు కూల్చేసిన అధికారులపై చర్యలు తీసుకోవడంతోపాటు పరిహారం ఇప్పించాలని బాధితులు కోరారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ప్రభుత్వ న్యాయవాదులు వాదిస్తూ.. ఆ భూములు సర్వే నంబరు 6లో లేవని, 12లో ఉన్న ప్రభుత్వ భూములని చెప్పారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. సర్వే నంబరు 6, 12 భూములను సర్వే చేయాలని అధికారులను ఆదేశించింది. ఆ భూములు సర్వే నంబరు 6లో ఉన్నట్లు తేలితే అనుమతించిన ప్రణాళిక ప్రకారం పిటిషనర్లు నిర్మాణాలు చేపట్టుకోవడానికి అధికారులు అనుమతి ఇవ్వాలని తెలిపింది. అలాగే పిటిషనర్లు నష్టపరిహారం కోరవచ్చంది. ఒకవేళ ఆ భూములు సర్వే నంబరు 12 (ప్రభుత్వ భూములు)లో ఉన్నట్లు తేలితే.. పిటిషనర్లు తమ సేల్ డీడ్‌లు సమర్పించి రెగ్యులరైజేషన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని, వాటిపై అధికారులు నిర్ణయం తీసుకోవాలని పేర్కొంది. ఈ మొత్తం ప్రక్రియ పూర్తయ్యే వరకు వివాదాస్పద భూముల విషయంలో స్టేటస్ కో (యథాతథ స్థితి) పాటించాలని తుది తీర్పు జారీచేసింది.

డిగ్రీ పరీక్షలను బహిష్కరించిన ప్రైవేటు కాలేజీలు

» ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బిల్లులకు వ్యతిరేకంగా నిరసన

» ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3వ, 5వ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

నల్లగొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లుల పెండింగ్‌ను నిరసిస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. మూడేళ్లుగా ఇవ్వాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఆందోళనకు దిగాయి. దీంతో బుధవారం మహాత్మాగాంధీ వర్సిటీ పరిధిలోని కాలేజీలు బంద్ అయ్యాయి. ఎంజీ వర్సిటీ పరిధిలో గురువారం, శుక్రవారం జరగాల్సిన 3వ, 5వ సెమిస్టర్ డిగ్రీ పరీక్షలు వాయిదా పడ్డాయి. దీంతో వాటిని డిసెంబరు 7, 10వ తేదీల్లో నిర్వహించేందుకు వర్సిటీ అధికారులు కొత్త షెడ్యూల్ విడుదల చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బైడెన్ చిచ్చు

అలా ఓడిపోయి, ఇక దిగిపోబోతున్న తరుణంలో, డోనాల్డ్ ట్రంప్‌కు ఇంత సెగపెట్టిపోవాలన్న ఆలోచన జో బైడెన్‌కు ఎందుకు కలిగిందో మరి. అమెరికా తయారీ లాంగ్‌రేంజ్ మిసైల్స్‌ను రష్యన్ భూభాగాలమీద ప్రయోగించడానికి ఆయన అనుమతించిన కొద్దిగంటల్లోనే ఉక్రెయిన్ ఆ దుశ్చర్యకు పాల్పడింది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి వెయ్యిరోజులు అవుతున్న సందర్భంలో బైడెన్ తీసుకున్న ఈ దూకుడు నిర్ణయం దాని దిశనూ తీవ్రతనూ ఒక్కసారిగా మార్చివేసింది. ఉక్రెయిన్‌పై రష్యా ప్రతిదాడి ఏ స్థాయిలో ఉంటుందో ఊహకు అందని పాశ్చాత్యదేశాలన్నీ అమెరికా బాటలో నడచి ఉక్రెయిన్ రాజధానిలో తమ రాయబార కార్యాలయాలను మూసేస్తున్నాయి. అణ్వాయుధాల వినియోగానికి అనుమతించే నిబంధనలను మరింత సులభం చేసుకొని, రష్యా అధ్యక్షుడు తన అమ్ముల పొదిని చక్కదిద్దుకోవడం పరిస్థితిని వేడెక్కిస్తోంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు ఆర్థిక, ఆయుధ సాయంతో అండగా ఉంటున్న బైడెన్, యుద్ధం ముగిసేవరకూ అలాగే నిలవాలనుకోవడంలో తప్పులేదు. ఆయన అధికారంలో కొనసాగితే వేరే విషయం. కానీ, అమెరికన్లు ఆయన పార్టీని ఓడించి, ప్రత్యర్థిని అధికారంలో కూచోబెడుతున్నప్పుడు, ఆఖరురోజుల్లో ఇలా అడ్డుతోవలు తొక్కడం నైతికంగా సరికాదు.

ట్రంప్ వచ్చేలోగా మరో రెండునెలలపాటు మంటలు రాజేయాలన్నది బైడెన్ ఆలోచనగా కనిపిస్తోంది. కమలాహారిస్ ఓటమి వెనుక ఉక్రెయిన్ యుద్ధం ఉన్నదో లేదో కానీ, ఆ యుద్ధాన్ని సత్వరమే ముగిస్తానన్న హామీ ట్రంప్ విజయంలో ఒక ముఖ్యమైన అంశం. యుద్ధం వెయ్యిరోజులకు చేరువవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని ఇటీవలే జర్మనీ సహా చాలా దేశాలు అది సత్వరమే ముగిసిపోవాలన్న ఆశాభావాన్ని వెలిబుచ్చాయి. వచ్చే ఏడాది తొలినాళ్ళలోనే దౌత్యంతో యుద్ధాన్ని ముగిసేట్టు చేయవచ్చునని ఉక్రెయిన్ అధ్యక్షుడు సైతం వ్యాఖ్యానించాడు. యుద్ధం ముగిసిపోవాలన్న వాదనలు ఎప్పటినుంచో ఉన్నా, ఇప్పుడు అవి గట్టిగా వినబడటానికీ, జోరందుకోవడానికీ ప్రధాన కారణం ట్రంప్ విజయం. ఆయన గాజా యుద్ధం ఆపుతాడన్న ఆశ ఎవరికీ లేదుగానీ, పుతిన్ కోసమే కావచ్చు, ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలువరిస్తాడన్న నమ్మకం మాత్రం అందరికీ ఉంది. తాను అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు ఇప్పటిలాగా అడ్డూఅదుపూ లేని ఆయుధసరఫరాలు ఉండబోవని ట్రంప్ ఇప్పటికే తేల్చేశాడు. యుద్ధాన్ని ముగించే ప్రణాళిక ఆయన వద్ద సిద్ధంగా ఉన్నదని ప్రచారం కూడా జరుగుతోంది. నాటోతో ఏ బాంధవ్యాలు, బాదరబందీలు లేనివాడు కాబట్టి, ఉక్రెయిన్ అన్నా, జెలెన్‌స్కీ అన్నా విశేషమైన ప్రేమాభిమానాలేమీ లేవు కనుక, పుతిన్ పక్షాన న్యాయనిర్ణయం చేస్తాడన్న వాదనలు బలంగా ఉన్నాయి.

ఉక్రెయిన్‌ను అడ్డుపెట్టుకొని రష్యామీద కక్ష తీర్చుకోవాలన్న కోరిక లేకుంటే ఈ యుద్ధం నిజానికి ఎప్పుడో ఆగిపోవాలి. రెండేళ్ళక్రితం కొన్ని కీలకమైన భూభాగాలు కోల్పోయిన ఉక్రెయిన్‌కు, ఇప్పుడు అది ఉన్నస్థితికీ తేడావుంది. ఆయుధసరఫరాలు నిరవధికంగా కొనసాగుతుంటే ఏ యుద్ధమూ ఆగదు. ఇజ్రాయెల్ విషయంలో మరింత అధికంగా జరుగుతున్నది ఇదే. అమెరికా అందించిన ఆయుధాలతో అది ఏకకాలంలో అనేక మంది శత్రువులతో యుద్ధం చేయగలుగుతోంది, వేలాదిమందిని ఊచకోతలు కోస్తోంది, పొరుగుదేశాల్లోకి చొచ్చుకుపోతోంది. ఉక్రెయిన్ యుద్ధంలో అటువైపు అణ్వాయుధాలున్న రష్యా ఉన్నందున, ఆయుధాల వినియోగం మీద అమెరికా ఇంతకాలమూ కొన్ని నియంత్రణలు పెట్టింది. ఇప్పుడు ఆ నిబంధనలకు స్వస్తిచెప్పి, రష్యా భాషలో చెప్పాలంటే, మూడో ప్రపంచయుద్ధానికి బైడెన్ స్వాగతం పలుకుతున్నారు. తాను దిగేలోగా, రేపు ట్రంప్‌కు పరిష్కారం సాధ్యంకాని స్థాయికి యుద్ధాన్ని తీసుకుపోవాలనీ, దౌత్యాలు, చర్చలు, ఇచ్చిపుచ్చుకోవడాలకు వీల్లేనిరీతిలో చిక్కుముళ్ళువేసిపోవాలనీ ఆయన అనుకుంటున్నారు. యుద్ధంతో ఇప్పటికే ఉక్రెయిన్ తీవ్రంగా నష్టపోయింది. రష్యాదాడుల్లో సర్వమూ నేలమట్టమై, నాలుగోవంతు జనాభాను కోల్పోయి, ఆర్థికంగా తేరుకోలేనిదశకు చేరుకుంది. పునర్నిర్మాణానికి ఐదువందలబిలియన్ డాలర్లు ఖర్చవుతాయన్నది ఎప్పుడో వేసిన అంచనా. ఇందుకు భిన్నంగా, ఆంక్షలతో మరింత లాభపడి, ఆర్థికంగా ఏ సమస్యలూ లేని రష్యా మరింతమంది సైనికులను బలిపెట్టడానికి సిద్ధంగా ఉంది. యుద్ధం తీవ్రమైతే అపారనష్టాలకు గురికావాల్సిన ఐరోపా దేశాలు తక్షణమే రంగంలోకి దిగి, రష్యాతో చర్చలు జరిపి, నిర్దిష్టమైన హామీలతో దానిని చల్లార్చాల్సిన అవసరం ఉంది.

విశ్వఐక్యతకు నాంది 'లోక్‌మంథన్'

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎన్నో శతాబ్దాలుగా అనేక మార్పులు చవిచూశాయి. వనవాసం, గ్రామీణ సమాజం, పట్టణ జీవితం, నగర నాగరికత అనేవి ఒకదానితో ఒకటి విడదీయరాని భాగాలుగా మన సంస్కృతికి బలమైన పునాదులుగా నిలిచాయి. అయితే కాలక్రమేణా వివిధ ప్రభావాల కారణంగా వనవాసుల కంటే గ్రామవాసులు, వీరికంటే పట్టణ ప్రజలు, వీరందరినీ మించి నగరవాసులు గొప్పవారన్న భావన పెరిగిపోయింది. వాణిజ్య దృష్టి కోణంలో స్థూలంగా చూసినప్పుడు వీరందరూ ఒకరిని మించినవారు మరొకరు అన్నట్టుగా భేద దృష్టిని కల్పించి, విభజించి, విద్వేషాలు రగిలించిన పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, వీరంతా ఒకరితో ఒకరు పెనవేసుకుని జీవించాలనీ, జీవిస్తున్నారనే విషయం సూక్ష్మంగా చూస్తే తప్ప అర్థం కాదు. ఇది భారతదేశంతో పాటుగా యావత్ ప్రపంచానికి అన్వయించే విషయం.

నేటి సమాజంలో ఈ విషయం ఎందరికి తెలుసన్నదే అసలు ప్రశ్న. వన జీవనం, గ్రామ సమాజం, పట్టణ జీవితం, నగర నాగరికత అనేవి కచ్చితంగా వేర్వేరు వ్యవస్థలనీ, ఒక దానిని మించినది మరొకటి అనేది వీరి దృష్టి కోణం. ఇలాంటి భావనలు తొలగించి– మన సంస్కృతీ సంప్రదాయాలను తిరిగి పునరుద్ధరించేందుకు, సమాజంలో ఏకీకృత భావనను తీసుకొచ్చేందుకు, విశ్వ ఐక్యత ప్రాశస్త్యాన్ని ప్రతిపాదించేందుకు భాగ్యనగర్ వేదికగా ఈ రోజు నుంచీ 'లోక్‌మంథన్ – 2024' పేరుతో ఒక అద్భుత అంతర్జాతీయ సదస్సు జరగనుంది. ఈ మహోత్సవం నవంబరు 24 వరకు భాగ్యనగరంలోని శిల్పకళావేదికలో నాలుగు రోజుల పాటు జరగనుంది.



భారతదేశంలో నగరీకరణ జరిగినప్పటికీ, మనది గ్రామీణ కేంద్రిత సంస్కృతి. ఈ వ్యవస్థలో ఉన్నత విద్యాభ్యాసం, బోధన, అధ్యయనం అధికంగా అటవీ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఋషుల ఆశ్రమాల్లోనే జరిగేవి. నగరాల్లో గొప్ప నాగరికతను ఆస్వాదిస్తున్న అత్యున్నత వర్గాలవారు, వారి సంతానం, చివరికి మహారాజులు, వారి వారసులు సైతం జ్ఞానాన్ని పొందేందుకు, యుద్ధవిద్యలు నేర్చుకునేందుకు, ఆర్థిక సామాజిక జ్ఞాన సముపార్జనకు ఈ ఆశ్రమాలకే వెళ్లేవారు. భారతీయ పురాణాలను, చరిత్రను పరిశీలిస్తే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు సహా గొప్ప గొప్ప చక్రవర్తులు సైతం వనాలు, గ్రామాల్లోని గురుకులాలలో వేదాధ్యయనం, ఇతర విద్యలు నేర్చుకున్నవారే. ఈ మహారాజులు తమ రాజ్యపాలన అనంతరం సమస్తం త్యజించి వారసులకు రాజ్యం అప్పగించి జీవిత చరమాంకాన్ని వానప్రస్థంగా ఆ ఋషుల ఆశ్రమాల్లోనే గడిపేవారు. ఈ విధంగా వనాల నుంచి నగరవాసం, ఇక్కడి నుంచి తిరిగి వనవాసం వరకూ జీవన ప్రస్థానం పెనవేసుకుని నడిచిన పరిస్థితులు మన చరిత్రలో కీలకమైన ఘట్టాలుగా నిలిచిపోయాయి. ఆనాటి ఆచార సంప్రదాయాల విలువలను పునఃప్రతిష్ఠించి లోక ఐక్యతను చాటేందుకు 'లోక్‌మంథన్ – భాగ్యనగర్' ఒక మేలి మలుపుగా నిలుస్తుందని విశ్వసిస్తున్నాను.

ఒక విశిష్టమైన ప్రజాస్వామ్య కేంద్రిత విజ్ఞానవ్యవస్థ భారతదేశమంతటా ఒకప్పుడు ఆచరణలో ఉండేది. అయితే ఇస్లామిక్ దండయాత్రలు, ఆ తర్వాతి కాలంలో క్రైస్తవ దురాక్రమణల వల్ల గ్రామీణ ప్రజల కంటే పట్టణవాసులను, వీరిని మించి నగరవాసులను గొప్పవారిగా భావించే ఒక వివక్ష క్రమంగా పెరిగిపోయింది. పట్టణాలు–నగరేతర ప్రాంతాలలో నివసించే వారిని చులకనగా చూడడం. పల్లె విజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేసి, పట్టణ–నగర ప్రాంతాల్లోని జ్ఞానం కంటే తక్కువ అనే భావనతో వ్యవహరించడం ప్రారంభమైంది. పాశ్చాత్య దేశాలలో ఉన్న శాస్త్రీయం, జానపదం అనే వర్గీకరణను భారతీయ సమాజంపై బలవంతంగా రుద్ది, గ్రామీణ ప్రాంతాల ప్రజలను మరీ ముఖ్యంగా వనవాసులను ఏమీ తెలియని జానపదులుగా భావించటం మొదలైంది.



భారతీయతకు ప్రాధాన్యతనిచ్చి, ఆ దిశగా ఆలోచన–ఆచరణ చేసేవారిని ఒకే వేదికపైకి తెచ్చి, తద్వారా సామాజిక ప్రధాన జీవన స్రవంతిలో మరుగున పడిన వర్గాలు, సమాజాలకు ఒక స్థానం, ఒక గళం ఇవ్వాలన్నది 'లోక్‌మంథన్' లక్ష్యం. ఈ దృష్టి కోణంలో మేధావులు, కళాకారులు, వివిధ రంగాలవారిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది మా ప్రయత్నం. జానపద కళలు, జీవనశైలి, పద్ధతులు, సంప్రదాయాలు, సంస్థల వంటివన్నీ.. గొప్ప శాస్త్రీయ, నాగరిక అంశాలుగా చెప్పుకుంటున్న వాటికి ఏ మాత్రం తక్కువ కాదని చూపించేందుకే ఈ మహత్తర కార్యక్రమం.

శాస్త్రీయం కానివన్నీ అనాగరికమైనవనీ, తక్కువ స్థాయికి చెందినవనే భిన్నమైన నిర్వచనాన్ని మన సమాజంలో చొప్పించారు. ఫలితంగా సామాజిక సామరస్యత, ఆరోగ్యం, సాంకేతికత, ఆహారపు అభిరుచులు, ప్రకృతి ప్రాధాన్యత మొదలైన ఎన్నో అంశాల్లో భారతదేశంలో నిక్షిప్తమై ఉన్న అపార అనుభవాన్ని, జ్ఞానాన్ని గణనీయంగా నష్టపోయాం. ఫలితంగా ప్రకృతి దోపిడీ, సామాజిక సమతుల్యతకు తీవ్రమైన నష్టం జరిగింది. ఈ కృత్రిమ విభజనను నిర్మూలించి, పట్టణాలు – నగర ప్రాంతాల్లోనే కాక ఇతర ప్రాంతాల్లో జీవించే ప్రజల విజ్ఞానం, వివేకం, సాంస్కృతిక నైతికతను సమకాలీకరించి, పట్టణాలు–నగరవాసులతో అనుసంధానించాల్సిన తక్షణావసరం ఉంది.

అందుకే.. ప్రపంచంలో అబ్రహామిక్ మతాలకు పూర్వమున్న మతాలు, సంస్కృతులవారు సైతం ఈ లోక్‌మంథన్‌కి విచ్చేస్తున్నారు. వీరిలో సిరియాలోని రోమోలు, ఆర్మేనియాలోని యజిదీలు (సూర్యపుత్రులు), లిథువేనియా వాసులు సైతం వస్తున్నారు. అబ్రహామిక్ మతాల రాకకు పూర్వం ఆ దేశాలలో ఆచరించిన, నేటికీ ఆచరిస్తున్న సూర్యారాధన, హవన విధానాలను వీరు హైదరాబాద్ లోక్‌మంథన్‌లో ప్రదర్శించనున్నారు. ఇండోనేషియా కళాకారులు రామాయణం ఆధారంగా ప్రదర్శించే కేచక్ నృత్య ప్రదర్శన సహా లోక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన గొప్ప సంప్రదాయాలను వీక్షించే తరుణం లోక్‌మంథన్ ద్వారా సాకారం కానుంది.

'లోక అవలోకనం' ప్రధాన అంశంగా లోక విచార్ (ప్రకృతి, సాంస్కృతిక సంబంధమైన ఆలోచన ప్రక్రియ), లోక వ్యవహార్ (సంప్రదాయాలు–ఆచరణ), లోక్ వ్యవస్థ (సంస్థలు–వ్యవస్థలు) అనే మూడు ఉప అంశాలు లోక్‌మంథన్ భాగ్యనగర్ ఉత్సవం ప్రత్యేకత. ఇందులో భాగంగా లోక జీవనదృష్టి, లోక జీవన విజ్ఞానం, లోక సాహిత్యం, లోక అర్థశాస్త్రం, భారతీయ లోక చేతనలో పర్యావరణం, లోక సురక్ష–న్యాయం, లోక సర్వసమావేశీ వ్యవస్థ తదితర అంశాలపై సదస్సులు ఉంటాయి. ప్రత్యేకించి మన భావితరాలైన విద్యార్థులు, యువతరం దృష్టి సారించేలా లోక్‌మంథన్ రూపకల్పన జరిగింది.

భారతీయతకు ప్రాధాన్యతనిచ్చి, ఆ దిశగా ఆలోచన–ఆచరణ చేసేవారిని ఒకే వేదికపైకి తెచ్చి, తద్వారా సామాజిక ప్రధాన జీవన స్రవంతిలో మరుగునపడిన వర్గాలు, సమాజాలకు ఒక స్థానం, ఒక గళం ఇవ్వాలన్నది 'లోక్‌మంథన్' లక్ష్యం. ఈ దృష్టి కోణంలో మేధావులు, కళాకారులు, వివిధ రంగాలవారిని ఒకే వేదికపైకి తీసుకురావాలన్నది మా ప్రయత్నం. జానపద కళలు, జీవనశైలి, పద్ధతులు, సంప్రదాయాలు, సంస్థల వంటివన్నీ.. గొప్ప శాస్త్రీయ, నాగరిక అంశాలుగా చెప్పుకుంటున్న వాటికి ఏ మాత్రం తక్కువ కాదని ఘంటాపథంగా చూపించేందుకే ఈ మహత్తర కార్యక్రమం.

లోక్‌మంథన్ 2016 నుంచి రెండేళ్లకు ఒకసారి విభిన్న అంశాలను ఇతివృత్తంగా తీసుకుని– భోపాల్, రాంచీ, గువాహతి నగరాలలో అంతర్జాతీయ మహోత్సవాలను నిర్వహించింది. ఈసారి మన భాగ్యనగరాన్ని వేదికగా చేసుకున్న లోక్‌మంథన్ మహోత్సవాలలో 1,500 మందికి పైగా కళాకారులు 100కు పైగా కళారూపాలను ప్రదర్శించడం, 400కు పైగా అరుదైన సంప్రదాయ సంగీత వాయిద్యాలను చూసే మహదవకాశం ఈసారి ఈ మహోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

లోక్‌మంథన్ ఎగ్జిబిషన్స్‌లో భాగంగా తెలంగాణ, త్రిపుర, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్ సహా 10 రాష్ట్రాలకు చెందిన విభిన్న సంస్కృతులు, కళలు, చిత్రాల ప్రదర్శన, సంప్రదాయ ఆహారం, సంప్రదాయ క్రీడలు, సాహిత్యం, చర్చలు ఉంటాయి. లోక్‌మంథన్ ఉత్సవం జరిగే నాలుగు రోజులూ శిల్పారామంలోకి ప్రజలందరికీ ఉచిత ప్రవేశం ఉంటుంది. విశ్వజనీన భావన (వసుధైవ కుటుంబకం)తో పనిచేస్తున్న 'లోక్‌మంథన్ – భాగ్యనగర్' వేడుకల్లో పాలుపంచుకుందాం. సంప్రదాయ విజ్ఞానాన్ని, వివేకాన్ని అవగతం చేసుకుని లోక ఐక్యతా మహాయజ్ఞంలో భాగస్వాములమవుదాం.

○ జి. కిషన్‌రెడ్డి
కేంద్రమంత్రి, 'లోక్‌మంథన్' రిసెప్షన్ కమిటీ ఛైర్మన్

మణిపూర్‌పై ఇంకా మీన 'మోషా'లేనా?

మణిపూర్‌కు అదనపు సీఆర్‌పీఎఫ్ బలగాలను పంపించడం, అయిదు జిల్లాల్లోని ఆరు పోలీస్ స్టేషన్ల పరిధిలో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని (ఎఎఫ్‌ఎస్‌పిఎ) అమల్లో పెట్టడం, ఇంటర్నెట్‌ను నిషేధించడం, ఆందోళనకారులు ఎమ్ఎల్‌ఏల ఇళ్లను ధ్వంసం చేయడం జాతీయ విషాదం! ఏడాదిన్నరగా అక్కడ అంతర్యుద్ధం వంటి పరిస్థితులు కొనసాగుతూ ఉండడం దేశ పాలకుల వైఫల్యాన్నే చాటుతున్నది.

బాధిత ప్రజల మనోభావాలను గౌరవించడం, సంయమనంతో కూడిన చర్చల ద్వారా సమస్యను న్యాయమైన పద్ధతిలో పరిష్కరించడం బీజేపీకి బొత్తిగా గిట్టదు. మైదాన ప్రాంతమైన ఇంఫాల్ లోయలో నివసిస్తున్న మెజారిటీ మెయితీలను కూడా ఎస్టీలుగా గుర్తిస్తూ కేంద్రానికి సిఫార్సులు పంపాలని గత సంవత్సరం ఏప్రిల్ 20న మణిపూర్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఎం.వి. మురళీధరన్ జారీ చేసిన ఉత్తర్వులు గిరిజన తెగ అయిన కుకీలలో తీవ్ర అభద్రతా భావం సృష్టించి వారిని ఆందోళన మార్గం పట్టించింది. హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా అఖిల మణిపూర్ గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్రమంతటా నిరసనకు ఇచ్చిన పిలుపు విజయవంతమైంది. ఆ తర్వాత గత ఏడాది మే 3న మెయితీ మూకలు పోలీసుల సహకారంతో కుకీ మహిళలను వివస్త్రలను చేసి హత్యాచారానికి గురి చేశారు, వారి మగవారినీ హతమార్చారు. దానితో ఉభయ వర్గాల మధ్య ఘర్షణలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. అలా కొనసాగిన హింస వల్ల 250 మందికి పైగా మరణించారు. 60,000 మందికి మించి నిర్వాసితులై పునరావాస శిబిరాల్లో దుర్భరమైన బతుకులు ఈడుస్తున్నారు. రెండు వైపులా గల ఆందోళనకారులు పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి ఆయుధాలను పెద్ద సంఖ్యలో ఎత్తుకుపోయారు. ఇది కూడా హింస నిరవధికంగా కొనసాగడానికి దారి తీస్తున్నది.

కొద్ది కాలం నివురు గప్పినట్టున్న మణిపూర్ ఇటీవల తిరిగి వేడెక్కడం మొదలు పెట్టింది. ఈ మధ్యనే పది మంది కుకీలను మిలిటెంట్లుగా భావించి జిరిబమ్ జిల్లాలోని సిఆర్‌పిఎఫ్ దళాలు కాల్చి చంపారు. దానితో కుకీ తెగవారు కోపోద్రిక్తులయ్యారు. వారు మిలిటెంట్లు కాదని, తమ వాలంటీర్లు అని కుకీలు వాదిస్తున్నారు. ఆ తర్వాత ముగ్గురు మెయితీ మహిళల, వారి ముగ్గురి బాలల అపహరణ, హత్య జరిగిపోయాయి. పర్యవసానంగా 2000 మందికి పైగా అదనపు సిఆర్‌పిఎఫ్ దళాలను మణిపూర్‌కి పంపించి, అపరిమిత అధికారాలను సాయుధ దళాలకు కట్టబెడుతున్న ఎఎఫ్‌ఎస్‌పిఎ (AFSPA)ను తిరిగి విధించారు.

2021 జనాభా లెక్కల ప్రకారం మణిపూర్ జనాభాలో 53 నుంచి 60శాతం మంది మెయితీలు, 20 శాతం మంది నాగాలు, 16 శాతం మంది కుకీలు ఉన్నారు. మణిపూర్ భూభాగంలో 89 శాతం కొండ ప్రాంతం ఉంది. ఇది గిరిజన తెగలైన నాగాలు, కుకీలు, తదితరులు నివసిస్తున్న ప్రదేశం. మెజారిటీ మెయితీలు నివసిస్తున్న ఇంఫాల్ లోయ ఉన్నది 11శాతమే. కాని ఆ రాష్ట్ర అభివృద్ధి నిధుల్లో 80 శాతం ఈ లోయకే చెందుతున్నాయి. మిగిలిన 20 శాతం మాత్రమే గిరి ప్రాంతాల్లో ఖర్చవుతున్నది. ఆ విధంగా మెయితీలు పాలకుల ఆదరాభిమానాలకు పాత్రులు అవుతున్నారు. కొండల్లోని తెగలు పాలకుల ఆదరానికి దూరంగా బతుకుతున్న దృశ్యం కనిపిస్తున్నది. 60 మంది సభ్యులున్న శాసనసభలో మెయితీలకు చెందిన మైదాన ప్రాంతం (ఇంఫాల్ లోయ) నుంచి 40 మంది ప్రాతినిధ్యం వహిస్తుండగా, గిరిజన వర్గాల నుంచి ప్రతినిధులు 20 మంది మాత్రమే. మెయితీలు అనుభవిస్తున్న అప్రతిహత ఆధిపత్యం గురించి ఇంతకు మించి వివరించనక్కరలేదు. పైపెచ్చు మెయితీలు హిందువులు. నాగాలు, కుకీలు క్రైస్తవులు.



మణిపూర్‌లో ఇంతగా భిన్న వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు, మారణకాండ జరుగుతూ, అమాయకులు నిర్వాసితులు అవుతుంటే దేశ ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోడం, పార్లమెంటులో దీని గురించి వివరంగా మాట్లాడకపోవడం బాధితులకు పుండు మీద కారం చల్లినట్టు ఉంది. మణిపూర్ ఏమైపోయినా ఫర్వాలేదు మెజారిటీ ఓటు తమవైపు ఉండాలి, హిందువుల వైపు నిలబడ్డామనే సంకేతాన్ని పంపాలి అని కేంద్రంలోని బీజేపీ 'ప్రభువులు' నిర్ణయించుకొన్నారని మనం భావించాలి.

2022లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో 32 మంది బలంతో బీజేపీ అధికారంలోకి వచ్చింది. వాస్తవానికి మణిపూర్‌లో పూర్వం నుంచి ఉంటున్నవారు మెయితీలు, నాగాలే. బ్రిటిష్ పాలనలో వచ్చి చేరిన కుకీ తెగవారు కొండల్లో చిన్న చిన్న గ్రామాలు ఏర్పాటు చేసుకొని బతకడం ప్రారంభించారు. ఆ దశలో నాగాలకు, కుకీలకు ఘర్షణలు జరిగాయి. కాని ఇప్పుడు కుకీల ఆందోళనకు నాగాలు మద్దతు ఇస్తున్నారు. నిధుల్లో, అధికారంలో గుత్తాధిపత్యం వహిస్తున్న మెయితీలకు ఎస్టీ గుర్తింపు లభిస్తే తమకు తీవ్ర నష్టం జరుగుతుందని, మజ్జిగ పలచబడి మరింత అన్యాయానికి గురి అవుతామనే అవగాహనతో, చైతన్యంతో కుకీల మాదిరిగానే నాగాలు కూడా భయపడుతున్నారు. సమష్టి ఆందోళనకు సహకరిస్తున్నారు.

తాత్కాలిక దృష్టితో చూసినప్పుడు కుకీలను తీవ్రంగా ద్వేషిస్తూ వారిని తక్కువ చూపు చూస్తున్న బీజేపీ ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఈ సంక్షోభ విస్తరణకు తక్షణ బాధ్యుడని బోధపడుతున్నది. కుకీలు బయటి నుంచి వచ్చారని, గంజాయి సాగు చేస్తారని... ఇలా పలు రకాల ద్వేష భాషను ముఖ్యమంత్రి వారిపై ప్రయోగించారు. వాస్తవానికి మణిపూర్‌లోని అన్ని వర్గాలు గంజాయి సాగు చేస్తాయని, కానీ కుకీలను మాత్రమే వేలెత్తి చూపడం అలవాటుగా మారిందని అభిప్రాయం ఉన్నది. ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ 19మంది బీజేపీ శాసనసభ్యులు ప్రధాని మోదీకి ఇటీవలనే లేఖ రాశారు. అయినా కేంద్రంలో చలనం లేదు. ఇప్పుడు తాజా కల్లోల పరిస్థితుల నేపథ్యంలో బీరేన్ సింగ్ ప్రభుత్వానికి రెండు భాగస్వామ్య పక్షాలు మద్దతు ఉపసంహరించుకున్నాయి.

1948–49లో మణిపూర్ భారతదేశంలో విలీనం కాక ముందు తాము ఎస్టీలమని ఆ హోదాను తమకు తిరిగి ఇవ్వాలని మెయితీలు వాదిస్తున్నారు. మణిపూర్ విలీనం తర్వాత తమకు ఆదివాసీ హోదా కొనసాగించకపోడానికి కారణం తాము మైదాన ప్రాంతీయులుగా సకల సౌకర్యాలు కలిగి ఉన్నందువల్లనే అనే వాస్తవాన్ని పూర్తిగా తెలిసి కూడా వారు ఎస్టీ హోదాను ఆశించడం తగనిది. గత మే 3వ తేదీ నాటికి అంటే కల్లోలం మొదలై ఏడాది ముగిసినప్పటికీ ఘర్షణల్లో 221 మంది మరణించగా ఈ సంఖ్య ఇప్పుడు 250కి మించినట్టు రూఢి అవుతున్నది. అన్నింటికీ మించి ఇంతగా భిన్న వర్గాల ప్రజల మధ్య ఘర్షణలు, మారణకాండ జరుగుతూ, అమాయకులు నిర్వాసితులు అవుతుంటే దేశ ప్రధానమంత్రి ఆ రాష్ట్రాన్ని సందర్శించకపోడం, పార్లమెంటులో దీని గురించి వివరంగా మాట్లాడకపోడం బాధితులకు పుండు మీద కారం చల్లినట్టు ఉంది. తమకు ప్రత్యేక పాలన వ్యవస్థను, శాసనసభను ఏర్పాటు చేయాలని కుకీలు కోరుతున్నారు.

మణిపూర్‌లో ఇంకా వలస పాలనే కొనసాగుతున్నదని, భారత చరిత్ర పాఠ్య గ్రంథాలలో ఈశాన్యానికి తగిన ప్రాతినిధ్యం లేదని, అందుచేతనే ఆ ప్రాంత ప్రజలు బయటివారుగా పరిగణన పొందుతున్నారని, తమ సంక్షోభంపై కేంద్రం పాటిస్తున్న మౌనానికి ఇదే కారణమని మణిపూర్ ఎంపీ బిమల్ అకోయిజం పార్లమెంటులోనే ప్రకటించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై గత జూలై మొదటివారంలో ఆ రోజు చిట్టచివరి వక్తగా ఆయనకు మాట్లాడే అవకాశం రాత్రి 11.45కి దక్కడాన్ని బట్టి మణిపూర్ సంక్షోభం పట్ల కేంద్రానికి గల నిర్లక్ష్యం రుజువు అవుతున్నది. పార్లమెంటు సంయుక్త సమావేశాలను ఉద్దేశిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేసిన ప్రసంగంలో సుదీర్ఘ మణిపూర్ కల్లోలం ప్రసక్తి లేకపోడాన్ని కూడా బిమల్ అకోయిజం ఎత్తి చూపారు. మణిపూర్‌లో ఏడాదిన్నరకు పైగా అంతర్యుద్ధం సాగుతుండగా ప్రధాని నోరువిప్పి దానిపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని, ఆయన తన మౌనవ్రతం వీడితే తాను మాట్లాడడం ఆపేస్తానని బిమల్ అన్నారు.

మణిపూర్ ఏమైపోయినా పర్వాలేదు మెజారిటీ ఓటు తమవైపు ఉండాలి, హిందువుల వైపు నిలబడ్డామనే సంకేతాన్ని పంపాలి అని కేంద్రంలోని బీజేపీ 'ప్రభువులు' నిర్ణయించుకొన్నారని మనం భావించాలి. సమస్య అంతర్గతంగా భిన్న వర్గాల ప్రజల మధ్య హెచ్చు తగ్గుల ఘర్షణలకు చెందినది అయితే, దృష్టిని సరిహద్దు వైపు మళ్ళించి బయటినుంచి చొచ్చుకు వస్తున్నవారిని నిరోధించడమే పరిష్కారమనే అభిప్రాయాన్ని కలిగించడానికి హోం మంత్రి అమిత్ షా ప్రయత్నిస్తున్నారు. మయన్మార్‌తో గల 1500కి.మీ. సరిహద్దు పొడుగునా కంచె నిర్మించే ప్రణాళికను ప్రకటించారు. సరిహద్దులకు ఆవలి ఈవలి వారు స్వేచ్ఛగా గీత దాటడానికి అవకాశమిస్తూ గతంలో ఇండియా, మయన్మార్ల మధ్య కుదిరిన ఒప్పందాన్ని రద్దు చేసే ఉద్దేశాన్నీ వెలిబుచ్చారు. మణిపూర్‌కి భౌగోళికంగా విశేష ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దులు ఆగ్నేయాసియాతో సంబంధాలకు ఇండియాకు ముఖద్వారం వంటివి. మయన్మార్‌తో చైనా సాన్నిహిత్యం పెరుగుతున్న నేపథ్యంలో దాని జోరుకు కళ్లెం వేయవలసి ఉంది. అందుకోసం మణిపూర్‌లో శాంతికి అమిత ప్రాధాన్యముంది. మయన్మార్‌తో సరిహద్దుల మూసివేత ఇందుకు విఘాతం కలిగించవచ్చు.

ఒకటి రెండుసార్లు మణిపూర్‌కి చెందిన మెయితీ, కుకీ, నాగా ఎమ్మెల్యేలతో కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన చర్చలు ఫలించలేదు. ఆందోళన రెండు వర్గాల్లోని ప్రజానీకంలోకి, ముఖ్యంగా యువతలోకి చొచ్చుకుపోయింది. ఎమ్మెల్యేల పలుకుబడి అంతరించిపోయింది. ప్రజలు వారిని విశ్వసించడం మానేశారు. ఇప్పుడిక ఇది మీన 'మో–షా'లు లెక్కబెట్టే పరిస్థితి కాదు. బీరేన్ సింగ్ ప్రభుత్వాన్ని తక్షణం తొలగించాలి. తాత్కాలికంగానైనా రాష్ట్రపతి పాలన విధించాలి. బరువు బాధ్యతలు బలగాల మీద వదిలి ప్రధానమంత్రి విదేశీ పర్యటనలు చిత్తగించడం మేలు చేయదు. వీలయితే స్వయంగా అఖిలపక్షాన్ని తోడ్కొని మోదీ మణిపూర్‌ను సందర్శించాలి. ఒక్క మణిపూర్‌నే కాదు, దూరంగా విసిరేసినట్టున్న మొత్తం ఈశాన్య ప్రాంతాన్ని మరింత సమ్మిళిత దృష్టితో చూడడడం దేశానికి శ్రేయస్కరం.

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

ఐరోపా వంచన: నాడు యూదులు, నేడు ముస్లింలు

పశ్చిమాసియాలో ఇజ్రాయెల్, హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధం యూరోపియన్ సమాజాలలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమవుతోంది. ఈ నెల మొదటి వారంలో నెదర్లాండ్స్ రాజధాని ఆమ్‌స్టర్‌డామ్‌లో ఇజ్రాయెల్–నెదర్లాండ్స్ మధ్య యూరోపా లీగ్ ఫుట్‌బాల్ మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌కు ముందు, తరువాత అల్లర్లు, హింసాకాండ చోటుచేసుకున్నాయి. ఇజ్రాయెల్ అభిమానులు 'పాలస్తీనా వాసులు చావాలి' అని అరుచుకుంటూ రోడ్లమీద కన్పించిన వాళ్ళపైన ఖాళీ సీసాలు విసిరి, బీభత్స వాతావరణాన్ని సృష్టించారు. మరునాడు డచ్ పౌరులు ముందటి రోజు అరాచకానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసనలు చేశారు. శరణార్థులని, వలస వచ్చిన వాళ్ళని వ్యతిరేకించే తీవ్ర జాతీయవాద డచ్ పార్టీ నాయకుడు గేర్ట్ విల్డర్స్ ఆమ్‌స్టర్‌డామ్ సంఘటనల్లో తన రాజకీయ లబ్ధికి ఇంకొక అవకాశం వెతుక్కున్నాడు. జరిగినదంతా ఏడు దశాబ్దాల క్రితం హిట్లర్ సైన్యాలు యూదులను వేధించిన పద్ధతిని గుర్తుతెస్తుందని విల్డర్స్ వ్యాఖ్యానించాడు. నెదర్లాండ్స్ రాజు కూడా పెద్ద డ్రామా చెయ్యటంతో, శాంతియుతంగా నిరసనలు చేసిన అనేకమందిని డచ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమ్‌స్టర్‌డామ్‌లో ఉండే 15,000 మంది యూదు పౌరులకి, అక్కడ ఉండే అరబ్బు, ముస్లిం పౌరులకు ఇప్పటి వరకూ ఏ గొడవా లేదు. విచిత్రంగా ఐరోపా, అమెరికాలలో అనేక వార్తా పత్రికలు ఈ ఇజ్రాయెల్ ఫుట్‌బాల్ గూండాలని బాధితులుగాను, తమతమ ఇళ్లపై వారు దాడి చేసినందుకు నిరసన వ్యక్తం చేసిన డచ్ పౌరులని యూదు వ్యతిరేకులుగాను వర్ణిస్తూ వార్తలు రాశాయి. హింసకి పాల్పడిన ఇజ్రాయెల్ పౌరులు క్షేమంగా వెళ్లిపోయారు గానీ, డచ్ ప్రభుత్వం శాంతియుత నిరసనలని నిషేధించి, అరబ్, ఇతర డచ్ ముస్లిం పౌరులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించింది.



ఐరోపా ఆర్థిక వ్యవస్థలు సజావుగా ఉన్నంతవరకు అరబ్, ఉత్తరాఫ్రికా, ఆసియా దేశాల నుంచి వలసవచ్చిన వారిని బహు సంస్కృతీపరత్వం పేరుతో అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. 2008 తర్వాత ఆర్థిక ప్రగతి తగ్గుముఖం పట్టడంతో యూరోపియన్ దేశాలలోని తీవ్ర జాతీయవాద పార్టీలు వలస ప్రజల పట్ల వ్యతిరేకతని పెంచాయి. ఈ సందర్భంలోనే యూరోపియన్ దేశాలకు ముస్లింలు ఒక సమస్యగా పరిణమించారు. ఒక శతాబ్దం క్రితం ఆ స్థానంలో యూదులు ఉండేవాళ్ళు.

వంద సంవత్సరాల క్రితం యూదులను తోటి తెల్లజాతి వారుగా ఐరోపా దేశాలు పరిగణించేవి కావు. నాజీ హిట్లర్ సైన్యాలు యూరోపియన్ యూదులలో మూడు వంతుల మందిని సంహరించాయి. ఆ తరువాత యూరోపియన్ దేశాలు మిగిలిన యూదులను ఇజ్రాయెల్‌కి పంపి, తమ అపరాధ భావాన్ని పశ్చిమాసియాకి తరలించాయి. ఎప్పుడయితే ఇజ్రాయెల్ అపార చమురు నిక్షేపాల పశ్చిమాసియాలో తమ ఆర్థిక ఆసక్తులకి కాపలాదారుగా పని చేస్తుందని అర్థమయిందో, యూదులను తెల్లజాతి వారిలో కలుపుకుని తమది ఉమ్మడి జూడో– క్రిస్టియన్ నాగరికత అని యూరోపియన్ దేశాలు చెప్పుకోసాగాయి. తమ అపరాధ భావాన్ని తగ్గించుకోవటంలో భాగంగా యూదులకి పరిహారాలు చెల్లించటమే కాకుండా ఇజ్రాయెల్ సమర్థనని తమ జాతీయతా భావనలో భాగం చేసుకున్నాయి. 2000 సంవత్సరంలో అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి (International Holocaust Remembrance Alliance) ప్రారంభిస్తూ చేసిన స్టాక్‌హోం ప్రకటనలో హోలోకాస్ట్‌ని 'మానవ నాగరికతకు మచ్చగా' పరిగణించాలని, దాని జ్ఞాపకాలని అందరూ గౌరవించాలని, యూదు వ్యతిరేకతని సంఘటితంగా ఎదుర్కోవాలని ప్రకటించాయి. అలా, తమ పాపాన్ని మొత్తం ప్రపంచ దేశాల పాపంగా మార్చివేశాయి. తాము మినహా ఎవరూ పెద్దగా పాటించని తీవ్ర యూదు వ్యతిరేకతని 'ప్రపంచ' ప్రజలందరికీ అంటగట్టాయి.

ఈ అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి, అనేక ఇతర శక్తిమంతమైన యూదు సంస్థలతో పాటు ప్రపంచవ్యాప్తంగా యూదు వ్యతిరేకత అనే భావనని ఇజ్రాయెల్ ఉనికిని సమర్థించేందుకు, పాలస్తీనా ప్రజల పోరాటానికి సంఘీభావం తెలుపుతున్న వారి గొంతు నొక్కటానికి వాడుకుంటూ వస్తోంది. పాలస్తీనా ఆక్రమణని ఎవరు ప్రశ్నించినా, అక్కడి జాతి వివక్ష విధానాలని ఎత్తి చూపినా సహించవు. వాళ్ళు ఏ జాతి, రాజకీయాలు, మతం వాళ్ళయినా సరే. యూదు వ్యతిరేకులుగా ముద్ర వేసి వారి జీవితాన్ని నాశనం చేస్తాయి. ఈ మధ్యనే అమెరికన్ ఇజ్రాయెలీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ అనే అతి పెద్ద ఇజ్రాయెలీ లాబీ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన ఇద్దరు నల్ల జాతి డెమొక్రాట్లని కోట్లాది డాలర్లు ఖర్చు పెట్టి ఓడించింది. ప్రస్తుతం ఇటువంటి ఇజ్రాయెల్ సమర్థక సంస్థలన్నీ కలిసి అమెరికాలో విశ్వవిద్యాలయాల్లో పాలస్తీనా కోసం నిరసనలు వ్యక్తం చేస్తున్న అన్ని జాతుల, మతాల విద్యార్థులపై సంస్థాపరమైన దాడులు చేయిస్తున్నాయి.

గత రెండు దశాబ్దాలలో అమెరికా, యూరోపు దేశాలు, ఇరాక్, ఆఫ్ఘానిస్తాన్, సిరియా, లిబియా, పాలస్తీనా వంటి అనేక అరబ్బు, ముస్లిం దేశాలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక యుద్ధాలు చేసి, చేయించిన తర్వాత ఆయా దేశాల నుండి ఐరోపాకు శరణార్థులు పెరిగారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత తమ శ్రామిక అవసరాల కోసం కూడా జర్మనీ లాంటి దేశాలు ఇటువంటి వలసలని ప్రోత్సహించాయి. దక్షిణాసియా లాగే వలస పాలనలో కునారిల్లిన అరబ్బు, ఉత్తర ఆఫ్రికా దేశాల వారు కూడా సహజంగానే ఐరోపాకు వలస వచ్చారు. ఆయా దేశాల్లో ఆయా భాషలు నేర్చుకుని అన్ని రకాలుగా ఇమిడిపోయారు. ఐరోపా ఆర్థిక ప్రగతి బాగున్నంత వరకూ వీళ్లందరినీ బహు సంస్కృతీపరత్వం (మల్టీ కల్చరలిజం) పేరుతో అర్థం చేసుకునే ప్రయత్నం జరిగింది. 2008 తర్వాత ఐరోపా ఆర్థిక ప్రగతి కొంత తగ్గుముఖం పట్టడంతో తీవ్ర జాతీయవాద పార్టీలు శరణార్థులు, వలస ప్రజల పట్ల వ్యతిరేకతని ప్రోత్సహించి పెంచాయి. ఈ సందర్భంలోనే యూరోపియన్ దేశాలకు ముస్లింలు ఒక సమస్యగా పరిణమించారు. ఒక శతాబ్దం క్రితం ఆ స్థానంలో యూదులు ఉండేవాళ్ళు.

యూదులను తమలో కలుపుకుని, ఇజ్రాయెల్‌ని పశ్చిమ ఆసియాలో నమ్మిన బంటుగా మార్చుకున్న ఐరోపా దేశాలు 2000 సంవత్సరం తర్వాత పాలస్తీనా ఆక్రమణని ప్రపంచ దేశాల దృష్టిలోకి రాకుండా చేశాయి. అమెరికాలో ట్విన్ టవర్లపై దాడుల తర్వాత ముస్లిం వ్యతిరేకతని ఒక పద్ధతి ప్రకారం పోషించి, పాలస్తీనాని కూడా ఒక టెర్రరిస్టుల సమూహంగా అందరూ భావించేటట్లు చేశాయి. దురదృష్టవశాత్తూ అక్టోబర్ 7 హమాస్ దాడి తర్వాత, ఇజ్రాయెల్ పాలస్తీనాపై జరుపుతోన్న అంతులేని అమానుష దాడులు సోషల్ మీడియా ద్వారా అందరి దృష్టిలోకి వచ్చి ఈ యథాతథ స్థితిని మార్చాయి. ఇజ్రాయెల్ ఆక్రమణలో వుండిన పాలస్తీనా ప్రజల పట్ల జాతి వివక్ష, వారి జాతి ప్రక్షాళన, దీని జియోనిస్టు మూల కథా కమామిషూ ప్రపంచవ్యాప్త నిరసనలతో బట్టబయలయ్యాయి. ఐక్యరాజ్యసమితిలోని మానవ హక్కుల కమిషన్ ఇజ్రాయెల్ చేస్తున్న హత్యలని అంతర్జాతీయ చట్టం క్రింద జెనోసైడ్ లేదా మానవ హననం అని వర్ణిస్తూ ఒక నివేదిక తీసుకొచ్చింది. పాలస్తీనా ప్రజల పక్షాన, ఐరోపాలో ప్రజల తీవ్ర నిరసనలతో ఆయా ప్రభుత్వాల ఇజ్రాయెల్ సమర్థన ప్రశ్నార్థకమయింది. ఈ సందర్భంలోనే ఐరోపా దేశాల అతివాద పార్టీలు యూదు సంరక్షక అవతారం ఎత్తి తమ దేశాల్లో వుండే అరబ్బులు, ముస్లింలని నియంత్రించటానికి వారి పాలస్తీనా సమర్థనని యూదు వ్యతిరేకతగా ప్రచారం చేస్తున్నాయి. ఒకే దెబ్బకి రెండు పిట్టలు. హోలోకాస్ట్ అపరాధ భావనని ఎక్కువ మోసే జర్మనీ దీన్ని పరాకాష్ఠకు తీసుకువెళ్లి మొన్ననే కొత్త చట్టాన్ని బుండేస్టాగ్‌లో ప్రవేశపెట్టింది. ఇజ్రాయెల్ దేశాన్ని, విధానాలను విమర్శించినా, దాని బహిష్కరణని ఏ విధంగా కోరినా అంతర్జాతీయ హోలోకాస్ట్ జ్ఞాపక కూటమి నిర్వచనం ప్రకారం ఆయా వ్యక్తులను యూదు వ్యతిరేకిగా పరిగణించి, వారి హక్కులను తగ్గించి, నిరసనకారుల పౌరసత్వాన్ని కూడా తీసివేసే అధికారాలను ఈ చట్టం ఇస్తోంది. యూదు వ్యతిరేకత భావనని చట్టపరంగా, విధానపరంగా సాధ్యమయినంత విస్తృతపరిచి నిరసన, విమర్శకి అవకాశం లేకుండా చేసే చర్య అని ప్రజాస్వామ్య వాదులు విమర్శిస్తున్నారు.

భారత్ సహా, అన్ని దేశాల్లో పాలస్తీనా మద్దతుదారులను నియంత్రించటానికి, పాలస్తీనియన్లపై తాను జరుపుతోన్న మారణహోమాన్ని ఎవరూ ప్రశ్నించకుండా ఉండటానికి యూదు వ్యతిరేకత సెంటిమెంటుని ఇజ్రాయెల్ వాడుకుంటోంది. దీనికి అమెరికా, యూరోపులలోని అన్ని దేశాల అతివాద రాజకీయ పార్టీలు మద్దతు పలుకుతున్నాయి. తన అస్తిత్వం కోసం ప్రపంచంలో అన్ని దేశాల ప్రజాస్వామ్య విలువల పతనానికి తోడ్పడుతున్న ఇజ్రాయెల్, పశ్చిమాసియాలో తమ బంటుని కాపాడుకోవటానికి కష్టపడుతోన్న తెల్లజాతి క్రిస్టియన్ దేశాలు కలిసి ఇప్పుడు ముస్లింలకి వ్యతిరేకంగా ఆ సెంటిమెంటుని ప్రయోగిస్తున్నాయి.

• ఎ. సునీత

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com





'మలేరియా'లో మాయాజాలం

- కాలనీల్లో వృద్ధి చెందుతున్న దోమలు
- విష జ్వరాల బారిన నగర ప్రజలు
- ఫాగింగ్ చేయకుండా చోద్యం చూస్తున్న సిబ్బంది
- మూలకు పడ్డ ఫాగింగ్ ఆటోలు, మిషన్లు
- వాహనాలకు అందించే డీజిల్, పెట్రోల్ స్వాహా
- హెల్త్ అసిస్టెంట్లపై అవినీతి ఆరోపణలు
- పట్టించుకోని ఉన్నతాధికారి, ప్రజాప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20: గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్‌లోని మలేరియా విభాగం అచేతనావస్థలో ఉంది. వరంగల్ నగరంలోపాటు విలీన గ్రామాల్లో దోమల నివారణ కోసం పనిచేయాల్సిన సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఫలితంగా ప్రతీ ఇంట్లో జ్వరపీడితులే కనిపిస్తున్నారు. డెంగీ, మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతూ చివరికి ప్లేట్‌లైట్స్ తగ్గి పోయి ప్రాణాపాయ స్థితిలోకి వెళుతున్నారు. అంటువ్యాధులు, దోమలవ్యాప్తిని నివారించాల్సిన మలేరియా విభాగం బాధ్యతగా పనిచేయకపోవడంతో రోగాలు విజృంభిస్తున్నట్లు విమర్శలున్నాయి.

వాహనాలు, సిబ్బంది

గ్రేటర్ వరంగల్ పరిధిలో డివిజన్‌కు ఒకటి చొప్పున బల్దియా నిధుల నుంచి రూ.50లక్షలు వెచ్చించి చిన్న ఫాగింగ్ మిషన్లు, రూ.30లక్షలతో 4 ఫాగింగ్ ఆటోలు కొనుగోలు చేశారు. నగరంలో దోమలు, క్రిమీకీటకాలను నియంత్రించేందుకు 60 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, 90 మంది కాంట్రాక్టు సిబ్బంది పనిచేస్తున్నారు. వీరితో పని చేయించేందుకు బయాలజిస్ట్, ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, 8 మంది హెల్త్ అసిస్టెంట్లు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు పని చేస్తున్నారు. 11 లక్షల పైచిలుకు జనాభా కలిగిన వరంగల్ నగరంలో దోమల నివారణకు సరిపడా సిబ్బంది లేకపోవడం ఇబ్బందులును కలగచేస్తోంది.

అక్రమార్జన

దోమలను నియంత్రించాల్సిన ఫాగింగ్ ఆటోలు, మిషన్లు బల్దియా ప్రధాన కార్యాలయంలో ఓ మూలన మూలుగుతున్నాయి. అయితే అధికారులు మాత్రం ఫాగింగ్ ఆటోలు, మిషన్లు, సిబ్బంది పనిచేస్తున్నట్లుగానే డీజిల్, పెట్రోల్ నింపుతున్నట్లు దండుకుంటున్నారనే ప్రచారం జోరుగానే సాగుతోంది. చిన్న ఫాగింగ్ మిషన్‌లకు రోజుకు 5 లీటర్ల డీజిల్, ఒక లీటర్లు పెట్రోలు అందించాలి. ఒక్క ఆటోకు రోజుకు 75 లీటర్ల డీజిల్, 10 లీటర్ల పెట్రోల్ పోసి నగరంలో దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయాలి. 4 ఆటోలు, 66 చిన్న ఫాగింగ్ మిషన్లు, బావులలో మందు, డ్రైనేజీలలో దోమల స్ప్రే, నీటి గుంతలు, చిన్న పాటి కుంటలలో ఆయిల్ బాల్స్ వేయాలి. అయితే చాలాకాలంగా ఫాగింగ్ ఆటోలు మూలకు పడగా, 25 చిన్న ఫాగింగ్ మిషన్లు వినియోగంలో లేవని తెలిసింది. అఆటోలు, ఫాగింగ్ మిషన్లు పనిచేస్తున్నట్టు డీజిల్, పెట్రోల్‌లో నెల వారి లెక్కలు చూపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇద్దరు హెల్త్ఇన్‌స్పెక్టర్లు, మరో నలుగురు హెల్త్అసిస్టెంట్లు కిందిస్థాయి మలేరియా సిబ్బందితో అంటకాగుతూ అడ్డదారిలో డీజిల్, పెట్రోల్ బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. అలాగే ప్రతీ నెలా డీజిల్, పెట్రోల్‌తో పాటు దోమలు వృద్ధి చెందకుండా వాడే బెటెక్స్ టెమోఫాస్, మలాథిన్ స్ప్రే చేయకుండా, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేయకుండానే నెలకు లక్షల్లో బిల్లులు కాజేస్తూ బల్దియా ఆదాయానికి గండికొడుతున్నట్టు తెలుస్తోంది.

నిద్రావస్థలో బల్దియా మలేరియా విభాగం

ఆ ఇద్దరిదే హవా..

గ్రేటర్ పరిధిలోని 33 డివిజన్ల చొప్పున ఇద్దరు హెల్త్ ఇన్‌స్పెక్టర్లు పంచుకున్నట్లు సమాచారం. కొందరు సిబ్బందిని ఏజెంట్లుగా ఏర్పాటు చేసుకుని లక్షలు వెనకేసుకుంటున్నట్టు తెలిసింది. సెంట్రల్‌జైలు పెంట్రోల్ బంకు వద్ద డీజిల్‌లో మలాథిన్ మందును కలుపకముందే అక్కడి అధికారి సహాయంతో ప్లాస్టిక్ క్యాన్‌లలో డీజిల్ నింపుకుని అక్కడి నుంచి చల్లగా జారుకుంటున్నారు. అంతేకాకుండా ఇద్దరు హెల్త్ఇన్‌స్పెక్టర్లు డివిజన్‌లలో మలేరియా శాఖ విధులు నిర్వర్తించే సిబ్బంది నుంచి రూ.500 ఇవ్వాలని బలవంతం చేస్తున్నట్టు సిబ్బంది వాపోయారు. తమకు వచ్చేది నెలకు రూ.12వేలు రాగా, అధికారులకు ఎందుకు డబ్బులు ఇవ్వాలని కొందరు ప్రశ్నిస్తున్నారు.


బల్దియా కార్యాలయంలో మూలనపడ్డ ఫాగింగ్ ఆటోలు

లక్షల్లో ఆదాయం.. విలాసవంతమైన జీవితం..

బల్దియా మలేరియా విభాగంలో పని చేసే కొందరు సిబ్బందికి డీజిల్, పెట్రోల్‌తోపాటు దోమల నివారణకు పిచికారి చేసే మందులు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. 66 చిన్న మిషన్లు, 4 ఆటోలకు కలుపుకుని రోజుకు 630 లీటర్ల డీజిల్, 110 లీటర్ల పెట్రోల్ నింపుతున్నట్టు అధికారిక లెక్కలు చెబుతూనే అడ్డదారిలో అమ్మకాలు జరుపుతున్నారు. అంటే నెలకు రూ.17 లక్షల ఇంధనం ఖర్చు చేస్తున్నారు. మరో రూ.3లక్షలు వివిధ రకాల దోమల మందులు, గంబూషియా చేపలు వేస్తున్నట్టు లెక్కలు చూపుతూ కమిషనర్‌కు మస్కా కొడుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది డీజిల్ విక్రయించగా వచ్చిన డబ్బులను హెల్త్ఇన్‌స్పెక్టర్లకు, హెల్త్ అసిస్టెంట్లకు రోజువారిగా ఇస్తున్నట్టు చెప్పారు. దీంతో డబ్బులు ముట్టజెప్పిన సిబ్బందికి డ్యూటీలు వేయకుండా నిజాయితీగా పని చేస్తున్న సిబ్బంది పైనే పని భారం మోపుతున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదంతా బల్దియా అధికారులకు తెలిసే

మిగతా 6లో..


బమ్మెరలో పోతన సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే యశస్విని, తదితరులు

పోతన ఊరిలో అభివృద్ధి పనులను పూర్తిచేస్తాం

- హరిత హోటల్, చెక్‌డ్యామ్ నిర్మాణాలకు కృషి
- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

8


కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించిన తొలి కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న వీఆర్ విద్యార్థి, చిత్రంలో ప్రొఫెసర్ అయిలయ్య తదితరులు

నిత్య చైతన్యశీలి.. కాళోజీ

- ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి
- కళాక్షేత్రంలో ఘనంగా తొలి కవిసమ్మేళనం
- పాల్గొన్న 60మంది కవులు

8


చోరీ జరిగిన రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకును పరిశీలిస్తున్న వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

పక్కా స్కెచ్‌తో బ్యాంకు లూటీ!

- రెక్కీ వేసి చోరీ చేసినట్టు అనుమానాలు
- రాయపర్తి ఎస్‌బీఐను పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝూ
- మూడు బృందాలుగా పోలీసుల గాలింపు ముమ్మరం
- బ్యాంకు ఎదుట బాధితుల గగ్గోలు

6

నిధుల ప్రకటనతో బీఆర్ఎస్ నేతల దిమ్మతిరిగింది

- అభినందించాల్సింది పోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారు
- సీఎం ప్రత్యేక దృష్టితో వరంగల్‌కు కొత్త రూపు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


డీసీసీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, చిత్రంలో కడియం కావ్య, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, తదితరులు

హనుమకొండ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ అభివృద్ధికి ముఖ్యమంత్రి వరాలు కురిపించి, నిధులు ప్రకటించడంతో బీఆర్ఎస్ నేతల దిమ్మతిరిగిపోయిందని, అభినందించాల్సిన బీఆర్ఎస్ నాయకులకు ఏం చేయాలో తోచక.. అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరాభావృద్ధికి రూ.6వేలకోట్లు మంజూరు చేయడంతో బీఆర్ఎస్ నేతలకు మతి తప్పిందని, వెర్రిగా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి క్షేత్రస్థాయిలో కనిపిస్తుంటే.. బీఆర్ఎస్ నాయకుల కళ్లకు మాత్రం కనిపించడం, రాష్ట్రాన్ని అప్పుల మయం చేయడం, ప్రజలను వేధించడం, కమీషన్ల పేరిట లక్షల కోట్లు దండుకోవడం తప్ప వారి పాలనలో చేసిందేంటని ప్రశ్నించారు. నగరాన్ని భూకబ్జాలతో భ్రష్టుపట్టించారని ధ్వజమెత్తారు. సీఎం ప్రత్యేక దృష్టితో రానున్నకాలంలో వరంగల్ రూపురేఖలు మారనున్నాయని, అది చూసి బీఆర్ఎస్ నాయకులు పిచ్చాస్పత్రికి వెళ్లడం ఖాయమన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్‌కు తాగి పడుకోవడం తప్ప ఏం తెలియదని, పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు పెట్టిన సమయంలోనూ ఆయన ఫామ్ హౌస్‌లోనే తాగి పడుతున్నాడన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట దోచుకున్నాడని దుయ్యబట్టారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని, ఆ పార్టీకి ఇక కాలం చెల్లినట్లేనని, ఎన్నికల ముందు ఇష్టారాజ్యంగా శిలా ఫలాకాలు వేశారని, కానీ ఏ ఒక్క పని ఆరంభించనే లేదన్నారు. వారిలో పాలనలో నిధులన్నీ సిరిసిల్ల, ఎర్రవెల్లి, సిద్ధిపేటలకు మాత్రమే వెళ్లాయని ఆరోపించారు. వరంగల్ నగరానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో రూ.6వేల కోట్ల అభివృద్ధి పనులకు నిధులు విడుదల అయ్యాయన్నారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వరంగల్ బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్ స్క్రిప్ట్‌ను చదువుతున్నారని, ప్రభుత్వంపై విమర్శలు చేయకుండా బుద్ధి తెచ్చుకొని అభివృద్ధికి సహకరించాలని హితవు పలికారు. ఈ సమావేశంలో ఎమెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, మేయర్ గుండు సుధారాణి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కూచన రవళి, కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, సయ్యద్ విజయశ్రీ, మామిండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ అసెంబ్లీకి వస్తే రేవంత్ పారిపోతాడు..

- ఆయన సీఎం పదవి తుమ్మితే ఊడిపోయేది..
- కేటీఆర్, హరీష్ గురించి తప్పుగా మాట్లాడితే సహించం
- మీడియాతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చిత్రంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, తదితరులు

బాలసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వస్తే సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచి పారిపోతాడని, ఆయన పదవి తుమ్మితే ఊడిపోయే పదవి అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఎద్దేవా చేశారు. బుధవారం హనుమకొండ రాంనగర్‌లోని తనే నివాసంలో ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. కేసీఆర్ ప్రాణాలకు తెగించి రాష్ట్రం సాధిస్తే.. కేసీఆర్, కేటీఆర్, హరీ‌ష్‌రావు గురించి రేవంత్‌రెడ్డి తప్పుగా మాట్లాడుతున్నాడని, ఆయన ప్రజా విజయోత్సవ సభలు పెట్టడం కాదని, ముందు ఓటేసి గెలిపించిన ప్రజల సమస్యలు పరిష్కరించాలని హితవు పలికారు. ఉద్యమంలో తెలంగాణ వాదులను బెదిరించిన చరిత్ర ఆయనదని, ఓటమి ఎరుగని నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీ‌ష్‌రావు గురించి తప్పుగా మాట్లాడే అర్హత రేవంత్‌కు లేదన్నారు. ప్రజాపాలన అని చెప్పి ప్రజలను గాలికి వదిలేశారని విమర్శించారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసుదనచారి మాట్లాడుతూ.. రాష్ట్ర అదాయం రూ.18వేల కోట్లు, ఖర్చు రూ.30వేల కోట్లు అని వరంగల్ సభలో సీఎం చెప్పడంపై అనుమనాలు వ్యక్తం చేశారు. గతంలో సంక్షేమం విషయంలో మాటలు చెప్పిన రేవంత్.. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రస్తుతం చేపట్టాల్సిన పనులను చేయలేక చేతులెత్తేశారని మండిపడ్డారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సభకు మహిళలను బెదిరించి తీసుకొచ్చారని, కేసీఆర్ నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్నే ప్రస్తుత ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. అందరినీ తొక్కుకుంటూ వచ్చానని చెబుతున్న రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ నాయకులను, ప్రజలను తొక్కి సీఎం అయ్యాడని విమర్శించారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో ప్రజల భూమి గుంజుకుంటేనే కాంగ్రెస్ నాయకులను చెట్లకు కట్టేసి కొడుతున్నారని, ఆయన కుటుంబసభ్యుల దొరికతే తొక్కడానికి లగచర్ల రైతులు చూస్తున్నారన్నారు. రేవంత్‌రెడ్డి పతనం మొదలైందని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ అహంకారంతో కూడిన మాటలు మాట్లాడితే ఓరుగల్లు నుంచే గుణపాఠం మొదలవుతుందని, కేసీఆర్‌ను చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డే ఏం చేయలేకపోయారని, రేవంత్ ఏంచేస్తాడన్నారు. కేసీఆర్‌ను ప్రజల నుంచి వేరు చేయలేవని, ఇప్పటికైనా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి, హామీలను నేరవేర్చాలని హితవు పలికారు. గండ్ర వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ చరిత్రను లేకుండా చేయాలని చూస్తున్న రేవంత్‌రెడ్డికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. విజయోత్సవ సభలో కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మాట్లాడుతూ కాళోజీ కళాక్షేత్రంలో వరంగల్ కళాకారులను సన్మానించకుండా సీఎం రేవంత్‌రెడ్డి అవమానించారన్నారు. మహిళలకు ప్రాధాన్యమిస్తున్నామన్న సీఎం.. వాళ్లకిచ్చిన రూ.2500 హామీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మూసీనది పేరుతో రాహుల్‌గాంధీకి కప్పం కట్టి సీఎం పదవిని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాడని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ వరంగల్ నగరంపై రేవంత్‌రెడ్డికి ప్రేమ లేదని, అభివృద్ధి పనుల్లో రూ.2వేల కోట్ల కమీషన్ కోసం సభ పెట్టాడని ఆరోపించారు. కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు విద్యార్థులు, రైతులు సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మాజీ రెడ్‌క్రాస్ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మోదీ, కిషన్‌రెడ్డిపై సీఎంవి చిల్లర వ్యాఖ్యలు


మీడియాతో మాట్లాడుతున్న రావు పద్మ, బీజేపీ నేతలు

- సోనియాకు రేవంత్‌రెడ్డి గులాంగిరీ
- కేంద్ర ప్రభుత్వ నిధులతోనే వరంగల్ అభివృద్ధి
- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

6

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వరంగల్ ప్రజలకు వరం

బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో మేయర్ గుండు సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టడం వరంగల్ ప్రజలకు గొప్ప వరమని మేయర్ గుండు సుధారాణి అన్నారు. గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధారాణి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వరంగల్ పర్యటనలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.4.170 కోట్లు, వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.187కోట్లు విడుదల చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. గతంలో సీఎం నిధుల నుంచి చేసిన పనులకు బడ్జెట్ విడుదల చేయకపోవడం వల్ల ఎక్కడి పనులు అక్కడ నిలిచి పోయాయన్నారు. ఇప్పుడు నిధులు ఉండడంతో నిలిచిపోయిన పనులను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఈఈలు మహేందర్, శ్రీనివాస్, సంతోష్‌బాబు, డీఈలు సారంగం, కార్తీక్‌రెడ్డి, రవికిరణ్, రాజ్‌కుమార్, ఏఈలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



శాంతి భద్రతల రక్షణలో..

- 1,148 మంది మహిళా కానిస్టేబుళ్లకు శిక్షణ పూర్తి
- నేడు పాసింగ్ ఔట్ పరేడ్.. హాజరవనున్న మంత్రి సీతక్క

6

అధికారులు అంకితభావంతో పని చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో మండల ప్రత్యేక అధికారులు అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ సత్యశారద ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రత్యేక అధికారులతో మాట్లాడారు. ధాన్యం, పత్తి కొనుగోలు, ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే పురోగతిపై చర్చించారు. కేటాయించిన మండలానికి సంబంధించి మండల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షిస్తూ పటిష్ఠంగా అమలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పత్తి, ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 70 శాతం కుటుంబ వివరాలను నమోదు అయిందని, గడువులోగా 100 శాతం పూర్తి చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జడ్పీసీఈవో రామిరెడ్డి, సీపీవో గోవిందరాజన్, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మోదీ, కిషన్‌రెడ్డిపై సీఎంవి చిల్లర వ్యాఖ్యలు

బీజేపీ హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షురాలు రావు పద్మ


మాట్లాడుతున్న రావు పద్మ

హనుమకొండ టౌన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని, ఆయన సోనియా గాంధీకి గులాంగిరి చేస్తున్నారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షు రాలు రావు పద్మ విమర్శించారు. హనుమకొండ హంటర్‌రోడ్డులో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సీఎంగా ఉన్న రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడిలా మాట్లాడటం సిగ్గుచేటని, లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలవకపోతే సీఎం పదవి నుంచి తప్పుకుంటానని చెప్పిన ఆయన ఎనిమిది సీట్లకే పరిమితమైనా పదవి నుంచి తప్పుకోలేదన్నారు. తమ నాయకులను గుజరాత్‌కు గులాంగిరీ చేస్తున్నారని అంటున్న ఆయన సోనియాకు, ఇటలీకి గులాంగిరీ చేస్తున్నాడా? అని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చి ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదని అన్నారు. గతంలోనే పూర్తయిన కాళోజీ క్షేత్రానికి తుదిమెరుగులు దిద్ది, కేంద్ర నిధులతో నిర్మించుకున్న నయీంనగర్ బ్రిడ్జిని చూపించి అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్నాడన్నారు. వరంగల్ అభివృద్ధి కేంద్రనిధులతోనే జరిగిందన్నారు. బాలసముద్రంలోని డబుల్‌బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా విస్మరించారని దుయ్యబట్టారు. గతంలో రైల్వే వ్యాగన్ కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌కు తరలిస్తే ప్రధాని మోదీ సారథ్యంలో కాజీపేటకు తీసుకువచ్చామన్నారు. హెరిటేజ్, స్మార్ట్‌సిటీ నిధులతో వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్‌లను ఆధునీకరించామన్నారు. వేయిస్తంభాల గుడి పునరుద్ధరణ, రామప్పకు యునెస్కో, గిరిజన యూనివర్శిటీ తీసుకరావడం లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలను బీజేపీ చేసిందన్నారు. మాస్టర్ ప్లాన్.. కొత్త సీసాలో పాత సారాలా ఉందని ఎద్దేవా చేశారు. జీవో తీసుకురావడం కాదని, పని పూర్తి చేసి చూపించాలన్నారు.

బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అపకీర్తి తెచ్చుకుందన్నారు. ఇందిరా మహిళా శక్తి పేరిట సభ నిర్వహించి మహిళలకు పెద్దపీట వేశామని చెబుతున్న ఆయన మహిళలకు ఇస్తామన్న రూ.2500, నిరుపేద యువతి పెళ్లికి ఇస్తామన్న తులం బంగారం, రూ.లక్ష ఏమయ్యాయని ప్రశ్నించారు. మోదీ, కిషన్‌రెడ్డిపై విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, ఇంకోసారి నిరాధారమైన ఆరోపణలు చేస్తే కాళోజీ కళాక్షేత్రం ఎదుట నాలుక కట్‌చేసి వేలాడదీస్తామని హెచ్చరించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు జీఎంఆర్ ఎప్పుడో ఎన్‌వోసీ ఇచ్చినప్పటికీ యేడాది తర్వాత ఎయిర్‌పోర్ట్‌పై హడావిడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ నేత డాక్టర్ కాళీ ప్రసాద్ మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ బాధితుల ఉసురు బీఆర్ఎస్ నాయకులకు తాకుతుందని శపించారు. ఈ ప్రభుత్వమైనా 100 గజాల స్థలంలో ఇంటితోపాటు నిరుద్యోగులకు ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి వరంగల్ సభలో చేసిన వ్యాఖ్యలపై న్యాయపరంగా సమాధానం ఇస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 22 శాతం కౌలు రైతులకు ఇస్తానన్న రూ. 15,000 అందలేదన్నారు. 50 శాతం మందికి రుణమాఫీ జరగలేదన్నారు. సోనియాగాంధీ కాళ్లు కడిగి తలమీద పోసుకోవాల్సిన దుస్థితి తమకేమీ లేదని, తమ తల్లి భరతమాత అని అన్నారు. సర్వేను స్వాగతిస్తున్నప్పటికీ వాటిలోని ప్రశ్నావళిని వ్యతిరేకిస్తున్నామన్నారు.

ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, విజయచందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కొలను సంతోష్‌రెడ్డి, ఆర్.పి. జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

పక్కా స్కెచ్‌తో బ్యాంకు లూటీ!

రెక్కీ వేసి చోరీ చేసినట్లు అనుమానాలు ● రాయపర్తి ఎస్బీఐలో చోరీపై పోలీసు దర్యాప్తు ముమ్మరం
బ్యాంకును పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా ● బ్యాంకు ఎదుట బాధితుల గగ్గోలు



లాకర్ తెరిచేందుకు తెచ్చుకున్న ఆక్సిజన్ సిలిండర్


రాయపర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా రాయపర్తి మండలకేంద్రంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో జరిగిన చోరీని దుండగులు పక్కా ప్లాన్‌తో చేసినట్లుగా తెలుస్తోంది. కొంత కాలంగా బ్యాంకుపై రెక్కీ వేసి, చుట్టుపక్కల ప్రాంతాలను పరిశీలించి, బ్యాంకులో సైతం ఎలాంటి సెక్యూరిటీ ఏర్పాటు చేశారో ఓ అవగాహనకు వచ్చాకే ఈ దోపిడీ జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. బ్యాంకులోకి చొరబడిన కిటికీ వద్దకు వెళ్లాలంటే దాదాపు 7ఫీట్ల ఎత్తులో ఉన్న గోడను ఎక్కి వెళ్లాల్సి ఉంటుంది. దీనికి తోడు వారి వెంట తెచ్చుకున్న గ్యాస్ మొద్దు, ఆక్సిజన్ సిలిండర్ ఇతరత్రా సామగ్రితో సైతం వెళ్లాలంటే దీని వెనుక గ్యాంగ్ ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సామగ్రిని తెచ్చుకోవడానికి సైతం ఓ వాహనాన్ని వాడి ఉంటారని, గోడ ఎక్కడంలో సైతం ప్రొఫెషనల్స్‌గా ఆరి తేరితేనే సులువుగా సామగ్రితో చొరబడతారని బ్యాంకులో జరిగిన చోరీ తీరు కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తోంది.

కర్ణాటక గ్యాంగ్ పనేనా..?

కర్ణాటక రాష్ట్రంలోని దావణగెరె జిల్లా న్యామతి పట్టణంలోని ఎస్‌బీఐ బ్యాంకులో సైతం అక్టోబర్ 28న ఇదే తరహాలో దోపిడీ జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. శని, ఆదివారాల్లో బ్యాంకు సెలవులను చూసుకున్న దుండగులు.. పక్కా స్కెచ్‌తో బ్యాంకులోకి చొరబడ్డారు. అక్కడ సైతం భారీస్థాయిలో బంగారాన్ని కొల్లగొట్టారు. దాదాపు రూ.13కోట్ల విలువైన సొత్తును కాజేశారు. ఇదే తరహాలో రాయపర్తి ఎస్‌బీఐలో సైతం చోరీ జరగడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్కడ చేసిన గ్యాంగే ఇక్కడ కూడా చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. బంగారాన్నే టార్గెట్‌గా చేసి దోపిడీకి పాల్పడి, వాటిని ఇతర రాష్ట్రాల్లో కరిగించి అమ్మడం చేస్తారా? అనే కోణంలో సైతం పోలీసుల దర్యాప్తు ప్రారంభమైంది. దీనిపై ప్రత్యేకంగా మూడు బృందాలు రంగంలోకి దిగి దర్యాప్తును ముమ్మరం చేసినట్లుగా పోలీసులు వెల్లడించారు.

మూడు గంటల్లోనే..

బ్యాంకును లూటీ చేసిన దుండగులకు చోరీ చేయడానికి దాదాపు మూడు గంటలకు పైగానే సమయం పట్టినట్లుగా అంచనా వేస్తున్నారు. బ్యాంకులోని లాకర్లను తెరిచేందుకు దుండగులు భారీ ఆక్సిజన్ సిలిండర్‌తో పాటు గ్యాస్ మొద్దు, కట్టర్‌ను తీసుకొచ్చారు. తమిళ అక్షరాలతో ఉన్న అగ్గిపెట్టెను సైతం మంట అంటించేందుకు వాడినట్లుగా పోలీసులు గుర్తించారు. అదే విధంగా లాకర్‌ను తెరవాలంటే పూర్తి స్థాయిలో వెల్డింగ్ చేస్తూ కట్టింగ్ చేయాల్సి ఉంటుంది. దీనికోసం సమయం పట్టే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. అందుకే సేఫ్టీ లాకర్లు మూడు ఉండగా, ఒకదాన్ని మాత్రమే తీయడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. సరిగ్గా బంగారం ఉన్న లాకర్‌నే ఎంచుకోవడం పట్ల పోలీసులు ఆ దిశగా సైతం దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాంకు ఎదుట బాధితుల గగ్గోలు

రాయపర్తి ఎస్‌బీఐ బ్యాంకులో చోరీ జరిగి 19 కేజీల బంగారం దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలియడంతో బుధవారం ఖాతాదారులు, బంగారం కుదువ పెట్టిన బాధితులు బ్యాంకుకు చేరుకున్నారు. బ్యాంకు అధికారులను కలిసేందుకు ప్రయత్నించగా పోలీసుల దర్యాప్తు జరుగుతుండడంతో వారిని లోపలికి అనుమతించలేదు. బాధితులు ఇటు పోలీసులను, అటు బ్యాంకు అధికారులను తమ బంగారం తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూతురు పెండ్లి కోసం, అప్పు కట్టడం కోసం, వ్యవసాయం పెట్టుబడి కోసం ఇలా చాలా మంది బాధితులు తమ గోడును వెల్లబోసుకుంటూ ఆందోళన చెందుతున్నారు. పలువురు మహిళలు తమ బంగారం కావాలంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

త్వరలోనే దొంగలను పట్టుకుంటాం.. : సీపీ

రాయపర్తి ఎస్‌బీఐలో చోరీకి పాల్పడిన దొంగలను త్వరలోనే పట్టుకుంటామని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకును పరిశీలించారు. దొంగతనం జరిగిన తీరును తెలుసుకుని, పోలీసులకు పలు సూచనలు చేశారు. బ్యాంకు అధికారులతో సైతం మాట్లాడి దర్యాప్తును వేగవంతమయ్యేలా చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్‌బీఐలో జరిగిన చోరీ తీరును చూస్తే ప్రొఫెషనల్స్ చేసినట్లుగా కనిపిస్తోందన్నారు. 19 కేజీల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు గ్యాస్ కట్టర్ సహాయంతో లాకర్‌ను తీసినట్లుగా గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు రాజమహేంద్రనాయక్, షేక్ సలీమా, రవీందర్, క్రైం ఏసీపీ భోజరాజు, వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య, వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు, ఎస్‌ఐలు శ్రావణ్ కుమార్, మేరుగు రాజు, సిబ్బంది పాల్గొన్నారు.


వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్యను తమ బంగారం కావాలంటూ కోరుతున్న బాధితుడు

ప్రముఖ గుండె వైద్యుడు డాక్టర్ ప్రేమ్‌శర్మ మృతి

వరంగల్ మెడికల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లాలో ప్రథమ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ప్రేమ్‌శర్మ (65) బుధవారం ఉదయం కన్నుమూశారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్న డాక్టర్ ప్రేమ్‌శర్మ అనారోగ్యంతో దీర్ఘకాలిక చికిత్స పొందుతూ మృతి చెందారు. 25 ఏళ్లుగా వరంగల్ జిల్లా ప్రజలకు అత్యవసర చికిత్సలతోపాటు గుండె వ్యాధులకు చికిత్స అందించారు. డాక్టర్ ప్రేమ్‌శర్మకు భార్య డాక్టర్ నివేదిత శర్మ, కుమారుడు డాక్టర్ నిశాంత్ హైదరాబాద్‌లోనే నివసిస్తున్నారు. డాక్టర్ ప్రేమ్‌శర్మ మృతి పట్ల వరంగల్ జిల్లా వైద్యులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల వైద్యులు డాక్టర్ కాళీప్రసాద్‌రావు, డాక్టర్ సుదీప్, డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ సురేందర్‌రెడ్డి, డాక్టర్ బింగి శ్రీనివాస్, డాక్టర్ నాగార్జునరెడ్డి, డాక్టర్ విజయచందర్‌రెడ్డి, డాక్టర్ కస్తూరి ప్రమీల, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ సుధీర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మహిళా కానిస్టేబుళ్ల శిక్షణ పూర్తి

స్టేషన్ విధులకు 1,148 మంది సిద్ధం

నేడు పాసింగ్ పరేడ్.. హాజరవనున్న మంత్రి సీతక్క


దీక్షిత్ రిహార్సల్స్ పరేడ్‌లో మహిళా కానిస్టేబుళ్లు

శంభునిపేట/మామునూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఖాకీ యూనిఫామ్ వేసుకోవాలన్న వారి కలలు నెరవేరుతున్నాయి. త్వరలోనే విధుల్లో చేరేందుకు సిద్ధమవుతున్నారు. మొత్తం 1,163 మందికి మామునూరు పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ)లో శిక్షణ ఇచ్చారు. అయితే కొందరికీ ఉన్నత ఉద్యోగాలు రావడం, ఇతర కారణాలతో ప్రస్తుతం 843 మంది సివిల్, 305 మంది ఏఆర్ విభాగం.. మొత్తం 1148 మంది మహిళలు కానిస్టేబుల్ శిక్షణ తీసుకున్నారు. 9నెలల పాటు సాగిన ఈ శిక్షణలో సివిల్, ఏఆర్ విభాగాలకు చెందిన మహిళా కానిస్టేబుల్స్ తమ విధులకు సంబంధించిన విధివిధానాలతో పాటు అనేక విషయాలను క్రమశిక్షణతో నేర్చుకున్నారు.

పీటీసీలో ప్రత్యేక బోధన

పీటీసీ ప్రిన్సిపాల్ (ఎస్పీ) ఇంజారపు పూజ ఆధ్వర్యంలో మొత్తం 1,148 మంది మహిళలు కానిస్టేబుల్స్ శిక్షణ తీసుకున్నారు. ఇందుకోసం ప్రత్యేక టీమ్ పనిచేసింది. అర్హతలు కలిగిన 130 మంది సిబ్బంది ఈ శిక్షణలో ట్రెయినీ కానిస్టేబుల్స్‌కు శిక్షణ అందించారు. బోధన, బోధనేతర విషయాల గురించి వివరించారు. వ్యాయామం, పోలీసు చట్టాలు, మానవ సంబంధాలు, ప్రజలకు సేవలందించే విధానంతో పాటు యూనిఫామ్ సర్వీస్‌లో ఉండే క్రమశిక్షణను నేర్పించారు. వీటితో పాటు ఫైరింగ్, వ్యాయామం, యోగా, క్రీడలు, కరాటే, వ్యక్తిత్వ వికాసం, పోలీసింగ్ ఇంటరాక్ట్ విత్ సొసైటీ పద్ధతులను నేర్పించారు. సైబర్ నేరాలను అరికట్టడంలాంటి ఐటీ సంబంధిత విషయాలను నేర్పించారు. ఈ శిక్షణకు గాను ఎస్పీ, ప్రిన్సిపాల్ ఇంజారపు పూజతో పాటు డీఎస్పీ, ఏడుగురు సీఐలు, ముగ్గురు ఏఆర్ ఆర్ఐలు, 13 మంది సివిల్ ఎస్ఐలు, నలుగురు ఏఆర్ ఆర్ఎస్ఐలు, 13 మంది హెడ్ కానిస్టేబుల్స్, 70 మంది కానిస్టేబుల్స్, ఇతర సిబ్బందితో పాటు రిటైర్డ్ అయిన పోలీసు అధికారులు సేవలు అందించారు. అనుభవం కల్గిన అధికారులు, న్యాయ నిపుణులతో నూతన పోలీసు చట్టాలను బోధించటంతో పాటు గ్రౌండ్‌లో శారీరక సాధన చేయించారు.

నేడు పాసింగ్ పరేడ్

తొమ్మిది నెలల శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు గురువారం పాసింగ్ పరేడ్ ద్వారా పీటీసీ నుంచి శిక్షణ సర్టిఫికెట్లను అందించనున్నారు. శిక్షణలో మెరుగైన ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లను గుర్తించి గ్రేడ్‌లు కేటాయించి బహుమతులు ప్రదానం చేయనున్నారు.

కాగా, పీటీసీలో గురువారం నిర్వహించనున్న దీక్షిత్ పరేడ్ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఇందుకోసం పీటీసీ వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నాయి. మంత్రి సీతక్క చేతుల మీదుగా అభ్యర్థులు సర్టిఫికెట్లను అందుకోనున్నారు.

సమర్థవంతమైన శిక్షణ అందించాం..

పీటీసీ ప్రిన్సిపాల్ (ఎస్పీ) ఇంజారపు పూజ



మహిళా కానిస్టేబుళ్లకు సమర్థవంతమైన శిక్షణను అందించాం. ట్రెయినీ కానిస్టేబుల్స్‌ను భౌతికంగా, మానసికంగా దృఢంగా తయారుచేశాం. కళాశాలను కుటుంబంలా భావించి శిక్షణ ఇచ్చాం. వారు విధుల్లో క్రమశిక్షణ ప్రదర్శించి ప్రజలకు సేవలందించాలని సూచించాం. శిక్షణకు వచ్చిన వారిలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి కుటంబాల వారే ఉన్నారు. అందువల్ల వారు పేదలకు సత్వర న్యాయాన్ని అందిస్తారని ఆశిస్తున్నా.

పట్టుదలతో సాధన చేస్తే విజయం

ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్

అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగపురి రమేష్

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 20: (ఆంధ్రజ్యోతి): పట్టుదల, క్రమశిక్షణతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునని ద్రోణాచార్య అవార్డు గ్రహీత, జూనియర్స్ ఇండియా అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ స్పష్టం చేశారు. బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌లో రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ఐ అండర్-17 బాలబాలికల అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా జెండా ఊపి క్రీడా పోటీలను ప్రారంభించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను చదువులతోపాటు చిన్నతనం నుంచే క్రీడల్లో పాల్గొనేలా వారి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకొని సాధన చేయడం ద్వారా రాణించే అవకాశాలు ఉంటాయన్నారు. క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించడంతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జివంజీ దీప్తీ ఇటీవల పారాలింపిక్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని కాంస్య పతకం సాధించడంతో గ్రూప్-1 ఆఫీసర్‌గా అవకాశం, రూ.1కోటీ ప్రోత్సాహకం అందించడంతో పాటు హనుమకొండ నగరంలో ఐదు వందల గజాల నివాస స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చిందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని దీప్తీ ఒక ఉదాహరణగా నిలిచిందన్నారు.

ఎస్‌జీఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దస్రూ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అండర్-17 బాలబాలికల విభాగంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల నుంచి 750మంది అథ్లెట్లు పాల్గొన్నారన్నారు. 100, 200, 400, 800, 1500, 3వేల మీటర్ల పరుగు పందెం, 110, 400మీటర్ల హర్డిల్స్, హైజంప్, లాంగ్ జంప్, ట్రిపుల్‌జంప్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, 5వేల మీటర్ల రేస్ వాక్‌లో ఎంపికలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఈ నెల 25నుంచి 27వరకు లక్నోలో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, పీడీలు గంగిశెట్టి మనోజ్‌కుమార్, రజినికాంత్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దివ్యక నాగరాజు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌కు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ రాక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): హనుమకొండ కలెక్టరేట్‌కు గురువారం డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ భూసాని వెంకటేశ్వర్‌రావు వస్తున్నారని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణలో స్థానిక సంస్థల వారిగా కల్పించాల్సిన రిజర్వేషన్ల ధామాషా పేర్కొనే విషయంపై బహిరంగ విచారణకు కమిషన్ వస్తున్నట్లు తెలిపారు. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోని బీసీ కుల సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర కుల సంఘాల నాయకులు బహిరంగ విచారణకు హాజరై రిజర్వేషన్ల ధామాషాపై అభ్యర్థణలు, సలహాలు, ఆక్షేపణలు కమిషన్‌కు తెలియజేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి 'క్రెడాయి' కృతజ్ఞతలు

బాలసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వరంగల్ మహానగర అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి క్రెడాయి వరంగల్ చాప్టర్ అధ్యక్షుడు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వరంగల్ మాస్టర్ ప్లాన్ - 2041కు ఆమోదముద్ర వేయటంపై సంతోషం వ్యక్తం చేశారు. మామునూరు ఎయిర్‌పోర్టు పునరుద్ధరణకు రూ.205 కోట్లు, ట్రైసిటీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.4170 కోట్లు, వరంగల్ ఆర్టీవో ఆఫీసు జంక్షన్ నుంచి గొర్రెకుంట, ఏనుమాముల మీదుగా 163 జాతీయ రహదారిని కలిపే పైడిపల్లి (ఆరెపల్లి) వరకు ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేసి, నయీంనగర్ వంతెనను ప్రారంభించి అనేక అభివృద్ధి పనులకు నిధుల కేటాయించి త్రినగరి అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి ఉపాధ్యక్షులు అమరేందర్‌రెడ్డి, శాఖమూరి అమర్, ఎం.రవీందర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి జె. మనోహర్, సంయుక్త కార్యదర్శులు ఎల్ రజినీకాంత్‌రెడ్డి, ఎం. రాజ్‌కుమార్, జి. రాజేందర్‌రెడ్డి, కోశాధికారి ఎ.వెంకటమల్లారెడ్డి ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

కాజీపేట మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

కాజీపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప దర్శనం కోసం భక్తుల సౌకర్యార్థం కేరళలోని శబరిమలకు స్పెషల్ రైలును నడిపించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. (07143) మౌలాలి- కొల్లం స్పెషల్ రైలు నవంబరు 22, 29, డిసెంబరు 8, 13, 20, 27 తేదీలలో ప్రతీశుక్రవారం మౌలాలీలో ఉదయం 11.30 గంటలకు బయలుదేరి శనివారం రాత్రి 7 గంటలకు కొల్లం చేరుకుంటుందన్నారు. (07144) కొల్లం - మౌలాలీ స్పెషల్ రైలు నవంబరు 24, డిసెంబరు 01, 08, 15, 22, 29 తేదీలలో ప్రతి ఆదివారం తెల్లవారుజామున 2.30 గంటలకు కొల్లంలో బయలుదేరి మౌలాలికి సోమవారం ఉదయం 10 గంటలకు చేరుకుంటుందని తెలిపారు. చర్లపల్లి, జనగామ, భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కటప్పడి, జోలాపెట్టాయ్, సెల్వం, ఈరోడ్, తిరుప్పూర్, కొయంబత్తూర్, పలక్కడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకులం టౌన్, ఎట్టుమనూర్, కొట్టాయం, చెంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, కయన్‌కులం, కొల్లం, రైల్వే స్టేషన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

'మలేరియా'లో మాయాజాలం

(5వ పేజీ తరువాయి)



చేస్తున్నట్టు, వారికి కూడా ఇందులో భాగస్వామ్యం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

సంఘాల పేరుతో దందా

మలేరియా విభాగంలో పనిచేసే ఔట్‌సోర్సింగ్, ప్రైవేటు, కాంట్రాక్ట్ సిబ్బంది పలు కార్మిక, కుల, యువజన సంఘాలకు నాయకులు కావడంతో అధికారులు సైతం చూసీచూడనట్లు వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. వాళ్ల విధులు నిర్వర్తించకున్నా ఎవరూ పట్టించుకోలేని స్థితిలో ఉన్నారు. సిబ్బందికి పర్మినెంట్ చేయిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని సంఘాల పేరుతో మలేరియా విభాగంలో చందాల దందా సాగిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా బల్దియా కమిషనర్, మేయర్ మలేరియా విభాగంలో జరుగుతున్న అవినీతిని గుర్తించి బల్దియా నిధులు దుర్వినియోగం కాకుండా చూడాలని ప్రజలు, కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు.

ఎస్సీ రుణాలను గ్రౌండింగ్ చేయాలి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలను గ్రౌండింగ్ చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 2024-25 వార్షిక ప్రణాళికా ప్రకటించాలని, బ్యాంకులతో సంబంధం లేకుండా ఎస్సీ కార్పొరేషనే నేరుగా లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి ఆర్థిక మద్దతు పథకాలకు సబ్సిడీ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో డీబీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు బొర్ర సంపూర్ణ, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్‌తో పాటు డీబీఎఫ్ జిల్లా నాయకులు ఉన్నారు.

నేడు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం సమావేశం

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): హనుమకొండ హంటర్‌రోడ్‌లోని మాస్టర్జీ డిగ్రీ కళాశాలలో గురువారం బీసీ ఇంటెలెక్చువల్ ఫోరం సమావేశం ఏర్పాటు చేసినట్లు బీసీ పొలిటికల్ జేఏసీ నిర్వాహకుడు, మాజీ కుడా చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి రిటైర్డ్ ఐఏఎస్ టి.చిరంజీవులు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, ఈ సమావేశంలో రాష్ట్రంలో బీసీ ఉద్యమ నిర్మాణం, సమస్యలపై అవగాహన, భవిష్యత్ కార్యక్రమాల గురించి చర్చిస్తామని, బీసీ విద్యార్థులు, మేధావులు, సామాజికవేత్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సుందర్‌రాజ్ యాదవ్ ఆ ప్రకటనలో తెలిపారు.

కుటుంబ కలహాలతో ఉద్యోగి ఆత్మహత్య

వరంగల్ చౌరస్తా, నవంబరు20(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మిషన్ భగీరథ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపిన వివరాల ప్రకారం.. లోతుకుంట ప్రాంతానికి చెందిన తూడి సునీల్ (36) మిషన్ భగీరథలో నియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడికి మిల్స్‌కాలనీ ప్రాంతానికి చెందిన దివ్యతో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. కొంత కాలంగా దంపతుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. దీంతో దివ్య తన తల్లిగారింట్లోనే ఉంటోంది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన సునీల్ బుధవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. కాగా, దివ్యతో పాటు ఆమె తరుపు బంధువుల వేధింపుల వల్లే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తల్లిదండ్రులు రాధ, నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంతెజార్‌గంజ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

23న మహిళల కబడ్డీ ఎంపిక పోటీలు

కాశిబుగ్గ, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఈనెల 23న మహిళల (సీనియర్) కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లాఖాన్, సంయుక్త కార్యదర్శి కె.మల్లికార్జున్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఓ సిటీలోని స్టేడియంలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు 75కిలోల బరువు కలిగి ఉండాలని, ఇందులో ప్రతిభ చూపినవారిని రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు. అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు తమ మండల క్రీడాకారులు సమయానికి వచ్చేలా చూడాలని తెలిపారు.

ఎస్సార్ వర్సిటీలో రక్తదాన శిబిరం

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనారెడ్డి అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్‌యూ వైస్ చాన్స్‌లర్ దీపక్‌గార్గ్, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ ఎవివి.సుధాకర్, ఐఆర్‌సీఎస్ కమిటీ మెంబర్ పుల్లూరి వేణుగోపాల్, ఎన్‌సీసీ క్యాంపు ప్రతినిధులు లెఫ్టినెంట్ ఎ.రాజేశ్వర్ రావు, మాజీ ఆర్మీ హరిబాబు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో జాతీయ సదస్సు


బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, ఇతర అధికారులు

కేయూ క్యాంపస్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సోషియాలజీ,సోషల్ వర్క్స్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 28, 29 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కేయూ సోషియాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ తౌటం శ్రీనివాస్‌లు సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్లోబలైజేషన్, డెవలప్‌మెంట్ అండ్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్: మ్యాపింగ్ ది ట్రాజెక్టరీస్ ఆఫ్ సోషల్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ప్రాసెస్సెస్ ఇన్ కాంటెంపరరీ ఇండియా' అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సోషియాలజీ విభాగం సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల నుంచి వర్సిటీ క్యాంపస్‌కు వచ్చిన తర్వాత మంచి అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాలతోపాటు పలు వర్సిటీల నుంచి ప్రతినిధులు హాజరై లోతైన పరిశోధనపత్రాలను అందచేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అకూట్ జనరల్ సెక్రటరీ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ, అసోషియాలజీ విభాగం ప్రొఫెసర్ మారోజు స్వర్ణలత, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేశ్, అధ్యాపకులు డాక్టర్ కె.సుభాష్, డాక్టర్ ఎస్.సాహితీ, పూర్వ పరిశోధకులు డాక్టర్ పి.విష్ణువర్ధన్, డాక్టర్ సంగెం శ్రీనివాస్, డాక్టర్ కె. శ్రవణ్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి


బల్దియా కార్యాలయానికి వచ్చిన కాంట్రాక్టర్స్ సంఘం నాయకులు

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల్లో ఎలాంటి పైరవీలకు తావులేకుండా క్రమపద్ధతిలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని జీడబ్ల్యుఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో బుధవారం కాట్రాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కర్రు రమేష్ మాట్లాడుతూ.. చాలా కాలంగా బల్దియా పరిధిలో కాంట్రాక్టర్లు చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించడంలో జాప్యం జరిగిందన్నారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే స్పందించి చేసిన పనులకు వరుస క్రమంలో బిల్లులు చెల్లించాలన్నారు. అంతేకాకుండా బల్దియాలో కొందరు బడా కాంట్రాక్టర్లదే హవా నడుస్తోందని, అప్పులు చేసి పనులు చేసిన తమను గుర్తించి న్యాయంగా పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. తమ సమస్యలు గుర్తించి రూ.187.42కోట్ల బడ్జెట్ విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతోపాటు మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడేలకు కాంట్రాక్టర్ల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్స్ అసోసియే షన్ ప్రధాన కార్యదర్శి గొలుసుల సంపత్, నాయకులు అప్పాల శ్రీనివాస్, సంతోష్‌నాయక్, గండికోట రాజు, మాదవ శంకర్, హరికృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విద్యార్థి నేతలు

వడ్డెపల్లి, నవంబరు20(ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్లలో పేరుకుపోయిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్స్ అసోసియేషన్(టీఎస్ఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల మహేష్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ దామళ్ల సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో విద్యార్థి యుద్ధభేరి మహాసభ కరపత్రాలను విద్యార్థి నాయకులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని అన్నారు. ప్రస్తుత మెస్‌చార్జీలు రూ.1500 ఉన్నాయని, వాటిని రూ.4000కు పెంచాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 22న ఉదయం 11 గంటలకు హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించే విద్యార్థి యుద్ధభేరి మహాసభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యసంఘర్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి ఏదునూరి రాజమొగిళి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పులి శ్రీనివాస్‌గౌడ్, బుట్టి శ్యామ్‌యాదవ్, ప్రజా సంఘాల నాయకులు బొనగాని యాదగిరిగౌడ్, ఇమ్మడి ప్రసన్న, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల నియంత్రణాధికారుల నియామకం

కేయూ క్యాంపస్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరీక్షల విభాగంలో ఇద్దరు అదనపు పరీక్షల నియంత్రణాధికారులను నియమిస్తూ గురువారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. బీఏ, బీకాం రెగ్యులర్ కోర్సులకు కేయూ మైక్రోబయోలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.వెంకటయ్య, దూరవిద్య కేంద్రం కోర్సుల అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.పద్మజను ఏడాదికి నియమిస్తూ ఉత్తర్వులుజారీ చేశారు. ఇప్పటి వరకు అదనపు పరీక్షల నియంత్రణాధి కారిగా పనిచేస్తున్న డాక్టర్ ఎ.నరేందర్ నుంచి పద్మజ బాధ్యతలు చేపడతారు. వీరికి కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డితో పాటు ఇతర పరిపాలన అధికారులు అభినందనలు తెలిపారు.

సైకాలజిస్టుల సంఘం కార్యవర్గం ఎన్నిక

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైకాలజిస్టుల అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం నియామకమైంది. సుబేదారిలోని కలెక్టరేట్ ఎదురుగా ఉన్న టీపీఏ జిల్లా కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మోత్కూరి రామచందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మురళీధర్‌రావులు తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలిగా తిరిగి రెండో గంగిశెట్టి శ్రీవిద్య నియామకమయ్యారు. ఉపాధ్యక్షులుగా డాక్టర్ శివుడు, మహిళా ఉపాధ్యక్షురాలిగా జె.పూర్ణిమ, కార్యదర్శిగా డి.కళ్యాణి, ఉప కార్యదర్శిగా కె.దామోదర్, మహిళా ఉప కార్యదర్శిగా సీ.హెచ్ మాధవి, కోశాధికారిగా ఎల్. శంకర్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఉన్నిసా, ఎస్.వెంకట్ రెడ్డి, ఎస్.నాగలక్ష్మీ, సాజియా ఆస్మిన్, బట్టి రంజిత్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా నూతన అధ్యక్షురాలు శ్రీవిద్య మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర అసోసియేషన్ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

మట్టెవాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 13 మందికి వరంగల్ కోర్టు రూ.13,300 జరిమానా విధించిందని వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన కేసులో ముగ్గురికి రూ. 2వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. అంతేగాకుండా మద్యం తాగి వాహనం నడిపిన మరో ముగ్గురికి సామాజిక సేవ శిక్షను విధించారని వివరించారు. వారిలో వరంగల్ గిర్మాజిపేటకు చెందిన తవితి అయ్యప్ప, హనుమకొండ వడ్డెపల్లికి చెందిన ముదిగంటి వేణు, వరంగల్ అబ్బని కుంటకు చెందిన లింగమూర్తి ఉన్నారని సీఐ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి పేరుతో మోసం.. నలుగురిపై కేసు

మట్టెవాడ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పేరుతో మోసం చేసిన నలుగురిపై మట్టెవాడ పోలీసులు కేసు నమోదు చేశారు. వరంగల్ కొత్తవాడ బ్యాంకుకాలనీకి చెందిన వనం రవి ఉపాధి కోసం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వరంగల్ శివనగర్‌కు చెందిన నాంపెల్లి శ్రీనివాసాచారితో పాటు అతడి స్నేహితులైన అనిల్, రత్నకుమార్, పర్వీన్ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తామంటూ వనం రవిని నమ్మించారు. అంగ్లంలో ఉన్న విషయాన్ని పదిసార్లు 500 పేజీలలో రాస్తే వారికి రూ.13500 వస్తాయని చెప్పారు. ఇందుకు కొంత నగదు చెల్లిస్తే మెటీరియల్ పంపిస్తామని నమ్మించారు. దీంతో వనం రవి మొత్తం 183 మంది దగ్గర సుమారుగా రూ.4.92 లక్షల వరకు వసూలు చేసి కొంత మొత్తాన్ని నగదుగా, మరికొంత మొత్తాన్ని ఫోన్ పే ద్వారా ఆ నలుగురికి ముట్టజెప్పాడు. తర్వాత నెలలు గడుస్తున్నా మెటీరియల్ ఇవ్వకుండా తప్పించుకొని తిరుగుతుండడంతో వనం రవి తన మిత్రుడు రాజుతో కలిసి బుధవారం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు.

మొక్కల ఎదుగుదలకు ఎరువులు కీలకం

ఎఫ్ఏఐ చెన్నై రీజనల్ హెడ్ వైవీఎస్ మూర్తి


మాట్లాడుతున్న మూర్తి

హసన్‌పర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మానవులకు పోషకాలు ఎంత ముఖ్యమో మొక్కల ఎదుగుదలకు ఎరువుల ద్వారా పోషకాలను అందించడం అంతేముఖ్యమని ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చెన్నై సథరన్ రీజియన్ రీజినల్ హెడ్ వైవిఎస్.మూర్తి అన్నారు. అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ డీన్ డాక్టర్ జి.భూపాల్‌రాజ్ నేతృత్వంలో ది ఫర్టిలైజర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సథరన్ రీజియన్ చెన్నై, స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్, ఎస్సార్ యూనివర్సిటీ సంయుక్తంగా బుధవారం ఎరువులపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సార్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.అర్చనా రెడ్డి, ఎఫ్ఏఐ రీజినల్ హెడ్ వైవిఎస్. మూర్తి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రధానంగా వ్యవసాయ విభాగంలో ఎరువుల పాత్ర, వాటి ఉపయోగం, వాడకం పద్ధతులు, సుస్థిర వ్యవసాయ పద్ధతులకు సంబంధించి ముఖ్యమైన వివరాలతో పాటు ఉపాధి అవకాశాల పరిచయం, అవగాహన వంటి పలు అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్ విశ్వవిద్యాలయం వ్యవసాయ కళాశాల హెచ్ఓడీ మోహనకీర్తి, ఎంటామాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లాల్‌సింగ్ రాథోడ్, పీజీ కోఆర్డినేటర్, అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయ్, బోధనబోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాయాత్రను విజయవంతం చేయాలి

● వరంగల్ కలెక్టర్ సత్యశారద


కళాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం పాలన పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ప్రభుత్వ విజయాలను వివరించేందుకు ప్రజా పాలన విజయోత్సవ కళా యాత్రను ప్రారంభించామని కలెక్టర్ సత్యశారద అన్నారు. బుధవారం ఆమె కలెక్టరేట్ ఆవరణలో సమాచార పౌరసంబంధాల శాఖ, సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబరు 7వ తేదీ వరకు నిర్వహించనున్న కళాయాత్ర వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామ, మునిసిపల్ వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతీ రోజు మూడు గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించాలని, ఒక్కో కార్యక్ర మం గంటన్నరకు తగ్గకుండా ఉండాలని సూచించారు. ఈ నెల 28న, డిసెంబరు 3న రాష్ట్ర సాంస్కృతిక శాఖ నుంచి భారీ కళాప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తామని అన్నా రు. షెడ్యూల్ ప్రకారం యాత్రలు కొనసాగించేలా మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పర్యవేక్షిం చాలన్నారు. అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీఆర్‌వో అయూబ్ అలీ, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

సరైన జీవనశైలితో సంపూర్ణ ఆరోగ్యం

● ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి

గిర్మాజిపేట, నవంబరు20 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, సరైన జీవనశైలి అలవరుచుకుంటే అందరూ సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి అన్నారు. ప్రపంచ ఫైల్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో శల్యతంత్ర విభాగం, జండ్ ఆయుర్వేదిక్ కంపెనీ సహకారంతో ఫైల్స్ ఫిస్టులాకు సంబంధించి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మావతి మాట్లాడుతూ.. సరైన జీవనశైలితోపాటు శారీరక శ్రమ లేకపోవడంతో వివిధ వ్యాధులకు గురవుతున్నామని అన్నారు. వ్యాధులు వచ్చిన తరువాత చికిత్స తీసుకోవడం కంటే ముందస్తుగా సరైన ఆహారం తీసుకుంటే సమస్యలు రావని అన్నారు. శల్యతంత్ర ప్రొఫెసర్ డాక్టర్ జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ.. మలబద్ధకం, ఊబకాయం, ఆహారపు ఆలవాట్లు, జీవనశైలి, కాలేయం, క్యాన్సర్, క్షయ తదితర వ్యాధుల కారణంగా ఫైల్స్, ఫిస్టులా వ్యాధులు వస్తాయని అన్నారు. అనంతరం ఫైల్స్, ఫిస్టులా రోగులకు జండ్ ఫార్మసీ కంపెనీ ప్రతినిధులు ఎం.నాగేందర్, ఎ.కృష్ణ ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అనంతలక్ష్మి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్ కుమార్, ప్రొఫెసర్లు విజయగణేష్, ఎన్.శ్రీధర్, వైద్యులు వెంకట రమణ, మధు, హరిశంకర్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టెన్నిస్ పురుషుల జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నవంబరు 22 నుంచి 26 వరకు కేరళలోని యూనివర్సిటీ ఆఫ్ కేరళలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ టెన్నిస్ పురుషుల జట్టును బుధవారం ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య తెలిపారు. ఎంపికైన క్రీడాకారులలో కె.విశాల్ అధిత్య, (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), బి.మనోజ్ కుమార్, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాల్వంచ), కె.హరికృష్ణ (యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల, కేయూక్యాంపస్, హనుమకొండ), ఎం.ప్రణయ్, (యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ క్యాంపస్, హనుమకొండ), బి.నరేశ్(కిట్స్ కళాశాల, హసన్‌పర్తి)లున్నట్లు పేర్కొన్నారు. ఈ జట్టుకు కోచ్, మేనేజర్‌గా హసన్‌పర్తి కిట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.వీరాస్వామి వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వెంకయ్య అభినందించారు.

రాష్ట్రస్థాయి సెట్ పరీక్షల్లో జయంతికి 9వ ర్యాంకు



కేయూ క్యాంపస్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన రాష్ట్ర స్థాయి స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్ (టీజీ సెట్-2024) పరీక్షల్లో హిందీ సబ్జెక్టులో జయంతి తొమ్మిదో ర్యాంకు సాధించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, లెక్చరర్ పోస్టుల భర్తీలో టీజీసెట్ పరీక్షలను అర్హతగా చూపారు. జీటీసెట్ - 2024లో 200 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో జయంతి 9వ ర్యాంకు సాధించినట్లు జీటీసెట్-2024 అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం జయంతి వరంగల్ సీకేఎం కళాశాలలో హిందీ విభాగం లో అతిథి అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు. ఉత్తమ ర్యాంకు సాధించడం పట్ల కేయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అర్థశాస్త్ర విభాగాధిపతి, శ్రీధర్‌కుమార్ లోథ్‌తో పాటు పలువురు అభినందించారు.

రేపు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 20:(ఆంధ్రజ్యోతి) : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమకొండ జేఎన్ఎస్‌లోని సింథటిక్‌ట్రాక్‌పై జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-8, 10, 12 బాలబాలికల 100, 200, 400, మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, జావెలిన్‌త్రోలో ఎంపికలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో రాణించిన క్రీడాకారులు డిసెంబర్ 1నుంచి మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన అథ్లెట్లు తమ ఆధార్‌కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, జనన ధ్రువీకరణ పత్రంతో ఈ నెల 22న ఉదయం 10గంటలకు జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్9390104499 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర, సిక్కువాడలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు, బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని పద్మాక్షీ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు, తిరిగి మధ్యాహ్నం 1 గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

● హసన్‌పర్తి: సీతంపేట, పెంబర్తి, గంటూర్‌పల్లి, హసన్‌పర్తి గ్రామాలలో గురువారం విద్యుత్ మరమ్మతు పనులు జరుగుతున్నందున ఆయా గ్రామాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏడీ అశోక్ కోరారు.

బస్సుల కోసం మహిళల గొడవ

బాలసముద్రం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ నుంచి హైదరాబాద్ రూట్లలో బస్సులు లేకపోవడంతో మహిళలు బుధవారం రాత్రి గొడవకు దిగారు. హనుమకొండ బస్టాండ్‌లో గంటల తరబడి ఎదురు చూసినా బస్సులు రాకపోవడంతో ఆర్టీసీ అధికారులపై మండిపడ్డారు. అక్కడ ఉన్న ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులతో వాదనకు దిగారు. ప్రయాణికులకు సరిపడా బస్సులు ఉండడంలేదని ప్రయాణీకులు వాపోయారు. హైదరాబాద్ రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను పెంచి ప్రయాణీకులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన సౌకర్యం కల్పించాలని అధికారులను కోరారు.

పెండింగ్ ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి


కేడీసీ ఎదుట కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలియజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఫీజు బకాయిలు, రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషకుని సంతోష్ డిమాండ్ చేశారు. బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ హనుమకొండలోని కేడీసీ ముందు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని విస్మరిస్తోందని విమర్శించారు. డిగ్రీ విద్యార్థు లకు ఈ నెలలో సెమిస్టర్ పరీక్షలు ఉండటం, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు నిరవధిక బంద్‌చేయడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చరణ్, కుమార్, రవితేజ, వినయ్, సంధ్య, ప్రవళిక, రూబియానా, రాము, రాజు, అనిల్, వినయ్ పాల్గొన్నారు.

డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అగ్రిమెంట్ తేదీ కంటే ముందే డీఈవో వాసంతి తన కారును తీసేసిందన్న అనుమానంతో డ్రైవర్ ఆత్మహత్యా యత్నం చేశాడు. పోలీసులు వచ్చి న్యాయం చేస్తామని చెప్పడంతో శాంతించాడు. బాధితుడు సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ డీఈవో వాసంతికి సమ్మయ్య తన కారును అద్దెకు పెట్టి తను డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం యధావిధిగా డీఈవో ఇంటికి కారుతో వెళ్లాడు. ఇంతలో డీఈవో కార్యాలయం సీసీ ఫోన్ చేసి "మేడం ఈ రోజు ఆఫీస్‌కు వెళ్లడం లేదు.. నీవు ఇంటికి వెళ్లు" అని చెప్పారు. తర్వాత బిల్లు కోసం సమ్మయ్య డీఈవో ఆఫీస్‌కు వెళ్లగా ఆమె కార్యాలయంలోనే ఉన్నారు. ఆమెతో మాట్లాడేందుకు వెళ్లగా వారించి బయటకు పంపించారు. దీంతో తనకు తెలియకుండా తన కారును తీసేశారని భావించి మనస్తాపంతో భవనం ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న సీఐ సత్యనారాయణరెడ్డి వచ్చి సమ్మయ్యతో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పడంతో కిందికి దిగాడు. ఈ విషయంలో డీఈవోను వివరణ కోరగా డిసెంబరు 31 వరకు కారు అద్దె అగ్రిమెంట్ ఉందని, తాను ఎవరినీ తీసివేయలేదని, డ్రైవరే కావాలని ఇదంతా చేస్తున్నారని స్పష్టం చేశారు.

వరంగల్ మాస్టర్ ప్లాన్‌పై సీఎం ప్రత్యేక శ్రద్ధ

కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి


కుడా అధికారులను సన్మానిస్తున్న వెంకట్రామ్‌రెడ్డి


వరంగల్ కార్పొరేషన్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతోనే వరంగల్ - 2041 మాస్టర్ ప్లాన్‌కు అమోదం వచ్చిందని, త్వరితగతిన ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డు పనులు జరుగుతాయని కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండ కుడా కార్యాలయంలో కుడా ఉద్యోగులతో కలిసి సక్సెస్‌మీట్ నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ కోసం కృషిచేసిన సిబ్బందిని శాలువాతో సత్కరించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకట్రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధికి వరాల జల్లు కురిపించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపు తున్నామన్నారు. అడగగానే ఓఆర్ఆర్ నిర్మాణానికి నిధులు విడుదల చేశారని అన్నారు. కుడా అధికారులు సమన్వ యంతో పనిచేయడం వల్లను జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడా కుడా వైస్ చైర్ పర్సన్ అశ్విని తానాజీ వాకడే, సీపీవో అజీత్‌రెడ్డి, సెక్రెటరీ మురళీధర్‌రావు, ఈఈ భీంరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌ను విమర్శించే స్థాయి సీఎంకు లేదు

● డిప్యూటీ మేయర్ రిజ్వానా షమి మసూద్


మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీ మసూద్

మట్టెవాడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను విమర్శించే స్థాయి సీఎం రేవంత్‌రెడ్డికి లేదని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీ మసూద్, బీఆర్ఎస్ నాయకుడు సయ్యద్ మసూద్ అన్నారు. బుధవారం వారు వరంగల్ మండిబజార్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వరంగల్ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీపైన, కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపైన చేసిన ఆరోపణలు అవాస్తమని అన్నారు. మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, 6 గ్యారంటీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. కాళోజీ కళాక్షేత్రానికి కేసీఆర్ శంకుస్థాపన చేసి నిధులు కేటాయిస్తే రేవంత్‌రెడ్డి వచ్చి రిబ్బన్ కట్ చేశారని విమర్శించారు. కేవలం బీఆర్ఎస్ పార్టీని, కేసీఆర్‌ను తిట్టడం కోసమే ఆయన కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి సభ నిర్వహించారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో 36వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు నీలం నవీన్ తదితరులు పాల్గొన్నారు.


చెట్ల పొదల మధ్య కూరుకుపోయిన చౌడేశ్వరాలయం


శిథిలమై నేలమట్టమైన 500 స్తంభాల ఆలయం


భోగేశ్వరాలయంలోని శివాలయం, నంది విగ్రహం

నాటి సైనిక స్థావరం.. నేడు శిథిలం

చరిత్ర


- పలు ప్రాచీన ఆలయాలకు నిలయం కొండపర్తి
- అబ్బుర పరిచే త్రికూటాలయం
- శిథిలావస్థకు చేరిన కట్టడాలు.. మట్టిలో కూరుకుపోతున్న శిల్పాలు
- పాలకుల నిర్లక్ష్యంతో చరిత్రకు చెదలు

హనుమకొండ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు ఆ గ్రామం కాకతీయుల సైనిక స్థావరం. పలు ఆలయాలకు, అద్భుతమైన శిల్పసంపదకు నిలయం. అంతటి చరిత్రకు పాలకుల నిర్లక్ష్యం కారణంగా చెదలు పడుతోంది. పట్టించుకునేవారు లేక అపురూప శిల్పాలు మట్టికొట్టుకుపోతున్నాయి. ప్రాచీన ఆలయాలు శిథిల మవుతున్నాయి. శాసనాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఓరుగల్లు వారసత్వ సంపదను కాపాడటంలో కేంద్ర పురావస్తు శాఖ, రాష్ట్ర పురావస్తు శాఖలు సైతం పట్టీపట్టనట్టు వ్యవహరిస్తున్నాయనడానికి ఈ గ్రామమే నిదర్శనంగా నిలుస్తోంది. పాలకుల నిర్లక్ష్యంతో కనుమరుగువుతున్న కొండపర్తి గ్రామం చరిత్ర భవిష్యత్ తరాలకు దూరమవుతుందన్న ఆవేదన స్థానికుల్లో కనిపిస్తోంది. వరంగల్‌కు సమీపంలో ఉన్న ప్రసిద్ధి కెక్కిన గ్రామం కొండపర్తి. అటు ఐనవోలు మండల కేంద్రం నుంచి.. వరంగల్ నగరం నుంచి 13 కి.మీ దూరంలో ఉన్న ఈ గ్రామం కాకతీయుల కాలంలో సైనిక స్థావరంగా వెలుగొందింది. నాడు సైనిక కవాతులతో దద్దరిల్లి సామంత సేనగా వర్ధిల్లింది. రుద్రదేవుడికి మంత్రిగా పని చేసిన కాటమసేనాని, ఆయన రెండవ కుమారుడు చౌండసేనాని కొండపర్తివాసులే. నాడు చౌండసేనాని కాకతీయ సైన్యానికి అధిపతిగా ఉండేవాడు. చౌండసేనాని మంచి పరిపాలనాదక్షుడు. కొండపర్తితో ఉన్న అనుబంధంతో ఈ గ్రామాన్ని సైనిక స్థావరంగా తీర్చిదిద్దాడు. అంతే కాకుండా గ్రామం పట్ల ఉన్న మమకారంతో తన పేర చౌండ సముద్రం అనే చెరువును తవ్వించాడు. ఎన్నో ఆలయాలను నిర్మించాడని ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి.రెండు కొండల మధ్య ఉన్న గ్రామం కావడంతో కొండపర్తి అనే పేరు వచ్చిందని స్థానికులు చెబుతుంటారు. గణపతి దేవ చక్రవర్తి కాలంలో వేయించిన శాసనాలు ఉండగా.. చౌండసేనాని నిర్మించిన దేవాలయాలు, తటాకాలు నేటికీ కనిపిస్తాయి.

- చౌండసేనాని నిర్మించిన చౌండేశ్వరాలయాన్ని కొండపర్తి శివాలయంగా పిలుస్తారు. ఆలయంలోని శాసనం ప్రకారం ఇది క్రీ.శ 1125లో నిర్మితమైందని తెలుస్తోంది. ఆలయంలో శివలింగం, విష్ణు మూర్తి, పోలేశ్వరుడి విగ్రహాలను ప్రతిష్ఠించారని, ధూపదీప నైవే ద్యాల కోసం చౌండ్యపురం అనే అగ్రహారాన్ని, నారుకుర్తి అనే మరో గ్రామాన్ని దానమిచ్చారని చెబుతుంటారు. చౌండసేనాని వేయించిన శాసనం, అంజనేయ స్వామివిగ్రహం, భైరవమూర్తి విగ్రహాలు, ఇతర శిల్పాలు ఇక్కడ చెల్లాచెదరుగా పడి కనిపిస్తాయి.


త్రికూటాలయం

- కొండపర్తిలోని త్రికూటాలయం అద్భుత శిల్పకళ, అపూరూపమైన నిర్మాణశైలితో ఆకట్టుకుంటుంది. ప్రోలరాజు నిర్మించిన ప్రోలేశ్వరాలయం, తర్వాత రుద్రదేవుడు కట్టించిన రుద్రేశ్వరాలయాలతో కలిసి ఒక చెన్నకేశవాలయాన్ని నిర్మించారు. ఇవి మూడు కలిసి త్రికూటాలయంగా వర్ధిల్లుతోంది. ప్రస్తుతం ఇదొక్కటే కాల గతిన నిలిచిన దేవాలయం. ఈ ఆలయంలో గతంలో ఓ వినాయ కుడి విగ్రహం ఉండేది. కాలక్రమంలో అది చోరీకి గురైంది. కొండ పర్తి పెద్ద చెరువు కట్టపై ఒక పురాతన ఆలయం, కొండపర్తిలో ఉన్న మరో ఆలయం నేలమట్టమై శిథిలాలు విగిలాయి. 500 స్తం భాలతో నిర్మితమైన ఈ దేవాలం ప్రస్తుతం శిథిలావస్థకు చేరు కుంది. భోగేశ్వరాయలయంగా పిలిచే ఈ గుడి ఎదుట వీరాంజనేయ స్వామి విగ్రహం నేటికీ పూజలందుకుంటోంది. అలాగే వేణుగోపాల స్వామి ఆలయం, సురాభాండేశ్వరాలయం (శివాలయం) కూడా ఉన్నాయి. వేణుగోపాల స్వామి ఆలయంలో నల్లరాతితో చెక్కిన పద్మనాభ స్వామి, గరుడ, ఆంజనేయ స్వామి విగ్రహం దర్శన మిస్తాయి. వాటి కింద నుంచి రహస్య సొరంగ మార్గం ఉందని చెబుతారు.


కొండపర్తిలోని బురుజు

- చారిత్రక కొండపర్తిలోని సురాభాండేశ్వరాలయ ప్రవేశంలో రెండు వైపుల ద్వారా పాలక విగ్రహాలు, ఆలయంలోకి లోపలికి ప్రవేశించగానే వివిధ రకాల పరిమాణాల్లో మూడు నందులు కనిపి స్తాయి. ఇందులో రెండు కాకతీయ శైలిలో ఉండగా, మరొకటి చాళు క్య శైలిలో ఉంటుంది. అంతరాలయంలో శివలింగంపైన పైకప్పుపై సూక్ష్మరాతి విగ్రహాలు చెక్కి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆ విగ్రహాల్లో ఒక యుద్ధ వీరుని విగ్రహం కనిపిస్తుందని, అది చౌండ సేనానిదని చెబుతారు. గ్రామంలో మూడు రాతి శాసనాలు ఉండగా ఊరి చివరన చెరువుగట్టు పక్కన ఉన్న గుట్టమీద కొక్కెర గుండు అని పిలిచే రాతి బండపై ఒక శాసనం ఉంది. దానిపై క్రీశ 9వ శతాబ్దం నాటి ప్రాచీన తెలుగు లిపి ఉంది. మూడో శాసనం క్రీశ 1242లో అందుకు ముందు నిర్మితమైన పోలేశ్వర ఆలయంలో రుద్రే శ్వర, కేశవమూర్తులను ప్రతిష్ఠాపన చేసిన ఆలయానికి ప్రాకారం ఏర్పరచినట్లు రాసి ఉంది.

నేడు దీనావస్థలో...

కొండపర్తిలోని కాకతీయుల నాటి ప్రాచీన ఆలయాలు, కట్టడాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. నాటి సైనిక స్థావర ఆనవాళ్ల చౌండసేనాని నిర్మించిన ఆలయాలు కనుమరగవుతున్నాయి. చౌండేశ్వరాలయం ఈ ఆలయం పూర్తిగా శిథిలమైంది. ఆలనా పాలనా లేకపోకవడంతో ఆలయం చుట్టూర చెట్లు, ముళ్లపొదలు దట్టగా పెరిగి అక్కడి వెళ్లడానికి కూడా వీలు లేకుండా ఉంది. ఆ పక్కనే రెండు నంది విగ్రహాలు మట్టిలో కూరుకుపోయి ఉన్నాయి. పట్టించుకునేవారు లేక త్రికూటాలయం క్రమంగా ధ్వంసమ వుతోంది. ఈ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు కేంద్ర పురావస్తు శాఖ స్తంభాలపై నెంబర్లు వేసింది కానీ ఆ తర్వాత పట్టించుకోలేదు. కాకతీయుల నాటి శిల్పాలు భూమిలో కూరుకుపోతున్నాయి. శాసనాలు దెబ్బతింటున్నాయి. చుట్టూదట్టమైన చెట్లు, ముళ్లపొదలు పెరగడంతో ఆలయాలలోపలికి వెళ్లలేని పరిస్థితి ఉంది. గ్రామస్థులు రాతి స్తంభాల వద్ద పశువులను కట్టేస్తున్నారు. ఆలయ శిథిలాలు మందు బాబులకు అడ్డాగా మారాయి.

కల్యాణం.. కమనీయం..

- అంగరంగ వైభవంగా సీతారాముల పరిణయం
- భక్తజనంతో ఉప్పొంగిన జీడికల్ వీరాచల క్షేత్రం
- పట్టు వస్త్రాలు అందజేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య


తాళిబొట్టును చూపుతున్న అర్చకుడు, చిత్రంలో ఎంపీ కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భక్తులు

లింగాలఘణపురం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస తిరుక్కల్యాణ మహోత్సవాల్లో భాగంగా జీడికల్ వీరాచల శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు భక్తులు పోటెత్తడంతో జీడికల్ పరిసరాలు సందడిగా మారాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి చిందం వంశీ బ్రహ్మోత్సవ వేడుకల కోసం ప్రత్యేకమైన ఏర్పాట్లను చేపట్టగా కల్యాణ మహోత్సవానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ప్రభుత్వం తరఫున స్వామి వారికి పట్టువస్త్రాలను, హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు పెనరు సుజాతమ్మ ముత్యాల తలంబ్రాలను అందజేశారు. సుమారు రెండున్నర గంటల పాటు వేదపండితులు 31 మంది జంటలతో ఈ కల్యాణ తంతును నిర్వహించారు. ఎమ్మెల్యే ఎంపీతో పాటు అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీవో స్వరూప, ఆర్డీవో గోపీరామ్ కల్యాణ క్రతువులో పాల్గొన్నారు. ఇక వేడుకకు తరలొచ్చిన భక్తులు వీరాచలాద్రిపై ఉన్న జీడిగుండం పాలగుండాల్లో భక్తులు పుణ్యస్నానా లు ఆచరించి స్వామి వారి దర్శనం చేసుకు న్నారు. లేడిబండ వద్ద నీటి ఊటలను, మాయ లేడి రూపంలో ఉన్న మారీచుడి పాదాలను దర్శించుకున్నారు. కల్యాణోత్సవానికి హాజరైన భక్తుల కోసం లింగాలఘణపురం మండల ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమా న్ని నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన వితరణ చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ ఆధ్వర్యంలో జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నర్మెట సీఐ అబ్బయ్య, లింగాలఘణపురం, రఘునాథపల్లి, దేవరుప్పుల, పాలకుర్తి ఎస్సైలు బండి శ్రవణ్‌కుమార్, నరేశ్, సృజన్‌కుమార్, యాకూబ్ హుస్సేన్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూల ద్వారా సర్వదర్శనానికి అనుమతిం చారు. ఆలయ ధర్మ కర్తల మండలి చైర్మన్ మూర్తి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కొల్లూరు శివకుమార్, పాలకుర్తి ఆలయ కార్యనిర్వహ ణాధికారి లక్ష్మీప్రసన్న, ఉప్పలమ్మ దేవస్థానం ఈవో కెకె రాములు, రాజేంద ర్ రెడ్డి, మోహన్, భరత్‌కుమార్, మల్లేశం, ధర్మకర్తలు మొటికె శ్రీశైలం, నర్ర శరభారెడ్డి, ఊడ్గుల వెంకన్న, కత్తుల శ్రీనివాస్‌రెడ్డి, మంద శ్రీధర్‌రెడ్డి, కడకంచి లక్ష్మి, పసునూరి ఉపేందర్, తుపాకుల వెంకటేశ్, అబ్బటి బచ్చిరెడ్డి తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తా : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

సుప్రసిద్ధ జీడికల్ ఆలయానికి పూర్వ వైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. బుధవారం బ్రహ్మోత్సవాలకు హాజరైన మాట్లాడారు. ఆలయాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా జీడికల్‌కు రావాల్సిన రోడ్లను కూడా అభివృద్ధి చేస్తానని, భక్తులకు వసతి సత్రాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ కావ్య మాట్లాడుతూ వీరాచాల క్షేత్రం పైనున్న జీడి, పాల గుండాలకు భక్తులు వెళ్లేందుకు ఏడాదిలోపు మెట్ల నిర్మాణం చేయిస్తామన్నారు.



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ బన్న అయిలయ్య

నిత్య చైతన్యశీలి కాళోజీ

- ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి
- కళాక్షేత్రంలో ఘనంగా తొలి కవి సమ్మేళనం

హనుమకొండ కల్చరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నిత్య చైతన్య శీలి అని, ఆయన సాహిత్యం నిత్య నూతన చైతన్యమని కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్ విద్యార్థి అన్నారు. కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రభుత్వం జాతికి అంకితం చేసిన సందర్భంగా బుధవారం కాళోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తొలి కవి సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. ఎన్నో ఏండ్లుగా వరంగల్ కవిలోకం ఎదురుచూస్తున్న కాళోజీ కళాక్షేత్రాన్ని ఎట్టకేలకు ప్రభుత్వం ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని, కాళోజీ ఫౌండేషన్ పక్షాన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కాళోజీ ఫౌండేషన్ సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ 'పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది' అంటూ జీవితమంతా సమాజానికి అంకితం చేసిన మహావ్యక్తి కాళోజీ అని శ్లాఘించారు. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ వరంగల్ కవులు ఎదురుచూస్తున్న కల నెరవేరిందని, కవులు, రచయితలు, కళాకారులు వరంగల్‌ను గొప్ప సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

ప్రముఖ కవి బిల్ల మహేందర్ ఆహ్వానంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి ఆచార్య బన్న అయిలయ్య, అనిశెట్టి రజిత, మహ్మద్ సిరాజొద్దీన్ సీతాల రఘువేందర్, డీపీఆర్‌వో భానుప్రకాశ్ తదితరులు హాజరయ్యారు. కవి సమ్మేళనంలో కవులు నెల్లుట్ల రమాదేవి, అంజనీదేవి, దేవులపల్లి వాణి, మాదారపు వాణిశ్రీ, అన్వర్, తాడిచర్ల రవి, కుమార్, పల్లేరు వీరస్వామి, కార్తీక రాజు, జితేందర్, మహ్మద్ గుల్షన్, ఉమ, రమాదేవి, వందన, రాజమోహన్, వకుల వాసు, హాజీనురాని, శంకర్ నారాయణ, అనిత, విద్యాదేవి, పెద్ది వెంకటయ్య, మస్న వెంకటేశ్వర్లు, వి.రవికుమార్, రామా రత్నమాల తదితర 60మందికి పైగా కవులు కవితా గానం చేశారు. కవిలోకం ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న కాళోజీ కళాక్షేంద్రంలో కవి సమ్మేళనంలో పాల్గొనడం మధురానుభూతిని కలిగించిందని కవులు హర్షం వ్యక్తం చేశారు.

కవులకు దక్కిన గౌరవం



నెల్లుట్ల రమాదేవి, కవయిత్రి

కళలకు కాణాచి, ఉద్యమాల పురిటి గడ్డ మన ఓరుగల్లు. రాష్ట్రంలో ఎక్కడా లేనంత అద్భుతమైన వేదిక ఏర్పడడం, అది కూడా మన ధిక్కార స్వరాన్ని, పోరాటా స్వభావాన్నీ వారసత్వంగా ఇచ్చిన కాళోజీ పేరిట నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది. ఇది కవులందరికి దక్కిన గౌరవం.

అద్భుత దర్శనీయ స్థలం.. కళాక్షేత్రం



అన్వర్, కవి

కాళోజీ స్ఫూర్తి ప్రదాత. వరంగల్ చరిత్రలో కాళోజీ కళాక్షేత్రం అద్భుతమైన దర్శనీయ కట్టడం. కాళోజీ గౌరవానికి ఏ మాత్రం తగ్గకుండా అంతే గొప్పగా సాంకేతిక పరిజ్ఞానంతో కట్టారు. తెలుగు రాష్ట్రాల్లో ఇంత గొప్ప కళాక్షేత్రం లేదన్నది వాస్తవం. కాళోజీ పౌరుషానికి తగ్గట్టుగా ఉందీ భవనం. కళాక్షేత్రం ఎదుట కాళోజీ విగ్రహం జీవకళతో ఉట్టిపడుతోంది. ప్రభుత్వం, నాయకులు, అధికారులు, కాళోజీ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు. ఇన్నేళ్ల నిరీక్షణ ఫలించింది.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి కేంద్రం కృషి

మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మోదీ లక్ష్యం • కేంద్ర సహాయ మంత్రి నిమూబెన్ జయంతి బాయి బంబానియా

గణపురం / భూపాలపల్లి కలెక్టరేట్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందుకు గాను 'ఆకాంక్షాత్మక' జాబితాలోని జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని కేంద్ర వినియోగదారుల, ఆహారం, ప్రజాపంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ కార్యదర్శి నిమూబెన్ జయంతి బాయి బంబానియా తెలిపారు. ఆకాంక్షాత్మక జిల్లాల పర్యటనలో భాగంగా బుధవారం భూపాలపల్లి జిల్లాకు వచ్చిన ఆమె గణపురం మండలంలోని చెల్పూరులో పర్యటించి మిల్లెట్ హౌస్ యూనిట్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా మల్టీగ్రేన్ జావ, రాగి లడ్డూలను తిని చాలా బాగున్నాయని అభినందించారు. వైద్య, డీఆర్డీఏ, మత్స్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం నిర్వహించి.. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన సభలో మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 112 జిల్లాలను అభివృద్ధి చెందనివిగా ఆకాంక్షాత్మక జాబితాలో కేంద్రం గుర్తించిందని, అందులో భూపాలపల్లి కూడా ఉందన్నారు. ఈ జిల్లాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా నీతిఆయోగ్ ఆకాంక్షాత్మక జిల్లాలుగా ఏర్పాటు చేసిందన్నారు. 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్' నినాదంతో కేంద్రం ముందుకెళుతోందని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం పురోగతి సాధిస్తోందన్నారు. ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్‌ను ఐదో స్థానంలో నిలిపిన ఘనత ప్రధాని మోదీదని, మున్ముందు మూడో స్థానంలోకి తీసుకురావాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ యాస్పిరేషన్ లక్ష్యాల సాధనలో ముందంజలో ఉన్న నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాకు రూ. 10 కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. మిల్లెట్ యూనిట్ నుంచి తయారు చేసిన ఆహార పదార్థాలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారంగా అందించడానికి చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి అదనపు కార్యదర్శి ఖుష్బూ, భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నిమూబెన్ జయంతి బాయి బంబానియా

కలెక్టరేట్‌లో అభివృద్ధి లక్ష్యాలపై సమావేశం

గణపురం మండలం చెల్పూరు నుంచి భూపాలపల్లి కలెక్టరేట్‌కు చేరుకున్న కేంద్ర సహాయమంత్రి నిముబెన్ జయంతి బాయ్ బంబానియా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి లక్ష్యాలు సాధనపై విద్యావైద్య, వ్యవసాయ, ఉద్యాన, సంక్షేమ, డిఆర్డీఓ శాఖల అధికారులతో కేంద్రమంత్రి సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కలికట్టుగా కృషి చేయాలన్నారు.

వెనుకబడిన జిల్లాల అభివృద్ధిలో జిల్లా ప్రదర్శనను కేంద్రమంత్రి అభినందించారు. సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మీ, సీపీవో బాబురావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రపంచంలో ఎక్కడా లేనివి తెలంగాణలో ఉన్నాయి
- వీక్షకులను ఒలలాడిస్తున్న లక్నవరం సరస్సు
- మౌళిక వసతులకు పెద్దపీట
- మూడో ఐలాండ్ ప్రారంభంలో మంత్రి జూపల్లి కృష్ణారావు

గోవిందరావుపేట, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం బుస్సాపూర్ గ్రామ సమీపంలో ఉన్న లక్నవరం సరస్సులో రూ.7కోట్ల వ్యయంతో మూడెకరాల విస్తీర్ణంలో టీజీటీడీసీ, ఫ్రీకోట్స్ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మూడో ద్వీపాన్ని ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్కతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణ పర్యాటక శాఖ కొత్త పుంతలు తొక్కుతోందన్నారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ములుగు జిల్లాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సహజసిద్ధమైన అందాలతో లక్నవరం సరస్సు వీక్ష కులను అలరిస్తోందని, రామప్ప, లక్నవరం లాంటి సరస్సులు ఉండటంతో పాటు దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన సమ్మక్క-సారలమ్మ జాతర ములుగు జిల్లాకు గుర్తింపు తెచ్చిపెడుతోందన్నారు. పర్యాటకుల అవస రాలను దృష్టిలో పెట్టుకుని మౌళిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని, లక్నవరం సరస్సులోని ద్వీపాల అనుభూతి పొందేందుకు అండమాన్, మాల్దీవులు లాంటి సుదూర ప్రదేశాలకు వెళ్లాల్సిన అవసరం కూడా లేకుండా తెలంగాణలో ఇలాంటి ఓ అందమైన టూరిజం స్పాట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. సరస్సులోని రెండు ద్వీపాల్లో ఇప్పటికే కాటేజీల నిర్మాణం పూర్తయిందని, మూడో ద్వీపంలో కాటేజీల నిర్మాణాన్ని కూడా పూర్తి చేశామన్నారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను బలోపేతం చేయడానికి రూ.250 కోట్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినట్టు తెలిపారు.

మంత్రి ధనసరి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయిస్తున్నారన్నారు.


లక్నవరం సరస్సులోని మూడో ద్వీపంలో కాటేజీలను ప్రారంభిస్తున్న మంత్రులు జూపల్లి కృష్ణారావు, ధనసరి సీతక్క, ఎంపీ బలరాంనాయక్

రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాష్ట్రంలోని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్ రూ.100కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి కేటాయించేలా చర్యలు చేపట్టాలని కోరారు. పర్యాటక ప్రాంతాల్లో ఎవరూ ప్లాస్టి క్ కవర్లు వాడొద్దని ఆమె కోరారు.

పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్ల గత ప్రభుత్వ పాలనలో పర్యాటక ప్రాంతాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, పీపీబీ తరహాలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దు తామన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో పర్యాటక ప్రాంతా లకు నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. పర్యాటక అభివృద్ధిసంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోతన ఊరిలో అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం

పాలకుర్తిలో మంత్రి జూపల్లి

పాలకుర్తి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన, బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడి స్మారక స్మృతి వనాల అభివృద్ధి పనులు ఏడాది కాలంగా నిలిచిపోయాయని, వాటిని పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన మామిడాల యశస్వినిరెడ్డి.. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో కలిసి బమ్మెర గ్రామంలోని పోతన స్మారక స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అభివృద్ధి పనులను పరిశీలించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత విద్యార్థులు పోతన పద్యాలు నేర్చుకోవాలని సూచించారు. అమెరికాలో తెలుగు వారు వారి పిల్లలకు యాప్ ద్వారా పద్యాలను వినిపిస్తున్నారని, పోతన పద్యాలు ఎల్లలు దాటితే.. మన ప్రాంతం వారు మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది నుంచి అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. చెక్ డ్యాం నిర్మాణానికి రైతులతో మాట్లాడి భూమిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాసర తరహాలో అక్షరాభ్యాసం చేసేలా నిర్మాణాలు అద్భుతంగా ఉన్నాయన్నారు. పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాలు మరింత అభివృద్ధి చెందేలా, టూరిస్టు సర్క్యూట్‌గా అభివృద్ధి చేసేలా నిధుల మంజూరుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పోతన స్మారకం అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేసి ఆరు నెలల్లో పనులు పూర్తి చేసేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు. పోతన స్మారక విగ్రహం, లక్ష్మీ విగ్రహం కోసం మరిన్ని నిధులిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రిటైర్డు ఐఏఎస్ పాపారావు, రిటైర్డు ప్రొఫెసర్ పాండురంగారావు, డీపీవో స్వరూప, ఈఈ ప్రవీన్, డీఈ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఎస్ఈ వేణుమాధవ్, డీఈ రాంబాబు, పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ డీఈ రాజేందర్, క్రీడల అధికారి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, యుగేంధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.


బమ్మెరలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 21 నవంబరు 2024



పురుషులదే ఆధిపత్యమైన యక్షగాన కళలో నిష్ణాతురాలు కావడమే కాదు...
తండ్రి ఆశయాన్ని నెరవేర్చడానికి ఉన్నత ఉద్యోగాన్ని వదిలేసి...
కళావ్యాప్తికి అంకితమయ్యారు ప్రియాంకా మోహన్
యక్షగాన బోధకురాలుగా వేలమంది పిల్లలను తీర్చిదిద్దారు. తన ప్రదర్శనలతో
సామాజిక చైతన్యానికి దోహదం చేస్తున్నారు.
రాబోయే తరాల్లో ఈ కళకు మరింత ప్రాచుర్యం కల్పించడమే
తన లక్ష్యం అంటున్న ప్రియాంక కథ... ఆమె మాటల్లోనే...

ఆమె కళ.. నాన్న కల

"యక్షగానం... నా నరనరాల్లో జీర్ణించుకుపోయిన కళారూపం. మా పూర్వీకులది దక్షిణ కర్ణాటకలోని ఉడుపి జిల్లా సాలిగ్రామ. అది యక్షగాన కళకు ఎంతో ప్రసిద్ధి చెందిన ప్రాంతం. మా నాన్న కె.మోహన్ అందులో నిష్ణాతులు. పట్టణ ప్రాంతాల్లో ఆ కళను వ్యాప్తి చేయాలనే తపనతో... 1970ల్లో ఆయన బెంగళూరుకు వలస వచ్చారు. ప్రదర్శనలు ఇవ్వడంతో పాటు ఎందరికో శిక్షణ ఇచ్చేవారు. 1981లో 'యక్షదేగుల' అనే సంస్థను ఏర్పాటు చేశారు. రెండు పడక గదుల మా ఇంట్లో ఎప్పుడూ 20, 30 మందికి తక్కువ కాకుండా శిష్యులు ఉండేవారు. అందరికీ భోజన ఏర్పాట్లు మా అమ్మ, నాయనమ్మ చేసేవారు. నేను, నా చెల్లెలు ప్రీతి ఇదంతా చూస్తూ పెరిగాం.

అందరూ వ్యతిరేకించారు...

మమ్మల్ని మంచి కళాకారులుగా, యక్షగానంలో తనకు వారసులుగా తీర్చిదిద్దాలని మా నాన్న తపన పడేవారు. ఒక రోజు నన్ను, ప్రీతిని పిలిచి "రేపటి నుంచి మీరు కూడా శిక్షణ తీసుకోబోతున్నారు" అని చెప్పారు. నాకు, ప్రీతికి అది ఇష్టమే. కానీ దానికి మా బంధువుల నుంచి, మా కుటుంబ సన్నిహితుల నుంచే కాదు ఆఖరికి ఆయన శిష్యుల నుంచి కూడా వ్యతిరేకత వచ్చింది. ఎందుకంటే 'యక్షగానం అంటే పురుషులకే పరిమితం' అనే భావన చాలా బలంగా ఉండేది. కానీ నాన్న తన నిర్ణయానికే కట్టుబడ్డారు. "నా కుమార్తెలు ప్రదర్శనలు ఇవ్వలేకపోయినా... ఆ కళను ఏదో విధంగా ముందుకు నడిపిస్తారు" అని స్పష్టం చేశారు. మాకు నేర్పడం మొదలుపెట్టారు. ఈ సంగతి తెలిసి... చుట్టుపక్కల వారు కూడా వారి అమ్మాయిలను చేర్పడం ప్రారంభించారు. రెండేళ్ళ తరువాత... అందరూ పిల్లలే ప్రదర్శించే 'మక్కళమేళ' అనే కార్యక్రమంలో... నేను, ప్రీతి తొలి ప్రదర్శన ఇచ్చాం. ఒక వైపు చదువు, మరోవైపు ప్రదర్శనలు... ఇలా కొన్నేళ్ళపాటు సాగింది. ఇక్కడ ఒక సంగతి చెప్పాలి. నాకన్నా ప్రీతి ఎంతో శ్రద్ధగా నేర్చుకొనేది. చాలా ప్రదర్శనల్లో తనే ప్రధాన పాత్ర పోషించేది. నేను పదోతరగతికి వచ్చేసరికి మేము 300 వందలకు పైగా ప్రదర్శనలు ఇచ్చాం. నాన్న ప్రోత్సాహంతో అప్పుడప్పుడు పిల్లలకు శిక్షణ ఇచ్చేదాన్ని తప్ప గురువుగా మారే ఆలోచన నాకు మొదట్లో లేదు. కానీ నా గురించి తెలిసిన మా కళాశాల అధ్యాపకులు... నా తోటి విద్యార్థులకు యక్షగాన రీతులను బోధించాలని అడిగారు. ఇంటి బయట ఎవరికైనా నేర్పడం అదే తొలిసారి. ఇది నాకు ఎంతో ఆత్మస్థైర్యాన్ని ఇవ్వడమే కాదు, నా నైపుణ్యాన్ని మరింత మెరుగుపరిచింది.



> ఇప్పటివరకూ నేను యక్షగానంలో రెండువేలమందికి పైగా శిక్షణ ఇచ్చాను. ఈ కళని బోధించే అతి కొద్దిమంది మహిళల్లో నేనొకర్ని. నన్ను గురువుగా ఈ రంగంలో ఉన్న వారు ఆమోదించలేదు. కానీ ఇప్పుడు అందరూ గౌరవిస్తున్నారు. ప్రదర్శనల విషయానికి వస్తే... నేను పురుష, స్త్రీ పాత్రలన్నీ వేస్తూ ఉంటాను. యక్షగాన కళ భక్తి ప్రధానంగా ఉంటుంది. అయితే సామాజిక సమస్యల గురించి చర్చించడానికి ఈ కళను ఒక సాధనంగా కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఎంపిక చేసింది.

అంతా ఉచితంగానే..

నేను బిటెక్ చేశాను. 'విప్రో' తదితర సంస్థల్లో ఉద్యోగాలు చేశాను. ప్రీతి డాక్టర్ అయింది. తను ప్రదర్శనలు ఇవ్వడం తప్ప శిక్షకురాలుగా ఉండలేని పరిస్థితి. ఒకసారి మా 'యక్షదేగుల'లో శిక్షణ పొందిన తొలి బ్యాచ్ పిల్లలం అందరం ఒక చోట కలుసుకున్నాం. నాన్న తరువాత ఆ సంస్థను ఎవరు నడిపిస్తారనే ప్రశ్న చాలామంది అడిగారు. నేను ఆలోచనలో పడ్డాను. 'నేను చేస్తున్న ఉద్యోగంతో నిజంగానే సంతృప్తిగా ఉన్నానా?' అని ప్రశ్నించుకున్నాను. 'లేదు' అనిపించింది. ఆ యక్షగానం పట్ల అవగాహన పెంపొందించడం, దేశ, విదేశాల్లో దాని ఖ్యాతిని చాటి చెప్పడం, రాబోయే తరాలకు ఆ కళను అందించడం... ఇవీ నాన్న ఆశయాలు. ఆయన బిడ్డగా ఆ ఆశయాలను కొనసాగించవలసిన బాధ్యత నా మీద ఉందనిపించింది. ఉద్యోగానికి రాజీనామా చేసి... పూర్తిస్థాయి కళాకారిణిగా, శిక్షకురాలుగా స్థిరపడ్డాను. నేను తీసుకున్నది చిన్న బాధ్యత కాదని నాకు తెలుసు. ఎందుకంటే మా నాన్న ఇన్నేళ్ళుగా... శిక్షణ ఇవ్వడానికి ఒక్క రూపాయి కూడా ఎవరి దగ్గరా తీసుకోలేదు. పూర్తిగా ఉచితంగానే బోధించారు. మేము కూడా దాన్నే కొనసాగిస్తున్నాం.

గురువుగా నన్ను ఆమోదించలేదు...

ఇప్పటివరకూ నేను యక్షగానంలో రెండువేలమందికి పైగా శిక్షణ ఇచ్చాను. ఈ కళని బోధించే అతి కొద్దిమంది మహిళల్లో నేనొకర్ని. నన్ను గురువుగా ఈ రంగంలో ఉన్న వారు ఆమోదించలేదు. కానీ ఇప్పుడు అందరూ గౌరవిస్తున్నారు. ప్రదర్శనల విషయానికి వస్తే... నేను పురుష, స్త్రీ పాత్రలన్నీ వేస్తూ ఉంటాను. హాస్యపాత్రలంటే నాకు బాగా ఇష్టం. యక్షగాన కళ భక్తి ప్రధానంగా ఉంటుంది. పౌరాణిక కథలే ఎక్కువగా ఉంటాయి. అయితే సామాజిక సమస్యల గురించి చర్చించడానికి ఈ కళను ఒక సాధనంగా కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఎంపిక చేసింది. ఆ శాఖ తరఫున కొన్ని ప్రదర్శనలు కూడా ఇచ్చాం. ఆ తరువాత... కొవిడ్ వ్యాపించిన సందర్భంగా... గ్రామాల్లో తిరిగి మా ప్రదర్శనలతో ప్రజలకు అవగాహన కల్పించాం. సమకాలీన అంశాలకు చోటు కల్పించినప్పుడు, ప్రజల్లో చైతన్యం కలిగించి, ఆలోచనలు రేకెత్తించినప్పుడు ఏ కళ అయినా ఎక్కువ ఆదరణకు నోచుకుంటుందనేది నా విశ్వాసం. అందుకే వీలైనంత వరకూ సామాజికమైన విషయాలు ఉండేలా కార్యక్రమాలను రూపొందిస్తూ ఉంటాను. ఇప్పటివరకూ నేను, నా శిష్య బృందాలు దేశ, విదేశాల్లో ఏడు వేలవరకూ ప్రదర్శనలు ఇచ్చాం. ఇటీవల 'కాంతారా' లాంటి సినిమాల వల్ల యక్షగాన ప్రదర్శనలకు ఆదరణ పెరిగింది. నేర్చుకోవాలనే ఆసక్తి కూడా ఎక్కువమందిలో కలుగుతోంది. ఇది మంచి పరిణామం."



పసుపుతో జాగ్రత్త

పసుపు మంచి ఆయుర్వేద ఔషధమని అందరికీ తెలిసిందే. దీనిని వంటల్లో కూడా విరివిగానే ఉపయోగిస్తుంటాం. కానీ పసుపుని మోతాదుకు మించి వాడితే ఆరోగ్యానికి హాని కలుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం!

జీర్ణ సమస్యలు

● పసుపు కాలేయంలో పైత్యరసం ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీనివల్ల పొట్టలో ఆమ్లతత్వం, జఠరాగ్ని పెరుగుతాయి. పసుపును ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపునొప్పి, విరేచనాలు, కడుపు ఉబ్బరంగా అనిపించడం, తలనొప్పి, తల తిరగడం, అజీర్ణం, మలబద్ధకం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయి. ఛాతిలో మంట, పొట్టలో కురుపులు వచ్చే ప్రమాదం కూడా ఉంది.

మూత్రపిండాల్లో రాళ్లు

● పసుపులో ఆగ్జలేట్లు ఉంటాయి. పసుపును ఎక్కువగా వినియోగించినపుడు ఈ ఆగ్జలేట్లు శరీరంలోని కాల్షియంతో కలిసి కాల్షియం ఆగ్జలేట్ స్ఫటికాలుగా మారతాయి. పసుపులో ఉండే కొన్ని రకాల మినరల్స్ కూడా రాళ్లలా మారతాయి. ఇవన్నీ మూత్రపిండాల్లోకి చేరి తీవ్రమైన నొప్పిని కలిగిస్తాయి.

రక్తం పలుచగా

● పసుపుకి యాంటీ కోయాగ్యులెంట్ గుణాలు ఉంటాయి. ఇవి రక్తాన్ని పలుచగా చేస్తాయి. దీనివల్ల రక్తం తొందరగా గడ్డకట్టదు. శరీరానికి ఏదైనా సర్జరీ జరిగినపుడు లేదా ప్రమాదవశాత్తూ గాయాలైనపుడు రక్తస్రావం ఆగక పలు సమస్యలు ఏర్పడతాయి.

ఐరన్ లోపం

● పసుపులో కర్క్యుమిన్ సమ్మేళనం ఉంటుంది. ఇది శరీరానికి ఐరన్ ధాతువును అందకుండా చేస్తుంది. దీనివల్ల శరీరంలో రక్తహీనత ఏర్పడుతుంది.

రక్తపోటు

● పసుపుని మోతాదుకి మించి వాడినపుడు శరీరంలో రక్తపోటు స్థాయి ఉండాల్సిన దానికన్నా తగ్గిపోతుంది. రక్తంలో చక్కెర స్థాయిని కూడా తగ్గిస్తుంది. దీనివల్ల అధిక ఒత్తిడి, ఆందోళన వంటి సమస్యలు వస్తాయి.

దద్దుర్లు

● పసుపుని ఎక్కువగా తీసుకోవడం వల్ల చర్మంపై దద్దుర్లు, దురదతోపాటు ముఖంపై మొటిమలు కూడా ఏర్పడతాయి. డెర్మటైటిస్ సమస్యలు వచ్చే ప్రమాదముంది.

తలనొప్పి

● శరీరంలో కర్క్యుమిన్ స్థాయి ఎక్కువైనపుడు తీవ్రమైన తలనొప్పి వేధిస్తుంది. ఎప్పుడూ మైకం కమ్మినట్లు ఉంటుంది. అందుకే రోజుకి 500 నుంచి 2,000 మిల్లీగ్రాముల మోతాదుకి మించి పసుపు తీసుకోకూడదు.

సలహా

ముఖం మీద ముడతలు రాకుండా...

డాక్టర్! నా వయసు 35 ఏళ్లు. చర్మం మీద ముడతలు ఏర్పడుతున్నాయి. వీటిని నియంత్రించే మార్గాలున్నాయా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించండి.

- ఓ సోదరి, హైదరాబాద్.

పెరిగే వయసుతోపాటు చర్మం మీద ముడతలు ఏర్పడడం సహజం. అయితే కొన్ని కారణాల వల్ల తక్కువ వయసులోనే ముఖం మీద ముడతలు మొదలవుతాయి. ముఖంలో ఎలాంటి హావభావాలతో సంబంధం లేకుండా స్థిరంగా ఉండిపోయే ముడతలు కొన్ని, నవ్వినప్పుడు ఏర్పడేవి మరికొన్ని. వీటిలో మొదటి రకం ముడతలు వయసుకి మించి పెద్దవాళ్లుగా కనిపించేలా చేస్తాయి. ఈ ముడతలను వాయిదా వేయగలిగే వీలుంది. సాధారణంగా 40 ఏళ్లు దాటిన తర్వాతే వృద్ధాప్య ఛాయలు మొదలవుతాయనీ, అప్పుడే ముఖం మీద ముడతలు ఏర్పడతాయనీ అనుకుంటూ ఉంటాం! కానీ నిజానికి ముఖం మీద ముడతలు 20 ఏళ్ల వయసు నుంచే మొదలవుతాయి. 30 - 35 ఏళ్ల వయసులో అవి సన్నని గీతల్లా స్పష్టంగా కనిపించడం మొదలుపెడతాయి. ఇలా చిన్న వయసు నుంచే ముఖం మీద ముడతలు కనిపించడం మొదలవడానికి ఎన్నో కారణాలున్నాయి. అవేంటంటే...

ఎండ దాడి: నేరుగా తాకే ఎండ వల్ల చర్మం అడుగున ఉండే కొల్లాజెన్ దెబ్బతిని, తరిగిపోయి ముడతలు ఏర్పడతాయి. అంతేకాదు. సూర్యరశ్మి ధాటి నుంచి తనను తాను కాపాడుకోవడం కోసం చర్మం క్రమేపీ మందంగా మారుతుంది. అలా మందం పెరిగేకొద్దీ చర్మం ముడతలుగా మారుతుంది. దీన్నే సోలార్ ఎలాస్టోసిస్ అంటారు.



గంధం పొడరు వద్దు: గంధంతో తయారైన ఫేస్ పౌడర్ల వల్ల చర్మం నల్లగా మారుతుంది. ఎండకు నల్లబడే అవకాశాలు ఇలాంటి పౌడర్లతో ఎక్కువ. ఎక్కువగా ఎండకు బహిర్గతమైతే ముడతలు మొదలవుతాయి. కాబట్టి గంధంతో తయారయ్యే పౌడర్లకు దూరంగా ఉండాలి.

సబ్బు దెబ్బ: సబ్బు చర్మం మీద మురికి వదిలించాలిగానీ సహజ నూనెలను తొలగించకూడదు. ఇలా జరగకుండా ఉండాలంటే పిహెచ్ బ్యాలెన్స్ సమంగా ఉండే సబ్బుల్ని ఎంచుకోవాలి. ఇందుకోసం చర్మపు పిహెచ్‌కు దగ్గరగా ఉండే 5.5 పిహెచ్‌పి ఉన్న సబ్బులు వాడాలి. మార్కెట్లో దొరికే సబ్బుల క్షారత్వాన్ని లిట్మస్ కాగితం సహాయంతో తెలుసుకోవచ్చు. ఫలితాన్నిబట్టి తగిన వాటిని ఎంచుకోవాలి.

నీళ్లు ముఖ్యం: చర్మం తేమగా ఉండాలంటే శరీరాన్ని తేమగా ఉంచాలి. ఇందుకోసం రోజుకి కనీసం 2 నుంచి 3 లీటర్ల నీళ్లు తాగాలి.


తీపి శత్రువు: చక్కెర, శరీరంలో ఫ్రీ ర్యాడికల్స్‌ను పెంచుతుంది. ఫలితంగా చర్మాన్ని బిగుతుగా ఉంచే కొల్లాజెన్ తగ్గుతుంది. కాబట్టి తీపి పదార్థాలను తినడం తగ్గించాలి.

చలి కాలం చర్మం భద్రం...

చలి కాలం చర్మం పొడిబారిపోవడం సహజం. మరీ ముఖ్యంగా పొడి చర్మం ఉన్నవాళ్లు ఈ కాలంలో మరింత జాగ్రత్తగా ఉండాలి. చలి కారణంగా చర్మం ముడతలు పడకుండా ఉండాలంటే చర్మాన్ని మాయిశ్చరైజర్లతో తేమగా ఉంచాలి. రోజుకి కనీసం రెండుసార్లు నాణ్యమైన మాయిశ్చరైజరు పూసుకుంటూ ఉండాలి. పొడి చర్మం గల వాళ్లు 4సార్లు లేదా అవసరాన్నిబట్టి అంతకంటే ఎక్కువ సార్లు వాడాలి. బజార్లో దొరికే మాయిశ్చరైజింగ్ క్రీమ్‌లకు బదులుగా వైద్యులు సూచించే మాయిశ్చరైజర్లు వాడడం మరింత సురక్షితం. అలాగే స్నానానికి కూడా వైద్యులు సూచించే సబ్బులే వాడాలి.

- డాక్టర్ స్వప్న ప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్,
కాస్మొస్యూర్ క్లినిక్, హైదరాబాద్

చైతన్యం



పాలియెస్టర్‌పై పోరు

పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని తల్లితండ్రులందరూ కోరుకుంటారు. అయితే తినే ఆహారం నుంచి వేసుకొనే బట్టల దాకా ప్రతి అంశం పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ విషయాలపై చాలామంది తల్లిదండ్రులకు అవగాహన ఉన్నా... వాటిని పెద్దగా పట్టించుకోరు. కానీ ఊళ్ల మధులిక మాత్రం ఒక పోరాటమే ప్రారంభించారు. పాలియెస్టర్‌కు బదులుగా సహజసిద్ధ వస్త్రాలైన లినెన్, నూలుతో తయారయ్యే యూనిఫామ్‌లను వాడుకలోకి తీసుకురావాలనుకున్నారు. అందు కోసం తన పిల్లవాడు చదువుతున్న బడి ప్రధానోపాధ్యాయురాలికి ఆమె రాసిన లేఖ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ లేఖ వెనకనున్న కారణాలను మధులిక 'నవ్య'కు వివరించారు.

"తెలుగు రాష్ట్రాల్లో ఏ పాఠశాలనైనా తీసుకోండి. దానిలో పిల్లలు వేసుకొనే యూనిఫామ్స్‌ను ఏ వస్త్రంతో తయారుచేస్తున్నారో గమనించండి. ఎక్కడో ఒకటి... అరా తప్ప యూనిఫాంలు అన్నీ పాలియెస్టర్ కలిపిన మిశ్రమ పోగులతోనే తయారవుతున్నాయి. దీని ఫలితాలు వెంటనే మనకు కనబడకపోవచ్చు. దీర్ఘకాలంలో మాత్రం ఇటు పిల్లల ఆరోగ్యానికి... అటు పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుంది. ఈ విషయంపై ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లో చర్చ జరుగుతోంది. అనేక అధ్యయనాలు సాగుతున్నాయి. పాలియెస్టర్ దుస్తులు ఎక్కువ కాలం వేసుకొనే పిల్లలకు థైరాయిడ్ వంటి హార్మోన్ల సమస్యలు వచ్చే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు పేర్కొంటున్నాయి. వాస్తవానికి ఒకప్పుడు మన దేశంలో అందరూ నూలు లేదా కాటన్ దుస్తులను మాత్రమే ధరించేవారు. ఆ తర్వాతి కాలంలో కాటన్ వాడకం తగ్గింది.

నా ఒక్కదాని సమస్య కాదు...

ఈ మధ్య కాలంలో పాలియెస్టర్ వస్త్రాలపై ప్రపంచ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని అంతర్జాలంలో చదివాను. ఆ సమాచారం చదివిన తర్వాత నాకు చాలా ఆశ్చర్యమేసింది. చిన్నారుల చర్మాలకు పాలియెస్టర్ బట్టలవల్ల కలిగే దుష్పరిణామాలు అనేకం ఉన్నాయి. అయినా మనం వాటిని వాడుతూనే ఉంటాం. తొలుత మా అబ్బాయి విషయంలో ఏం చేయాలో నాకు అర్థంకాలేదు. వాడికి రోజూ కాటన్ బనియన్ తొడిగి, ఆ తర్వాత యూనిఫాం వేయటం మొదలుపెట్టా! కానీ ఇది నా ఒక్కదాని సమస్య మాత్రమే అనిపించలేదు. దాంతో యూనిఫాంలను కాటన్‌తో తయారు చేయమని స్కూలు ప్రధానోపాధ్యాయురాలిని అభ్యర్థిస్తూ ఉత్తరం రాశా. ఆ ఉత్తరమే ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ మార్పు వెంటనే సాధ్యమవుతుందని... యూనిఫాంలను తయారు చేసే పద్ధతులను మారుస్తారని నేను అనుకోవటంలేదు. ఎందుకంటే చాలా కాలంగా అలవాటు పడిన పద్ధతులను అంత త్వరగా మార్చుకోలేం. కానీ ఎక్కడో అక్కడ ఒక ప్రయత్నం మొదలు కావాలి కదా. అందుకోసం ఎవరో ఒకరు తొలి అడుగు వేయాలి. అదే నేను చేసింది.

ప్రజల్లో చైతన్యం కోసం...

మాది రామగుండం. హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. నేను బీటెక్, ఎమ్‌బీఏ పూర్తి చేసి, 'ప్రకృతి' అనే స్వచ్ఛంద సంస్థ కోసం పని చేశాను. అలాగే 'ఈశా ఫౌండేషన్'లో వాలంటీర్‌గా బెంగుళూరు, చెన్నైల్లో పని చేశాను. మా అబ్బాయి పుట్టిన తర్వాత ఇంటికే పరిమితమైపోయాను. మావారు ఊళ్ల శ్రీనివాస్ భరద్వాజ్ పైలట్. వేసుకునే దుస్తులు, తినే ఆహారం, అనుసరించే అలవాట్లవల్ల ఆరోగ్యం, పర్యావరణం పాడైపోకుండా ఉండడం కోసం ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు నా వంతు కృషి చేస్తున్నాను. ఈ దిశగా ఏ కొద్ది మార్పు వచ్చినా... నా ప్రయత్నం ఫలించినట్టే. ఒకవేళ మార్పునకు నాతోనే బీజం పడితే అంతకు మించిన సంతృప్తి, సంతోషం మరొకటి ఉండదు.

ఇదే మొదలు కాదు...

పాలియెస్టర్ వాడకాన్ని నియంత్రించాలనే ఉద్యమానికి నా లేఖ నాంది కాదు. 'ఈశా ఫౌండేషన్' వ్యవస్థాపకుడు జగ్గీ వాసుదేవ్ పాలియెస్టర్ దుష్ప్రభావాలు, సహజసిద్ధ పోగులతో ఒరిగే ప్రయోజనాల గురించి ఎప్పటి నుంచో అవగాహన కల్పిస్తున్నారు. నూలుతో తయారైన యూనిఫామ్స్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వాలను కోరుతున్నారు. ప్రస్తుతం చాలామందికి పాలియెస్టర్ దుస్తులు వాడకంవల్ల ఎదురయ్యే దుష్ప్రభావాల తీవ్రత అర్థం కావడంలేదు. అది అర్థమైన రోజున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా కాటన్ దుస్తులనే ధరిస్తారు."

• గోగుమళ్ల కవిత

ఇలా చేస్తే పంటి నొప్పి మాయం

చలికాలంలోనే పంటి సమస్యలు వేధిస్తుంటాయి. పంటి చిగుళ్లు, దవడ లోపలి భాగం వాపుకు గురై నొప్పిని కలిగిస్తాయి. దంత క్షయం, దంతాలు వదులు కావడం, ప్రమాదవశాత్తు దంతాలు విరగడం వల్ల కూడా పంటి నొప్పి వస్తుంది. కొన్ని ఇంటి చిట్కాలతో ఈ నొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. అవేంటో చూద్దాం!

లవంగ నూనె: లవంగ నూనెలో యూజినాల్ అనే సహజ మత్తుపదార్థం ఉంటుంది. ఇది నొప్పి, వాపులను తగ్గించడంతోపాటు క్రిమినాశినిగా కూడా పనిచేస్తుంది. కొంచెం దూదిని తీసుకుని దాన్ని లవంగ నూనెలో ముంచి దానితో పంటినొప్పి ఉన్న ప్రాంతంలో అద్దాలి. అయిదు నిమిషాల తరవాత నోటిలో ఊరిన లాలాజలాన్ని ఉమ్మివేయాలి. ఇలా రెండుసార్లు చేసిన తరవాత గోరువెచ్చని నీటితో నోరు కడుక్కోవాలి. వరసగా రెండు రోజులు ఇలా చేస్తూ ఉంటే పంటి నొప్పి క్రమంగా తగ్గుతుంది.

ఉప్పు నీళ్లు: నోటిలో పెరిగే హానికారక బ్యాక్టీరియాను ఉప్పు నీళ్లు నాశనం చేస్తాయి. ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లలో అర చెంచా ఉప్పు వేసి కరిగించాలి. ఆ నీటిని నోటినిండా తీసుకుని నిమిషం అలాగే ఉండాలి. తరవాత ఉమ్మివేయాలి. ఇలా రోజుకు మూడుసార్లు చేస్తే రెండు రోజుల్లో నొప్పి తగ్గుతుంది. చిగుళ్లు గట్టిపడతాయి.



వెల్లుల్లి: వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ దంతక్షయానికి కారణమైన క్రిములను నాశనం చేస్తుంది. నాలుగు వెల్లుల్లి రెబ్బలను తీసుకుని మెత్తగా దంచాలి. ఆ మిశ్రమాన్ని నొప్పి ఉన్న పంటి మీద ఉంచి అయిదు నిమిషాల తరవాత గోరువెచ్చని నీటితో నోరు కడుక్కోవాలి. క్రమంగా పంటి నొప్పి తగ్గుతుంది.

ఒంటరితనం వేధిస్తోందా!

నేను ఒంటరిని అనుకోవడం ఒక మానసిక భావన. చుట్టూ పదిమంది ఉన్నప్పటికీ కొంతమంది ఎవరితోనూ కలవలేక ఎవరినీ అర్థం చేసుకోలేక ఒంటరిగా బాధపడుతుంటారు. ఇటువంటి ప్రవర్తన నుంచి బయటపడేందుకు ఏం చేయాలంటే...

మంచి స్నేహితులు: ప్రతి ఒక్కరికీ చాలామంది పరిచయస్తులు ఉంటారు. వారిలో మనసుకు దగ్గరగా వచ్చినవారిని గుర్తించాలి. మనసులోని భావాలను వారితో పంచుకోగలమనే ధీమా ఉండాలి. అటువంటివారితో ఎక్కువగా మాట్లాడుతూ స్నేహం పెంచుకోవాలి. వారితో కష్ట సుఖాలు చెప్పుకోవడం, వారి నుంచి సలహాలు తీసుకోవడం, వారికి అవసరమైన సలహాలు ఇవ్వడం చేస్తూ ఉంటే మనసులో ఒంటరితనమనే భావన రాదు.

కించపరచుకోవద్దు: ఒంటరిగా ఉండేవాళ్లు నాకు ఏమీ రాదు, ఏమీ చేయలేను అనుకుంటూ బాధపడుతుంటారు. ఇలా తమను తాము కించపరచుకోవడం వల్ల మానసిక వేదన అధికమవుతుంది. అలాకాకుండా మీ ఆలోచనలను ఒక పుస్తకంలో రాయండి. మీలో మీరు మాట్లాడుకోండి. మిమ్మల్ని మీరు ప్రశంసించుకోండి. ఇలా చేయడంవల్ల మీలో సానుకూల దృక్పథం పెరుగుతుంది.

అతి మంచితనం వద్దు: ఒంటరిగా ఉండేవాళ్లు సహజంగా ఎదుటివారి నుంచి గుర్తింపు కోరుకుంటారు. దీంతో చుట్టూ ఉన్నవాళ్లను పరిశీలిస్తూ వారికి అవసరమైనదానికంటే ఎక్కువగా సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారు. అలాగే వారినుంచి ప్రశంసలు, గుర్తింపు ఆశిస్తారు. ఇవి అందని పక్షంలో మనసులో వెలితి భావనలు మొదలై బాధపడుతుంటారు. అలాకాకుండా ఎవరైనా సహాయం అడిగినపుడు మాత్రమే కాదనకుండా చేయాలి. అతి మంచితనం ప్రదర్శించాలని అనుకోకూడదు.

హోదా ప్రదర్శించవద్దు: సమాజంలో మంచి హోదాలో ఉంటేనే గుర్తింపు లభిస్తుందనుకుంటారు కొంతమంది. ఇది నిజం కాదు. మంచి వ్యక్తిత్వం, ఆకర్షణీయమైన ప్రవర్తన, అందరినీ కలుపుకొనే మృదు స్వభావంవల్లనే ఒంటరితనం అనే భావన దూరమవుతుంది.

ఉత్సాహంగా ఉండాలి: నిరంతరం ఉత్సాహంగా ఉండాలనే భావన ఒంటరితనాన్ని దగ్గరికి రానీయదు. కుటుంబ సభ్యులతో తరచూ మాట్లాడడం, స్నేహితులతో సరదాగా గడిపే ప్రయత్నం చేయడం, ఇరుగు-పొరుగువారితో ఆటలు ఆడడం, కలిసి వంటలు చేయడం వంటివి మనసుని సంతోషంతో నింపేస్తాయి. క్రమంగా బంధాలు కూడా బలపడతాయి.



మీలో మీరు: నచ్చిన పని చేయడం, నచ్చిన వ్యక్తులతో గడపడం అలవాటు చేసుకుంటే మనసు సేదతీరుతుంది. ఎక్కువసేపు ఖాళీగా ఉండకుండా ఏదైనా వ్యాపకంలో నిమగ్నమైతే ఆత్మన్యూనత భావనలు దరిచేరవు. మంచి పుస్తకాలు చదవడం, బొమ్మలు వేయడం, తోటపని, పిల్లలతో గడపడం, సంగీతం వినడంవల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. తేలికపాటి వ్యాయామం, యోగా, ధ్యానంవల్ల మానసిక ఆందోళన తగ్గి ఒంటరితనం అనే భావనే ఉండదు.



చెన్నైలో బిజీ బిజీ

బుట్టబొమ్మ పూజాహెగ్డే ప్రస్తుతం చెన్నైలో సందడి చేస్తున్నారు. షూటింగ్ నిమిత్తం ఆమె కొన్ని రోజులుగా నగరంలో మకాం వేశారు. విజయ్ నటిస్తున్న (విజయ్ 69- వర్కింగ్ టైటిల్) చిత్రం షూటింగ్‌లో పూజా పాల్గొంటున్నారు. ఈ విషయాన్ని ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తెలిపారు. 'చెన్నై మార్నింగ్స్ డే 16' అంటూ సూర్యోదయం ఫొటోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసి అభిమానులతో పంచుకున్నారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన నేపథ్యంలో కథానాయకుడిగా తనకు ఇదే చివరి చిత్రం అని విజయ్ ప్రకటించారు. హెచ్. వినోద్ దర్శకత్వంలో వెంకట్ కే నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 2022లో వచ్చిన 'బీస్ట్' చిత్రంలోనూ విజయ్ సరసన పూజాహెగ్డే నటించారు. ఆమె ప్రస్తుతం ఓ తమిళ చిత్రంలో సూర్యతో నటిస్తున్నారు. హిందీలో షాహిద్‌కపూర్‌తో 'దేవా' చిత్రం చేస్తున్నారు.



సంక్రాంతికే వస్తున్నాం

వెంకటేశ్

విక్టరీ వెంకటేశ్, దర్శకుడు అనిల్‌రావిపూడి కలయికలో తెరకెక్కుతున్న మూడో సినిమా 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్య రాజేశ్ నటిస్తున్నారు. దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 14న విడుదల కానున్నట్లు మేకర్స్ బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ "ఈ సంక్రాంతికి ఒక మంచి వినోదాత్మక చిత్రాన్ని ప్రేక్షకులకు అందివ్వాలనే లక్ష్యంతో సినిమాను అద్భుతంగా తెరకెక్కించాం. నా కెరీర్‌లో నేను నటించిన ఉత్తమ కుటుంబ కథా చిత్రమిదే. అందరికీ నచ్చుతుంది. సంక్రాంతికి విడుదలవుతున్న అన్ని సినిమాలు ఘనవిజయం సాధించాలి. అనిల్‌తో పనిచేయడం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది" అని చెప్పారు. "తను అనుకున్న కథని తెరపైకి అద్భుతంగా తీసుకొచ్చే దర్శకుడు అనిల్ రావిపూడి. గతంలో నేను నిర్మించిన ఎన్నో చిత్రాలు సంక్రాంతికి విడుదలై ఘనవిజయం సాధించాయి. ఈ సినిమా వాటికంటే పెద్ద విజయం సాధించాలి" అని నిర్మాత దిల్‌రాజు తెలిపారు. "ఒక మాజీ పోలీసు.. మాజీ ప్రేయసి.. అద్భుతమైన భార్య మధ్య జరిగే అందమైన ప్రయాణం ఈ సినిమా. క్రైమ్ నేపథ్యంలో సాగే ఈ సినిమా సరికొత్త థ్రిల్‌ను పంచుతుంది. ఈ సినిమాలోని పాత్రలు అందరికీ చిరకాలం గుర్తిండిపోతాయి" అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు.

కస్తూరికి బెయిల్



తెలుగువారి కీర్తి ప్రతిష్ఠలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో అరెస్టయిన నటి కస్తూరికి ఎగ్మూరు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నెల మూడున చెన్నైలో జరిగిన ఓ సభలో నటి కస్తూరి మాట్లాడుతూ తెలుగు ప్రజలను కించపరిచేలా విమర్శలు చేశారు. నటి కస్తూరి బెయిల్ కోసం హైకోర్టులో పెట్టుకున్న దరఖాస్తును తిరస్కరించడంతో తమిళనాడు పోలీసులు హైదరాబాద్‌లో కస్తూరిని అరెస్టు చేసి నగరానికి తీసుకువచ్చారు. ఎగ్మూరు మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా, కస్తూరికి 29వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ మేజిస్ట్రేట్ ఆదేశాలివ్వటంతో పుఴల్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఎగ్మూరు కోర్టులో కస్తూరి దాఖలు చేసిన బెయిలు పిటిషన్‌పై మేజిస్ట్రేట్ దయాళన్ బుధవారం విచారణ జరిపి ఆమెకు బెయిల్ మంజూరు చేశారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

సూపర్‌స్టార్స్ మళ్లీ కలిశారు!



పద్దెనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత మలయాళ చిత్రరంగ సూపర్ స్టార్స్ మమ్ముట్టి, మోహన్ లాల్ మళ్లీ కలసి ఓ చిత్రంలో నటిస్తున్నారు. మహేశ్ నారాయణ్ దర్శకత్వం వహించే ఈ భారీ మల్టీస్టారర్ షూటింగ్ బుధవారం శ్రీలంకలో మొదలైంది. మోహన్‌లాల్ జ్యోతి ప్రజ్వలన చేసి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. ఈ సినిమాలో ఫహద్ ఫాజిల్, కుంచాకో బోబన్, నయనతార తదితరులు నటిస్తున్నారు. శ్రీలంక, లండన్, అబుదాబి, అజర్ బైజాన్, థాయ్‌లాండ్, విశాఖపట్నం, హైదరాబాద్, ఢిల్లీ, కొచ్చి తదితర లోకేషన్స్‌లో 150 రోజుల పాటు జరిగే షూటింగ్‌తో ఈ చిత్రం పూర్తవుతుంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనుష్ నందన్, సహ నిర్మాతలు: సలీమ్, సుభాష్ జార్జి, నిర్మాత: ఆంటో జోసెఫ్.

గోవాలో ఇఫీ ప్రారంభం



భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఇఫీ) బుధవారం గోవాలో డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో ప్రారంభమైంది. ఆస్ట్రేలియా చిత్రం 'బెటర్ మాన్' ప్రదర్శనతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పాల్గొన్న ఈ కార్యక్రమానికి టాలీవుడ్ నుంచి అక్కినేని నాగార్జున, అమల దంపతులు హాజరయ్యారు. రకుల్ ప్రీత్‌సింగ్, సాన్యా మల్హోత్రా, మానుషీ చిల్లర్ రెడ్‌కార్పెట్‌పై సందడి చేశారు. 81 దేశాల నుంచి ఎంపిక చేసిన 180 సినిమాలను ఈ చిత్రోత్సవంలో ప్రదర్శించనున్నారు. తెలుగు నుంచి 'కల్కి 2898 ఏడీ', '35 చిన్న కథకాదు' చిత్రాలు ప్రదర్శనకు ఎంపికయ్యాయి. అలాగే మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి సందర్భంగా ఆయన నటించిన కొన్ని చిత్రాలను ఈ ఉత్సవాల్లో ప్రదర్శించనున్నారు. ఈ నెల 28 వరకూ ఈ చిత్రోత్సవం కొనసాగుతుంది.

పగిలిన ముక్కలు మళ్లీ అతుక్కోవు

విడాకులపై ఏఆర్ రెహమాన్ స్పందన



ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్. రెహమాన్ దంపతులు మూడు దశాబ్దాల వైవాహిక బంధానికి స్వస్తి పలికిన నేపథ్యంలో వారి తరపు న్యాయవాది వందనా షా ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై దేశవ్యాప్తంగా సంచలనం రేగడంతో పాటు పలువురు సెలబ్రిటీలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తమ విడాకుల వ్యవహారంపై ఏఆర్.రెహమాన్ బుధవారం స్పందించారు. 'మా దాంపత్య జీవితానికి త్వరలోనే 30 ఏళ్లు నిండుతాయని సంతోషించాం. అయితే, అనుకోని విధంగా ముగింపు పలకాల్సి వస్తుందని ఊహించలేదు. విరిగిన హృదయాలు, పగిలిన ముక్కలు యధాతథంగా అతుక్కోలేవు. ఇక నుంచి మాకు నచ్చిన మార్గంలో సంతోషాన్ని వెతుక్కుంటాము' అని రెహమాన్ ఎక్స్ వేదికగా తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



ఆమె కూడా భర్తకు విడాకులు ఇచ్చింది

ఏ.ఆర్. రెహమాన్ టీమ్ మెంబర్ మోహిని డే తన భర్త, మ్యూజిక్ కంపోజర్ మార్క్‌కు విడాకులు ఇచ్చినట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. రెహమాన్ బ్యాండ్‌లో కీలక పాత్ర పోషించే మోహని ఆయనతో కలసి ప్రపంచ వ్యాప్తంగా 40కి పైగా సంగీత ప్రదర్శనలు ఇచ్చారు. రెహమాన్ భార్య సైరా బాను నుంచి విడాకుల ప్రకటన వచ్చిన కొద్ది గంటలకే మోహినీ తన విడాకుల విషయాన్ని వెల్లడించడంతో దీని గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది.

కొత్త సత్యదేవ్‌ను చూస్తారు



సత్యదేవ్, డాలీ ధనంజయ, ప్రియా భవానీశంకర్ నటించిన చిత్రం 'జీబ్రా'. ఈశ్వర్‌కార్తీక్ దర్శకత్వంలో ఎస్ఎన్‌రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరమ్, దినేశ్ సుందరమ్ నిర్మించారు. ఈ శుక్రవారం చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సత్యదేవ్ మాట్లాడుతూ "జీబ్రా' సరికొత్త వినోదాన్ని పంచే సినిమా. ఇందులో ఓ సాధారణ బ్యాంకర్ గ్యాంగ్‌స్టర్ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కొంటాడనేది చాలా ఆసక్తికరంగా చూపించాం. నా కెరీర్‌లో బిగ్గెస్ట్ ఫిల్మ్ ఇదే. ఇందులో కొత్త సత్యదేవ్‌ను చూస్తారు" అని చెప్పారు. "ఆర్థిక నేరాల చుట్టూ జరిగే కథ ఇది. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని దర్శకుడు ఈశ్వర్ కార్తీక్ అన్నారు. "సినిమా కంటెంట్ చాలా కొత్తగా ఉంటుంది. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది. సత్యదేవ్, డాలీ పోటీపడి నటించారు" అని నిర్మాత ఎస్.ఎన్.రెడ్డి తెలిపారు.



అశోక్‌ను నిలబెట్టే సినిమా ఇది

బోయపాటి శ్రీను

'హీరో' ఫేమ్ అశోక్ గల్లా, 'విఎస్ ఇండియా' టైటిల్ విజేత మానస వారణాసి జంటగా నటించిన చిత్రం 'దేవకి నందన వాసుదేవ'. ప్రశాంత్ వర్మ కథ అందించగా.. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ "ఈ సినిమా హీరో అశోక్‌ను ఇండస్ట్రీలో నిలబెడుతుంది. డైరెక్టర్‌కి అర్జున్ జంధ్యాలకి, అశోక్‌కు సింక్ చాలా బాగుంది. ఈ సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు. "అశోక్ మంచి నటుడు. ఆయన ప్రోత్సాహం వల్లే సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాకు సపోర్ట్ చేసినవారందరికీ కృతజ్ఞతలు" అని అన్నారు. "సినిమా అంచనాలను మించి ఉంటుంది" అని నిర్మాత సోమినేని బాలకృష్ణ తెలిపారు.



ఐదు భాషల్లో సస్పెన్స్ థ్రిల్లర్



నిర్మాత మోహన్ వడ్లపట్ల దర్శకుడిగా మారి రూపొందిస్తున్న చిత్రం 'ఎం ఫోర్ ఎం'. తెలుగు సహా తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రూపుదిద్దుకొన్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ఒడిశా సూపర్ స్టార్ సంబీట్ ఆచార్య, అమెరికన్ తెలుగు నటి జో శర్మ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ నెల 23న గోవాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో దేశీ విదేశీ సినీ ప్రముఖుల సమక్షంలో హిందీ వెర్షన్ ట్రైలర్‌ను విడుదల చేస్తున్నట్లు మోహన్ వడ్లపట్ల చెప్పారు. 'ఇది యూనివర్సల్ సబ్జెక్ట్. సినిమా చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు. మోటివ్ ఫర్ మర్డర్ తెలిసినప్పుడు, మునుపెన్నడూ ఎరుగని సైకోని చూసి సరికొత్త అనుభూతి పొందుతారు. ఐదు భాషల్లో త్వరలో విడుదల చేయబోతున్నాం' అని ఆయన తెలిపారు. శుభలేఖ సుధాకర్, సత్య కృష్ణ, ఎం.ఆర్.సి. వడ్లపట్ల, పసునూరి శ్రీనివాస్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

అన్ని రకాల భావోద్వేగాలతో...



దర్శకుడు అమ్మ రాజశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'తల'. ఈ చిత్రంతో ఆయన తన కుమారుడు అమ్మ రాగిన్‌రాజ్‌ను హీరోగా పరిచయం చేస్తున్నారు. సూపర్ గుడ్ ఫిల్మ్స్ సమర్పణలో ఎన్వీ ప్రసాద్, వాకాడ అంజన్‌కుమార్ నిర్మిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ "ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల భావోద్వేగాలతో నిండిన చిత్రమిది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం" అని చెప్పారు.

ఇప్పటివరకూ పోషించని పాత్ర ఇది



'జెర్సీ' ఫేమ్ శ్రద్ధా శ్రీనాథ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'మెకానిక్ రాకీ'. విష్వక్ సేన్ హీరోగా రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రద్ధా చిత్ర విశేషాలను మీడియాతో పంచుకున్నారు. "ఈ సినిమాలో ఇప్పటివరకూ పోషించని ఓ డిఫరెంట్ పాత్రను పోషించాను. ఇందులో 'మాయ' పాత్రను ఒక సవాలుగా తీసుకుని నటించా. మెకానిక్ రాకీ జీవితంలో నా పాత్ర ఎలాంటి మార్పులు తెచ్చిందనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. సినిమాలో చాలా ట్విస్ట్‌లు, సర్‌ప్రైజ్‌లు ఉంటాయి. డైరెక్టర్ రవితేజ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఆయన దర్శకత్వ ప్రతిభ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. విశ్వక్‌తో నటించడం చాలా ఎంజాయ్ చేశా. ఆయన ఎనర్జీ లెవెల్స్‌ను మ్యాచ్ చేయటం కష్టం. జేక్స్ బిజోయ్ అందించిన మ్యూజిక్ సినిమాకు ప్రధానాకర్షణ. ఈ సినిమా అన్ని వర్గాల వారిని తప్పక అలరిస్తుంది" అని చెప్పారు.





బిజినెస్

గృహం మరింత ప్రియం

- ప్రధాన నగరాల్లో సగటు ధర రూ.1.23 కోట్లు
- హైదరాబాద్‌లో రూ.1.15 కోట్లు

అనరాక్ నివేదిక



న్యూఢిల్లీ: ప్రజల ఆదాయ, వినియోగాలతో పాటు ఇళ్ల ధరలు కూడా గణనీయంగా పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి (ఏప్రిల్-సెప్టెంబరు) దేశంలోని 7 ప్రధాన నగరాల్లో అమ్ముడుపోయిన గృహాల సగటు ధర రూ.1.23 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే ధరల్లో 23 శాతం వృద్ధి నమోదయింది. కొవిడ్ సంక్షోభం తర్వాత ఖరీదైన ఇళ్లకు గిరాకీ భారీగా పెరగడంతో పాటు రికార్డు స్థాయిలో కొత్త ప్రాజెక్టులు ప్రారంభం కావడం ఇందుకు కారణమని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సంస్థ అనరాక్ వెల్లడించింది. గత ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో సగటు విక్రయ ధర రూ.కోటి ఉంది. అనరాక్ డేటా ప్రకారం.. ఈ ఏప్రిల్-సెప్టెంబరు కాలంలో దేశంలోని ఏడు బడా నగరాల్లో దాదాపు రూ.2,79,309 కోట్ల విలువైన 2,27,400 యూనిట్ల గృహాలు అమ్ముడు పోయాయి. 2023లో ఇదే కాలానికి రూ.2,35,800 కోట్ల విలువైన 2,35,200 గృహాల విక్రయాలు జరిగాయి. విక్రయాల సంఖ్య 3 శాతం తగ్గినప్పటికీ విలువ రెండంకెల్లో పెరగడం లగ్జరీ గృహాలకు నెలకొన్న భారీ డిమాండ్‌కు నిదర్శనమని అనరాక్ గ్రూప్ చైర్మన్ అనుజ్ పురి అన్నారు.

హైదరాబాద్‌లో 27,820 యూనిట్ల విక్రయాలు

ఈ ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధానికి హైదరాబాద్ మార్కెట్లో గృహ విక్రయ సగటు ధర 37 శాతం పెరిగి రూ.1.15 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలానికి సగటు ధర రూ.84 లక్షలుగా నమోదైంది. ఇక అమ్మకాల విషయానికి వస్తే 2023-24 ప్రథమార్ధంతో పోల్చితే నగరంలో ఇళ్ల విక్రయాలు స్వల్పంగా తగ్గి 29,940 నుంచి 27,820 యూనిట్లకు పరిమితమయ్యాయి. అయినప్పటికీ, సగటు విక్రయ ధర భారీగా పెరగడం గమనార్హం. హైదరాబాద్‌లోనూ లగ్జరీ ఇళ్లకు గిరాకీ భారీగా పెరిగిందనడానికిదే సంకేతం.

నగరం	సగటు ధర (రూ.కోట్లు) 2023-24	2024-25	వృద్ధి (శాతం)
ఢిల్లీ	0.93	1.45	56
బెంగళూరు	0.84	1.21	44
ముంబై	1.47	1.47	--
హైదరాబాద్	0.84	1.15	37
చెన్నై	0.72	0.95	31
పుణె	0.66	0.85	29
కోల్‌కతా	0.53	0.61	16

ముంబైలో భారీ కన్వెన్షన్ సెంటర్..

రూ.16,880 కోట్లతో నిర్మించనున్న అదానీ

ముంబై: దేశంలో రెండో అత్యంత ధనికుడు గౌతమ్ అదానీకి చెందిన అదానీ గ్రూప్ ముంబైలో అతిపెద్ద అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌ను (ఐసీసీ) 200 కోట్ల డాలర్లతో (సుమారు రూ.16,880 కోట్లు) నిర్మించబోతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ముంబై అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గర్లో, విల్లే పార్లే పశ్చిమ శివారు ప్రాంతంలో దీన్ని నిర్మించనున్నట్లు తెలిసింది. అదానీ ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ లిమిటెడ్ ఈ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించి, నిర్వహణను చేపట్టనుంది. భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌కు పోటీగా, దీటుగా అదానీ గ్రూప్ దీన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం.

కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్

10 లక్షల టన్నుల సామర్థ్యం.. 2026లో పూర్తి

కాకినాడ, (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన ఏఎం గ్రీన్ కంపెనీ వెల్లడించింది. గ్రీన్‌కో సంస్థకు చెందిన ఈ అనుబంధ కంపెనీ ద్వారా ఏడాదికి 10 లక్షల టన్నుల సామర్థ్యంతో కూడిన గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేస్తామని వివరించింది. 2026 జూన్‌లోగా దీని నిర్మాణం పూర్తి చేస్తామని కంపెనీ పేర్కొంది. ఆర్థిక ప్రగతి, ఉపాధి కల్పన, కర్బన ఉద్గారాల తగ్గింపు లక్ష్యంతో ఏర్పాటైన వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) 'ట్రాన్సిషనింగ్ ఇండస్ట్రియల్ క్లస్టర్'లో చేరిన సందర్భంగా ఢిల్లీలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ విషయాన్ని ఏఎం గ్రీన్ సంస్థ వెల్లడించింది. ఈ ప్లాంట్‌లో గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయడం ద్వారా కర్బన ఉద్గారాలను తగ్గించి పర్యావరణాన్ని పరిరక్షిస్తామని కంపెనీ చైర్మన్ అనిల్ చలమలశెట్టి తెలిపారు. ఏటా 10 లక్షల టన్నుల సామర్థ్యంతో 2026 ప్రథమార్ధం నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు. తొలుత అమ్మోనియా ప్లాంట్.. ఆ తర్వాత ఈ క్లస్టర్‌లోనే 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ రాబర్టో బోకా మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో అందుబాటులో ఉన్న పునరుత్పాదక వనరుల లభ్యత ద్వారా కాకినాడ క్లస్టర్ అడ్వాన్స్ గ్రీన్ అమ్మోనియా, హైడ్రోజన్ ఉత్పత్తి అధికంగా చేపట్టే అవకాశం ఉందని వివరించారు. మొత్తం రూ.1,26,500 కోట్ల విలువైన పర్యావరణహిత పెట్టుబడులు ఈ క్లస్టర్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. కాకినాడలోని నాగార్జున ఫెర్టిలైజర్ కర్మాగారాన్ని గత ఏడాది ఏఎం గ్రీన్ సంస్థ రూ.1,700 కోట్లకు కొనుగోలు చేసింది. ఇప్పుడు దీన్నే సాంకేతికంగా అభివృద్ధి చేసి గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి చేయనుంది.

రియల్టీలోకి ఈక్విటీ పెట్టుబడుల వెల్లువ

49 శాతం వృద్ధితో రూ.92,400 కోట్లు వస్తాయని అంచనా



న్యూఢిల్లీ: ఈ ఏడాది స్థిరాస్తి రంగంలోకి ఈక్విటీ పెట్టుబడులు వార్షిక ప్రాతిపదికన 49 శాతం వృద్ధితో 1,100 కోట్ల డాలర్లకు (రూ.92,400 కోట్లు) చేరుకోవచ్చని, తొలిసారిగా 1,000 కోట్ల డాలర్ల మైలురాయిని దాటనున్నాయని సీఐఐ-సీబీఆర్ఈ సంయుక్త నివేదిక అంచనా వేసింది. గృహ, వాణిజ్య సముదాయాలకు బలమైన డిమాండ్ నెలకొనడం ఇందుకు దోహదపడనుందని పేర్కొంది. 2023లో దేశీయ రియల్టీలోకి 740 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు వచ్చాయి. కాగా, ఈ ఏడాదిలో గడిచిన మూడు త్రైమాసికాల్లో (జనవరి-సెప్టెంబరు) వచ్చిన పెట్టుబడులు 46 శాతం పెరిగి 890 కోట్ల డాలర్లుగా (రూ.74,760 కోట్లు) నమోదయ్యాయి. అందులో దాదాపు 40 శాతం పెట్టుబడులు సంస్థాగత, కలెక్టివ్ వెహికిల్ ఇన్వెస్టర్లకు చెందినవే. కాగా, డెవలపర్ కంపెనీల ఈక్విటీ పెట్టుబడుల వాటా 41 శాతంగా ఉంది. మొదటి మూడు త్రైమాసికాల్లో వచ్చిన మొత్తం పెట్టుబడుల్లో 600 కోట్ల డాలర్లు లేదా 65 శాతం దేశీయ ఇన్వెస్టర్లకు (ముఖ్యంగా డెవలపర్లు) చెందినవేనని నివేదిక వెల్లడించింది. కాగా, విదేశీ ఇన్వెస్టర్లు 310 డాలర్ల మేర పెట్టుబడులు పెట్టారు. అందులోనూ ఉత్తర అమెరికా, సింగపూర్ ఇన్వెస్టర్ల వాటాయే 85 శాతంగా ఉంది. వేగంగా వృద్ధి చెందుతున్న భారత స్థిరాస్తి రంగంపై ఇన్వెస్టర్ల ఆసక్తి పెరుగుతున్నదనడానికిదే నిదర్శనమని సీబీఆర్ఈ ఇండియా చైర్మన్, సీఈఓ అన్షుమన్ మాగజైన్ అన్నారు.

జోరు తగ్గిన కార్పొరేట్ రంగం

నీరసించిన డిమాండ్.. నిరాశ పరిచిన క్యూ2 ఆర్థిక ఫలితాలు

- 'బేర్'మంటున్న స్టాక్ మార్కెట్
- మోతీలాల్ ఓస్వాల్



న్యూఢిల్లీ: భారత కార్పొరేట్ రంగం పరుగుకు బ్రేక్ పడింది. నిన్న మొన్నటి వరకు రేసుగుర్రంలా పరిగెత్తిన కార్పొరేట్ రంగం ఇపుడు నీరసిస్తోంది. సెప్టెంబరుతో ముగిసిన రెండో త్రైమాసిక ఆర్థిక ఫలితాలే ఇందుకు నిదర్శనం. ఇప్పటి వరకూ క్యూ2 ఆర్థిక ఫలితాలు ప్రకటించిన కంపెనీల్లో 44 శాతం కంపెనీల ఆదాయం, లాభాలు మార్కెట్ వర్గాలను నిరాశ పరిచాయి. 41 శాతం కంపెనీల ఫలితాలు మార్కెట్ అంచనాలను మించగా, 15 శాతం కంపెనీల ఆర్థిక ఫలితాలు మాత్రమే అంచనాలకు అనుగుణంగా వచ్చాయి. గత రెండేళ్లలో కార్పొరేట్ రంగం ఆదాయం, లాభాల వృద్ధిరేటుకు ఇలా బ్రేక్ పడడం ఇదే మొదటిసారని ప్రముఖ బ్రోకరేజి సంస్థ మోతీలాల్ ఓస్వాల్ ఒక నివేదికలో తెలిపింది. 2026 మార్చి వరకు ఈ రంగం పనితీరు ఇలానే ఉంటుందని పేర్కొంది. ఇందుకు దోహదపడుతున్న కారణాలు...

డిమాండ్ క్షీణత: ప్రస్తుతం గ్రామీణ డిమాండ్ బాగానే ఉంది. అయితే పట్టణ డిమాండ్ మాత్రం నీరసించింది. ఐటీసీ, హెచ్‌యూఎల్, నెస్లే, డాబర్ వంటి ప్రముఖ ఎఫ్ఎంసీజీ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాలే ఇందుకు చక్కటి ఉదాహరణ. ఎన్ని ఆఫర్లు, డిస్కౌంట్లు ప్రకటించినా వినియోగదారులను పెద్దగా ఆకర్షించలేకపోతున్నట్టు కంపెనీలు చెబుతున్నాయి. దీంతో 2024-26 వరకు కార్పొరేట్ ఆదాయాల వృద్ధిరేటు 12 నుంచి 14 శాతం మించక పోవచ్చని అంచనా.

ధరల సెగ: ధరల సెగ సైతం కంపెనీల ఆదాయాలు, లాభాలకు చిల్లు పెడుతోంది. ఖర్చులు ఎంత తగ్గించుకోవాలనుకున్నా, ఒక పరిమితికి మించి సాధ్యపడడం లేదు. చక్కెర, వంటనూనెల ధరలు కొద్దిగా తగ్గినా ఇతర ముడి పదార్థాల ధరల్లో వృద్ధి ఇంకా అలానే ఉంది. ఈ భారం తగ్గించుకునేందుకు ధరలు కొద్దిగా పెంచినా ఆ ప్రభావం డిమాండ్‌పై కనిపిస్తోంది.

అంతర్జాతీయ ఉద్రిక్తతలు: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయెల్-హిజ్‌బొల్లా పోరాటం ఇంకా రావణ కాష్టంలా రగులుతూనే ఉన్నాయి. దీంతో కార్పొరేట్ రంగం ఎగుమతులకు గండి పడి, వాటి ఎగుమతి ఆదాయాలు క్షీణించాయి. ముఖ్యంగా బియ్యం, గోధుమలు, చక్కెర వంటి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి కంపెనీల విషయంలో ఇది స్పష్టంగా కనిపిస్తోంది.

స్టాక్ మార్కెట్‌పై ప్రభావం: కార్పొరేట్ రంగం ఆదాయ, లాభాల వృద్ధిరేటు తగ్గడంతో ఎఫ్‌పీఐలు మూకుమ్మడిగా అమ్మకాలకు దిగాయి. దీంతో గత రెండు నెలల్లో దేశీయ స్టాక్ మార్కెట్, 10 శాతం కుంగిపోయింది. గత నెలన్నర రోజుల్లోనే భారత మార్కెట్ నుంచి ఈ సంస్థలు దాదాపు రూ.1.25 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. ఈ సంస్థల అమ్మకాలు ఇప్పట్లో తగ్గే సూచనలేవీ కనిపించడం లేదు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ మరో 10 శాతం నష్టపోయే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్ వినియోగం పుంజుకుంది: ఆర్‌బీఐ

ముంబై: దేశంలో కొంత కాలంగా స్తబ్ధంగా ఉన్న ప్రైవేట్ వినియోగం క్రమంగా గాడిన పడుతోంది. పండుగల సీజన్ పుణ్యమా అని వినియోగం పెరిగింది. వర్తమాన ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ఇది స్తబ్ధంగా ఉంది. ఆర్‌బీఐ తాజా నెలవారీ బులెటిన్‌లో ఈ విషయం వెల్లడించింది. మన దేశీయ డిమాండ్‌కు ప్రైవేటు వినియోగమే ప్రధాన చోదక శక్తి అని పేర్కొంది. మన ఆర్థిక మూలాల అంతర్గత శక్తి ఆధారంగా చూస్తే, మధ్యకాలికంగా మన ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ బాగానే ఉందని తెలిపింది. ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ మైఖేల్ దేబబ్రత పాత్ర నేతృత్వంలోని బృందం ఈ బులెటిన్‌ను సిద్ధం చేసింది.

ఈ త్రైమాసికం వృద్ధి 6.5 శాతం :ఇక్రా

దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా సెప్టెంబరు త్రైమాసికం వృద్ధి రేటును 6.5 శాతానికి కుదించింది. భారీ వర్షాలు, కార్పొరేట్ల బలహీన ఆర్థిక ఫలితాలు వృద్ధికి అవరోధంగా నిలిచాయని పేర్కొంది. అయితే 2025 ఆర్థిక సంవత్సరం వృద్ధిరేటు అంచనాను 7 శాతంగా యథాతథంగా కొనసాగించింది. ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఆర్థిక కార్యకలాపాలు పుంజుకుంటాయని తెలిపింది. రెండో త్రైమాసికం వృద్ధిరేటు గణాంకాలను ప్రభుత్వం ఈ నెల 30వ తేదీన ప్రకటించనుంది. మొదటి త్రైమాసికంలో 6.7 శాతం వృద్ధిరేటు నమోదయింది. సేవల రంగం మెరుగుదల ఏడాది మొత్తం మీద జీడీపీ వృద్ధికి ఊతం ఇవ్వవచ్చునని పేర్కొంది.

రేపటి నుంచి సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: రక్షణ రంగానికి చెందిన సీ2సీ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఐపీఓ శుక్రవారం ప్రారంభం కానుంది. షేరు ధరల శ్రేణిని కంపెనీ రూ.214-226గా నిర్ణయించింది.

- సీఐఈఎల్ హెచ్ఆర్ సర్వీసెస్ లిమిటెడ్ ఐపీఓ ద్వారా రూ.335 కోట్ల వరకు సమీకరించేందుకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది.
- జేఎస్‌డబ్ల్యూ సిమెంట్ రూ.4,000 కోట్ల ఐపీఓను వచ్చే ఏడాది జనవరిలో ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ తెలిపారు. అయితే, క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ ఈ సెప్టెంబరులో కంపెనీ ఐపీఓ దరఖాస్తును తాత్కాలికంగా పక్కన పెట్టింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,620 ▲	71,150 ▲	1,01,000 ▲
ముంబై	75,873 ▲	69,500 ▲	90,960 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	570
చిత్తూరు	593	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	103	విజయవాడ	113
వరంగల్	103	గుంటూరు	111
కరీంనగర్	103	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	103	చిత్తూరు	104
కర్నూలు	103	నెల్లూరు	104
విశాఖపట్నం	110	అనంతపురం	104
గోదావరి	113		

స్పోర్ట్స్

మనోళ్లే చాంపియన్లు

- ఫైనల్లో చైనాపై గెలుపు
- దీపిక మెరుపు గోల్
- మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ



రాజ్‌గిర్ (బిహార్): టోర్నమెంట్ ఆది నుంచి దూకుడైన ఆట..ఫలితంగా అప్రతిహత విజయాల బాట..దీంతో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్ టైటిల్ భారత మహిళల ఖాతాలో వచ్చిచేరింది. బుధవారం జరిగిన ఫైనల్లో సలీమా టెటె సారథ్యంలోని భారత్ ఏకైక గోల్‌తో ఒలింపిక్ రజత పతక విజేత చైనాను 1-0తో ఓడించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. యువ స్ట్రయికర్ దీపిక కళ్లు చెదిరే రివర్స్ హిట్ గోల్‌తో భారత్ విజయంలో కీలక భూమిక పోషించింది. 31వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను అద్భుత గోల్‌గా మలిచిన దీపిక..టోర్నమెంట్‌లో అత్యధిక గోల్స్ (11) చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. లీగ్ దశలో జరిగిన మ్యాచ్‌లోనూ మన మహిళలు 3-0తో చైనాను చిత్తు చేసిన విషయం తెలిసిందే. భారత్‌కిది మూడో చాంపియన్స్ ట్రోఫీ. గతంలో 2016, 2023లో మనమ్మాయిలు విజేతలుగా నిలిచారు. ఈ క్రమంలో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ చరిత్రలో అత్యధిక టైటిళ్లు నెగ్గిన జట్టుగా దక్షిణకొరియాతో భారత్ సమంగా నిలిచింది. మరో మ్యాచ్‌లో 4-1తో మలేసియాపై గెలుపొందిన జపాన్ మూడో స్థానం కైవసం చేసుకుంది. కాగా, విజేత భారత జట్టులోని ఒక్కో సభ్యురాలికి రూ. 10 లక్షల చొప్పున నజరానా ఇవ్వనున్నట్టు ఆతిథ్య రాష్ట్రం బిహార్ ప్రకటించింది.



దీపిక

హోరాహోరీ..

భారత్-చైనా తుదిపోరు ఆసాంతం నువ్వా..నేనా..అనేలా సాగింది. ఇరు జట్లు పలుమార్లు సర్కిల్ లోపలికి దూసుకెళ్లి గోల్స్ చేసేందుకు యత్నించాయి. కానీ ఆయా జట్ల రక్షణ శ్రేణులు ఆ అవకాశాలను వమ్ము చేశాయి. రెండో క్వార్టర్ మూడో నిమిషంలో చైనాకు పెనాల్టీ కార్నర్ లభించింది. కానీ భారత గోల్ కీపర్ బిచు దేవి ఖరిబమ్ అమోఘంగా డైవ్ చేసి జిన్‌జువాంగ్ షాట్‌ను అడ్డుకుంది. తదుపరి రెండు నిమిషాల్లో భారత్‌కు నాలుగు పెనాల్టీ కార్నర్లు దక్కినా..ఒక్కదానినీ సద్వినియోగం చేసుకోలేకపోయింది. 23వ నిమిషంలో చైనాకు ఇంకో పెనాల్టీ కార్నర్ లభించినా..భారత్ అడ్డుకుంది. మరోవైపు కెప్టెన్ సలీమా అందించిన పాస్‌ను షర్మిలా దేవి గోల్ పోస్ట్ ఆవలిగా కొట్టడంతో ఖాతా తెరిచే అవకాశాన్ని భారత్ చేజార్చుకుంది. అనంతరం చైనాపై పదేపదే ఒత్తిడి పెంచిన భారత క్రీడాకారిణులు..ఐదో పెనాల్టీ కార్నర్ దక్కించుకొన్నారు. ఈసారి దీపిక సూపర్ షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి జట్టును ఆధిక్యంలో నిలిపింది. 42వ నిమిషంలో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. కానీ దీపిక షాట్‌ను చైనా కీపర్ లి టింగ్ అడ్డుకుంది. ఆ వెంటనే సుశీల చాను షాట్‌నూ గోల్‌లోకి వెళ్లకుండా టింగ్ ఆపింది. తర్వాత గోల్ చేసేందుకు చైనా ప్రయత్నించినా భారత రక్షణశ్రేణి ముందు వారి ఆటలు సాగలేదు.

కెప్టెన్ సూర్యను దాటేసి..

తిలక్ @ 3

ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్




దుబాయ్: దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో శతకాల మోత మోగించిన తెలుగు కుర్రాడు తిలక్ వర్మ.. టీ20ల్లో టాప్-5లోకి దూసుకొచ్చాడు. బుధవారం తాజాగా విడుదల చేసిన ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో తిలక్ ఏకంగా 69 స్థానాలు ఎగబాకి కెరీర్‌లో అత్యుత్తమంగా 3వ ర్యాంక్‌ను సొంతం చేసుకొన్నాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఒక మెట్టు దిగి 4వ స్థానంలో నిలిచాడు. ట్రావిస్ హెడ్, ఫిల్ సాల్ట్ తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. కాగా, ఆల్‌రౌండర్ ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకొన్నాడు. రెండుస్థానాలు మెరుగుపర్చుకొన్న పాండ్యా నెం:1 ర్యాంక్‌ను దక్కించుకొన్నాడు. బౌలర్ల జాబితాలో అర్ష్‌దీప్ సింగ్ మూడు స్థానాలు ఎగబాకి తొమ్మిదో ర్యాంక్‌లో నిలవగా.. రవి బిష్ణోయ్ 8వ స్థానానికి పడిపోయాడు.

బాప్‌రే..కోహ్లీ బ్యాట్ ఖరీదు!

న్యూఢిల్లీ: క్రికెట్ అభిమానుల్లో విరాట్ కోహ్లీకి ఉన్న క్రేజే వేరు. అందుకు అతడి బ్యాట్‌కు ఉంచిన ధరే నిదర్శనం. బ్రిస్బేన్‌లోని గ్రెగ్ చాపెల్ క్రికెట్ సెంటర్‌లో విరాట్ ఆటోగ్రాఫ్‌తో ఉన్న బ్యాట్‌ను అమ్మకానికి ఉంచారు. అయితే, దీని ధర అక్షరాలా రూ. 1.65 లక్షలు. ఈ విషయాన్ని ఓ యూట్యూబర్ వెల్లడించాడు.

ఒలింపిక్స్ ఆతిథ్య రేసులో ఆగ్రా!

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ (2036) ఆతిథ్యానికి ఇప్పటికే ఆసక్తి వ్యక్తీకరణ బిడ్ దాఖలు చేసిన భారత్ అందుకోసం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. మరోవైపు ఒలింపిక్ ఆతిథ్య నగరంగా ఇప్పటికే అహ్మదాబాద్ రేసులో ముందు నిలిచింది. అలాగే ముంబై పేరు కూడా తెరపైకి వచ్చింది. అయితే తాజాగా ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)-ఆగ్రా ఆతిథ్య నగరంగా ఉండనుందనే వార్తలు బలంగా వినవస్తున్నాయి. ఇందుకు 4 కారణాలను ప్రధానంగా చూపుతున్నారు. 1. దేశంలోని పలు ప్రధాన పర్యాటక కేంద్రాలకు సమీపంలో ఉండడం. 2. ఢిల్లీ-ఆగ్రాల సమీపంలో నాలుగు విమానాశ్రయాలుండడం. 3. నిర్మాణానికి అవసరమైన భూమి అందుబాటులో ఉండడం. 4. ఆగ్రా నగరం బిడ్డింగ్ రేసుకు మరింత విలువ తెస్తుందని భావించడం.



నడాల్.. భావోద్వేగ వీడ్కోలు

డేవిస్‌కప్‌లో స్పెయిన్ ఓటమితో ముగిసిన కెరీర్

మలగ (స్పెయిన్): టెన్నిస్ దిగ్గజం రఫెల్ నడాల్ (38) సొంత ప్రేక్షకుల మధ్య సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. డేవిస్ కప్ క్వార్టర్స్‌లో స్పెయిన్ 1-2తో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. దీంతో నడాల్‌కు మరో మ్యాచ్ ఆడే అవకాశం దక్కలేదు. తొలి మ్యాచ్‌లో నడాల్ 4-6, 4-6తో బోటిక్ వాన్ డి జాండ్‌షల్ప్ చేతిలో పోరాడి ఓడాడు. డేవిస్ కప్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలుకుతానని రఫా ముందుగానే ప్రకటించాడు. జట్టు కూడా పరాజయంపాలు కావడంతో.. నడాల్ ప్రయాణం ముగిసింది. మ్యాచ్ తర్వాత జరిగిన సన్మాన కార్యక్రమంలో రఫా తీవ్ర భావోద్వేగానికి గురయ్యాడు. ఉబికి వస్తున్న కన్నీళ్లను ఆపుకొంటూ.. అభిమానులను ఉత్తేజపరిచే ప్రయత్నం చేశాడు. అతడు సాధించిన ఘనతలతోపాటు ప్రముఖుల శుభాకాంక్షలతో కూడిన వీడియోను ప్లే చేస్తున్నంత సేపు.. స్టేడియం మొత్తం 'రా..రా.. ఫా.. ఫా' అంటూ మార్మోగిపోయింది. కెరీర్‌లో నడాల్ 22 గ్రాండ్‌స్లామ్‌లు నెగ్గగా.. అందులో 14 ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లే కావడం విశేషం. మట్టికోర్టులో తనకు ఎదురులేదని నిరూపించాడు. కానీ, గాయాలు దెబ్బతీయడంతో పుంజుకోలేకపోయాడు.

సింధు, లక్ష్య ముందుకు..

ప్రీక్వార్టర్స్‌కు సాత్విక్, గాయత్రి జోడీలు

షెన్‌జెన్ (చైనా): స్టార్ షట్లర్లు పీవీ సింధు, లక్ష్య సేన్ చైనా మాస్టర్స్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో శుభారంభం చేశారు. బుధవారం జరిగిన ఆరంభ రౌండ్లో ప్రపంచ 19వ ర్యాంకర్ సింధు 21-17, 21-19తో థాయ్‌లాండ్‌కు చెందిన బుసానన్ ఓంగ్బారున్‌ఫాన్‌పై గెలుపొందింది. బుసానన్‌తో 21 మ్యాచుల్లో సింధుకిది 20వ గెలుపు కావడం విశేషం. ఇక మాళవిక బన్సోద్ 20-22, 23-21, 21-16తో హోజ్‌మార్క్ (డెన్మార్క్)కు షాకిచ్చి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. లక్ష్య 21-14, 13-21, 21-13తో పారిస్ ఏడో సీడ్ లీ జీ జియా (మలేసియా)ను కంగుతినిపించాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి జంట 12-21, 21-19, 21-19తో చైనీస్ తైపీ జోడీ లీ జీ/యాంగ్ సువాన్‌పై మహిళల డబుల్స్‌లో గాయత్రి/ట్రీసా ద్వయం 21-15, 21-14తో తైవాన్ జోడీ హూ లింగ్ ఫాంగ్/జెంగ్ యూపై నెగ్గి ప్రీక్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

పీఠం ఎవరిదో?

- నేడే తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికలు
- అధ్యక్ష బరిలో చాముండి, జితేందర్ రెడ్డి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఒలింపిక్ సంఘం (టీఓఏ) ఎన్నికల పోలింగ్‌కు రంగం సిద్ధమైంది. గురువారం ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం, అనంతరం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అధ్యక్ష స్థానానికి రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు వి.చాముండేశ్వరనాథ్, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి పోటీపడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి సైక్లింగ్ సంఘం అధ్యక్షుడు పి.మల్లారెడ్డి, బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు సీహెచ్.బాబూరావు, కోశాధికారి పదవికి సతీష్, ప్రదీప్ బరిలో ఉన్నారు. 4 ఉపాధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు, 15 మంది ఈసీ సభ్యుల పదవులకు ఒక్కొక్క నామినేషనే దాఖలవడంతో వీరి ఎన్నిక లాంఛనం కానుంది. అయితే ఎన్నికల నోటిఫికేషన్‌పై తెలంగాణ బాక్సింగ్ సంఘం హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించడంతో పోలింగ్ పూర్తయ్యాక ఫలితాలు ప్రకటించకుండా న్యాయస్థానం మధ్యంతర స్టే ఉత్తర్వులను ఇచ్చింది. ఇక, తెలంగాణ ఒలింపిక్ సంఘం ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం పేరిట చలామణి అవుతున్న నకిలీ ఈ-మెయిళ్లను నమ్మవద్దని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి, జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కోరాడు.



నితీశ్ టెస్ట్ అరంగేట్రం ఖాయం?

తుది జట్టులో ఉండాలంటున్న రవిశాస్త్రి, గంగూలీ

పెర్త్: టీ20లలో అందివచ్చిన అవకాశాలను అద్భుతంగా వినియోగించుకొని భారత జట్టులో స్థానం సుస్థిరం చేసుకున్న తెలుగు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి..టెస్ట్‌ల్లోనూ అరంగేట్రం చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఆసీస్‌తో పెర్త్ టెస్ట్‌కు భారత జట్టు కూర్పులో బౌలింగ్ ఆల్‌రౌండర్ ఉండడం ఖాయమే. పైగా..పెర్త్ వికెట్ బౌన్స్‌కు అనుకూలిస్తుంది. ఈనేపథ్యంలో పేస్ బౌలర్ నితీశ్‌కు తుది 11 మందిలో చోటు లభించే అవకాశాలు మెరుగయ్యాయి. ఇంకా..బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ మాటలను బట్టిచూస్తే నితీశ్‌కు స్థానం ఖాయమేనని తెలుస్తుంది. ఇక..భారత జట్టు మాజీ కోచ్ రవిశాస్త్రి, మాజీ కెప్టెన్ గంగూలీ కూడా తుది జట్టులో నితీశ్ ఉండాల్సిందేననడం విశేషం. నాలుగో బౌలర్‌గా, బ్యాటర్‌గా అతడు జట్టుకు ఎంతో సమతూకం తెస్తాడని వారు అభిప్రాయపడ్డారు. కాగా..గిల్ విషయమై మ్యాచ్‌రోజు ఉదయం నిర్ణయం తీసుకుంటామని మోర్కెల్ చెప్పాడు. ఎడమచేతి బొటన వేలి గాయం నుంచి గిల్ కోలుకుంటున్నాడని అన్నాడు.

ఖలీల్ స్థానంలో యశ్ దయాళ్: భారత రిజర్వ్ పేసర్ల జాబితాలో ఎడమ చేతి వాటం బౌలర్ యశ్ దయాళ్‌ను చేర్చారు. రిజర్వ్ పేసర్‌గా ఉన్న ఖలీల్ అహ్మద్ గాయపడడంతో అతడిని స్వదేశం పంపనున్నారు.



యశ్ దయాళ్

స్థానిక ఎన్నికల్లో సేవాదళ్ కార్యకర్తలకు కోటా!

- పార్టీ ప్రధాన విభాగాలతో సమానంగా గుర్తింపు
- సేవాదళ్ శతాబ్ది ఉత్సవ సభలో మహేష్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సేవాదళ్ నేతలు, కార్యకర్తలకు ఆయా స్థాయిల్లో కోటా ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. పార్టీ ప్రధాన విభాగాల(ఫ్రంటల్ ఆర్గనైజేషన్లు)తో సమానంగా గుర్తింపునూ ఇస్తామన్నారు. అఖిల భారత కాంగ్రెస్ సేవాదళ్ ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా గాంధీభవన్‌లో సేవాదళ్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు జితేందర్ ఆధ్వర్యంలో సేవాదళ్ శతాబ్ది ఉత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కార్యకర్తల కృషి ఫలితంగానే ఏర్పడిందని, వారి కష్టానికి తప్పకుండా ప్రతిఫలం ఉంటుందని స్పష్టం చేశారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో చేసిందన్నారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలన్న లక్ష్యంతో పని చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ కరోనా సమయంలో సేవాదళ్ అద్భుతమైన పనితీరు చూపిందని, దాన్ని గుర్తించిన సోనియాగాంధీ.. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ టిక్కెట్లను ఇచ్చారన్నారు. సేవాదళ్ జాతీయ అధ్యక్షుడు లాల్‌జీ దేశాయ్ మాట్లాడుతూ మోదీ, అమిత్‌షాలు దేశానికి పట్టిన శని అని, గుజరాతీలు దేశాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు మాట్లాడుతూ సేవాదళ్.. గ్రామస్థాయిలోనూ కష్టాల్లో ఉన్నవారికి సేవ చేయాలని సూచించారు. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ సేవాదళ్ వందేళ్ల ఉత్సవాన్ని జరుపుకొంటున్నందుకు ఒక సేవాదళ్ కార్యకర్తగా తాను గర్వపడుతున్నానన్నారు.

తెలంగాణ కాలకేయుడిలా మారిన రేవంత్

- కేసీఆర్ మొక్క కాదు.. మహావృక్షం: బీఆర్‌ఎస్ నేతలు
- ధర్నా అంటే ధైర్యం సరిపోవడం లేదా రేవంత్?: కేటీఆర్



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు రేవంత్‌రెడ్డి కాలకేయుడిలా మారారని, బాహుబలి లాంటి కేసీఆర్ చేతిలో రేవంత్ రాజకీయ జీవితం పరిసమాప్తం కావడం ఖాయమని బీఆర్‌ఎస్ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతలు పొన్నాల లక్ష్మయ్య, జోగురామన్న తదితరులు మీడియాతో మాట్లాడారు. ప్రాణాలకు తెగించి పోరాడి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ మొక్క కాదు.. మహావృక్షమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం టీఆర్‌ఎస్‌తోనే మొదలైందని, అప్పుడు కేసీఆర్‌ను పొగుడుతూ ప్రకటనలు చేసిన రేవంత్ ఇప్పుడు నోటికొచ్చినట్లు తిట్టడం సరికాదన్నారు. కాగా, బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామంటే సీఎం రేవంత్‌రెడ్డికి ధైర్యం సరిపోవడం లేదా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం ఎక్స్‌వేదికగా ప్రశ్నించారు. మహబూబాబాద్‌లో మహాధర్నాకు ఎందుకు అనుమతి ఇవ్వడం లేదు? చిట్టినాయుడూ అంటూ కేటీఆర్ నిలదీశారు.

అట్రాసిటీ కేసుల్లో స్టేషన్ బెయిల్ సరికాదు

- తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

న్యూఢిల్లీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేస్తున్నారని, ఇది సరికాదని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బెయిల్ ఇచ్చే అధికారం న్యాయస్థానాలకు మాత్రమే ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం స్టేషన్ బెయిల్ ఇవ్వడం వల్ల ఎస్సీ, ఎస్టీ చట్టం నీరుగారుతోందంటూ సీఎం రేవంత్, డీజీపీలకు లేఖలు రాసినట్టు గుర్తు చేశారు. అయితే ఇది కేంద్ర ప్రభుత్వం దృష్టికి వెళ్లాల్సిన అంశమని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండటంతో కేంద్ర న్యాయ శాఖ మంత్రిని కలిశామని చెప్పారు. లగచర్ల ఘటనపై ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు ఇచ్చామని, నివేదిక రావాల్సి ఉందన్నారు. 25న లగచర్ల గ్రామాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడుతామని తెలిపారు.

బీఆర్‌ఎస్ పాలనలో విద్యుత్ సంస్థలు దివాలా

- టీజీఎస్పీడీసీఎల్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రామకృష్ణ

హైదరాబాద్ సిటీ, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్‌సంస్థలు దివాలా తీశాయని, వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయి సతమతమవుతున్నాయని టీజీఎస్పీడీసీఎల్ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ఆళ్ల రామకృష్ణ ఆరోపించారు. ఉద్యోగులకు 1వ తేదీన జీతాలివ్వలేని పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకొచ్చిన ఘనత గత పాలకులదేనన్నారు. హైదరాబాద్‌లోని ఓటమి షాక్‌తో కేటీఆర్.. ప్రభుత్వం, విద్యుత్‌సంస్థలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో అక్రమ విద్యుత్ కొనుగోళ్లు, అక్రమ అనుమతులపై జస్టిస్ లోకూర్ కమిషన్ నివేదిక ఆధారంగా బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేవంత్.. నీవో గంజాయి మొక్కవి

- నీ పార్టీ వాళ్లే నిన్ను పీకి పారేస్తారు: ఎర్రబెల్లి

వరంగల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): "తెలంగాణలో నీవో గంజాయి మొక్కవు. నీ పార్టీ వాళ్లే నిన్ను పీకి పారేస్తారు. నీ పార్టీలో వారే నిన్ను లెక్కచేయడం లేదు. 30 సార్లు ఢిల్లీకి వెళ్లినవ్. రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలే నీకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదు. అలాంటి నువ్వు కేసీఆర్‌ను మళ్లీ మొలకెత్తనివ్వనంటావా?.. సరే చూద్దాం" అంటూ బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తారు. హనుమకొండలో ఆయన మాట్లాడారు. వరంగల్ సభలో రేవంత్‌రెడ్డి తన స్థాయిని మరిచి కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. మంత్రులు, ఎమ్మెల్యేలే ఆయన మాట వినడం లేదన్నారు. ఏడాదికాలంగా మంత్రివర్గ విస్తరణ కూడా చేయలేని అసమర్థుడు రేవంత్ అని విమర్శించారు. కేసీఆర్ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నారని, ఆయన్ను ప్రజల నుంచి దూరం చేయడం వంద మంది రేవంత్ రెడ్డిలు వచ్చినా సాధ్యం కాదని ఆయన అన్నారు.

గజ..గజ..

- కోహీర్‌లో 9 డిగ్రీలకు పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): తెలంగాణలో రోజు రోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు మరింత తగ్గాయి. సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో రాష్ట్రంలోనే కనిష్ఠ ఉష్ణోగ్రత 9.0గా నమోదైంది. గత వారం రోజులుగా రాత్రి పూట ఉష్ణోగ్రతలు క్రమేపీ పడిపోతుండగా రాగల మూడు రోజుల పాటు చలి తీవ్రత మరింత ఉండనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్ర అధికారులు తెలిపారు. అటు చలిగాలులకు హైదరాబాద్ ప్రజలు వణికిపోతున్నారు. తెల్లవారుజామున పొగమంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ముందుకు వెళ్లడం కష్టంగా మారింది. ముఖ్యంగా కాలుష్యం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతున్నాయి. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గరిష్ఠం- 29.2, కనిష్ఠ 15.1డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పటాన్‌చెరులో అత్యల్పంగా 12.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వగా రాజేంద్రనగర్‌లో 13 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 14.6, బేగంపేటలో 15.1, దుండిగల్, హకీంపేట ప్రాంతాల్లో 15.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు(యు) మండలంలో 9.7డిగ్రీల ఉష్ణోగ్రత, మంచిర్యాల జిల్లాలో 12.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో చలితీవ్రతను తట్టుకునేందుకు గ్రామాల్లోని ప్రజలు చలిమంటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. చలి తీవ్రతకు సంబంధించి రాగల 3 రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. 33 జిల్లాకు గాను ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

మంగళవారం రాత్రి నమోదైన ఉష్ణోగ్రతలు

జిల్లా	మండలం	కనిష్ఠ ఉష్ణోగ్రతలు
సంగారెడ్డి	కోహీర్	9
ఆసిఫాబాద్	సిర్పూర్	9.7
వికారాబాద్	మర్పల్లి	10.6
రంగారెడ్డి	షాబాద్	11
సిద్దిపేట	మర్కుక్	11.1

జ్వరం తగ్గి

2 నెలలైనా తగ్గని నొప్పులు

ముందెన్నడూ లేని విధంగా విషజ్వరాలు.. దోమల స్వైరవిహారం.. పెరుగుతున్న తీవ్రత

- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు
- రోజుకు ఓపీలో వారి సగటే 30-40%
- పెరుగుతున్న డెంగీ, చికున్‌గున్యా
- తెలంగాణకు అమెరికా ట్రావెల్ అలెర్ట్



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైరల్ జ్వరాలు దడపుట్టిస్తున్నాయి. ప్లేట్‌లెట్లు తగ్గిపోవడం, వాంతులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, నీరసంతోపాటు.. 103 డిగ్రీలతో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న జ్వరాలు రెండు మూడు రోజులకే తగ్గిపోతున్నా.. అనంతర పరిణామాలు తీవ్రంగా ఉంటున్నాయి. జ్వరం తగ్గిన తర్వాత ఒంటినొప్పులు ఊపిరి సలపనివ్వడం లేదు. దీంతో బాధితు లు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. రోజువారీ ఔట్‌పేషెంట్ కేసుల్లో జ్వరానంతర సమస్యలే 30-40% వరకు ఉంటున్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బాధితుల్లో వైరల్ జ్వరాల నుంచి బయటపడ్డామనే ఆనందం కంటే.. పోస్ట్‌వైరల్ లక్షణాలతో ఆందోళనలు పెరుగుతున్నాయని వైద్యవర్గాలు చెబుతున్నాయి.

పెరుగుతున్న మలేరియా, డెంగీ, గున్యా

ఈ ఏడాది రాష్ట్రంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా కేసులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. విస్తృతంగా వర్షాలు కురవడం, వాతావరణ మార్పులు, దోమల స్వైరవిహారం వంటివి ఇందుకు కారణాలుగా వివరిస్తున్నారు. అధికారిక లెక్కల ప్రకారం ఈ ఏడాది 9,450 డెంగీ కేసులు, 194 చికున్‌గున్యా కేసులు నమోదయ్యాయి. అనధికారిక అంచనాల ప్రకారం.. వీటి సంఖ్య 30 వేలు(20% పెరుగుదల), 15 వేలుగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. గత నాలుగేళ్లలో ఈ స్థాయిలో డెంగీ, చికున్‌గున్యా కేసులు లేవని చెబుతున్నారు. సాధారణంగా డెంగీ, విషజ్వరాలు జూన్‌లో మొదలై.. ఆగస్టులో పతాకస్థాయికి, సెప్టెంబరులో తారస్థాయికి చేరుకుంటాయి. అక్టోబరు తొలి వారం నుంచి తగ్గుముఖం పడతాయి. కానీ, ఈ ఏడాది మాత్రం జ్వరాలు తగ్గినట్లే తగ్గి.. మళ్లీ విజృంభిస్తున్నాయి. మొదట్లో విషజ్వరాలు..ఆ తర్వాత డెంగీ, చికున్‌గున్యా, ప్రస్తుతం వీటితోపాటు, వైరల్ దగ్గు వంటి సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తగ్గని నొప్పులు.. బాధితుల తంటాలు

ఈ ఏడాది మిశ్రమ జ్వరాల(మిక్స్‌డ్ వైరల్ ఫీవర్స్)తో పరిస్థితులు దారుణంగా మారుతున్నాయని వైద్యనిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విషజ్వరాలు, డెంగీతో మరణాలు కూడా సంభవించాయని గుర్తుచేస్తున్నారు. అన్ని జిల్లాల్లోనూ విషజ్వరాలు, డెంగీ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్, గ్యాస్ట్రో ఎంటెరిటీస్ కేసులు రికార్డు స్థాయిలో నమోదవుతున్నట్లు అధికారిక గణాంకాలు వివరిస్తున్నాయి. వీటికి తోడు.. దగ్గు, జలుబు, ఫ్లూ వంటివి ప్రజలను పీడిస్తున్నాయని పేర్కొంటున్నారు. జ్వరాలతో యుక్తవయస్కుల్లో కూడా రోగనిరోధక శక్తి తగ్గి.. ఇతర అనారోగ్య సమస్యల బారినపడుతున్నారని చెబుతున్నారు. అయితే.. చికున్‌గున్యా, డెంగీల తీవ్రత శరీరతత్వాన్ని బట్టి.. కొందరిలో 4 వారాలకు పరిమితమవ్వగా.. మరి కొందరిలో 8 వారాలు అయినా.. ఒంటినొప్పులు, కీళ్ల నొప్పులు తగ్గడం లేదంటున్నారు. "తీవ్రత ఎంతలా ఉందంటే.. నొప్పులతో బాధితులు ఉదయాన్నే మూత్ర విసర్జనకు కూడా వెళ్లలేనంతగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మధుమేహం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక వ్యాధులున్నవారు, వృద్ధుల్లో జ్వరానంతర ఒంటి నొప్పులు తీవ్రంగా ఉంటున్నాయి" అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

జ్వరానంతర సమస్యల విషయంలో వైద్యులు పలు సూచనలు చేశారు. జ్వరం తగ్గాక వెంటనే బయటకు వెళ్లకుండా.. తగినంత విశ్రాంతి తీసుకోవాలంటున్నారు. పూర్తిగా కోలుకునేవరకు అధిక శ్రమ జోలికి వెళ్లొద్దని సూచిస్తున్నారు. మరిన్ని సూచనలు..

- డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. తగినంత నీళ్లు తాగాలి. కొబ్బరినీళ్లు తీసుకోవచ్చు
- తాజా పండ్లు, కూరగాయలు, తృణ ధాన్యాలు, ప్రొటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి
- ధూమపానానికి దూరంగా ఉండాలి
- నొప్పులు ఎక్కువగా ఉంటే.. పారాసిటమాల్ వేసుకోవాలే తప్ప.. పెయిన్ కిల్లర్ల జోలికి వెళ్లకూడదు
- శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులున్నా.. 103 డిగ్రీలకు మించి జ్వరం, తీవ్రమైన తలనొప్పి, వాంతులు, డీహైడ్రేషన్ ఉంటే.. వెంటనే ఆస్పత్రికి వెళ్లాలి

15 ఏళ్ల తర్వాత.. అమెరికా ట్రావెల్ అలెర్ట్

తెలంగాణకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలంటూ అమెరికా తమ దేశ పౌరులను అప్రమత్తం చేసింది. ఈ మేరకు అమెరికా అంటువ్యాధుల నియంత్రణ కేంద్రం(సీడీసీ) ట్రావెల్ అడ్వయిజరీ చేసింది. 2009లో తెలంగాణ ఉద్యమం పతాకస్థాయిలో ఉన్నప్పుడు అమెరికా ట్రావెల్ అలెర్ట్ జారీ చేసిన విషయం తెలిసిందే.! అప్పట్లో హైదరాబాద్.. ముఖ్యంగా పంజాగుట్ట ప్రాంతాలకు వెళ్లొద్దని తమ పౌరులను అప్రమత్తం చేసింది. మళ్లీ 15 ఏళ్ల తర్వాత ఇప్పుడు చికున్‌గున్యా విజృంభిస్తోందని, పౌరులు తెలంగాణకు వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించింది. తెలంగాణ నుంచి అమెరికాకు వచ్చిన వారిలో చికున్‌గున్యా నిర్ధారణ అయినట్లు వివరించింది. ఈ నేపథ్యంలో అమెరికాకు వచ్చే వారు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. కాగా.. ఆగస్టు నెలలో మహారాష్ట్రలో జికా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కూడా అమెరికా ఆ రాష్ట్రానికి వెళ్లే పౌరులకు ట్రావెల్ అడ్వయిజరీ జారీ చేసింది.

కూర్చున్నాక.. లేవలేని పరిస్థితి



జ్వరానంతర సమస్యలతో ఆస్పత్రులకు వస్తున్నవారి సంఖ్య ఈ మధ్యకాలంలో బాగా పెరిగింది. విషజ్వరాల నుంచి కోలుకున్నా.. రోగనిరోధక శక్తి లేక.. బాగా నీరసంతో బాధితులు ఆస్పత్రులకు వస్తున్నారు. ఆయాసం, నడుంనొప్పి, మోకాళ్ల నొప్పులతో కనీసం మెట్లు ఎక్కలేకపోవడం, కుర్చీల్లో కూర్చున్నవారు లేవలేకపోవడం, భుజాల కదలికలు తగ్గిపోవడం, కండరాల నొప్పులు వంటి లక్షణాలు వారిలో కనిపిస్తున్నాయి. విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా వ్యాప్తి పెరుగుతోంది, జ్వరం తగ్గినా.. నొప్పులు మాత్రం 4-8 వారాల వరకు కొనసాగుతున్నాయి.

- డాక్టర్ వినయ్‌కుమార్, ఎంఎస్ ఆర్థోపెడిక్స్, వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి

అవయవాలు దెబ్బతింటున్న కేసులొస్తున్నాయి



జ్వరానంతర సమస్యల్లో.. కొందరిలో కీళ్లనొప్పులు, ఒంటినొప్పులు, నీరసం వంటి లక్షణాలు 2-3 నెలల వరకు ఉంటున్నాయి. కొన్ని కేసుల్లో కాలేయం, మూత్రపిండాలు దెబ్బతిన్నట్లు గుర్తించాం. న్యూమోనియా వంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయి. కొందరైతే.. నెలరోజుల వరకు కూడా పనులు చేయలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారంతోపాటు.. డి, సి-విటమిన్లు ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలను తీసుకోవాలి.

- డాక్టర్ ఎం.స్వప్న, ఎండీ(జనరల్ మెడిసిన్), గాంధీ ఆస్పత్రి

నేటి నుంచి లోక్‌మంథన్

- అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవానికి వేదిక కానున్న భాగ్యనగరం
- 4 రోజులు జరగనున్న కార్యక్రమం
- హాజరుకానున్న రాష్ట్రపతి, పలు రాష్ట్రాల గవర్నర్లు



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవానికి భాగ్యనగర్ వేదిక కానుంది. భారత సాంస్కృతిక వైభవాన్ని చాటి చెప్పేందుకు సిద్ధమైంది. సాంస్కృతిక ఏకత్వాన్ని చాటి చెప్పే అంతర్జాతీయ సాంస్కృతిక మహోత్సవం (లోక్ మంథన్) గురువారం నుంచి అంగరంగ వైభవంగా సాగనుంది. శిల్పారామంలో గురువారం నుంచి 24 వరకు నాలుగు రోజుల పాటు వేడుక కోసం ఏర్పాట్లు పూర్తయ్యాయి. లోక్ మంథన్ అంటే జానపద మేళా అని అర్థం. 2016లో మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో లోకమంథన్‌ను వైభవంగా నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి ఒక్కో రాష్ట్రంలో నిర్వహిస్తూ వస్తోంది. ఆ రకంగా ఇది నాలుగో లోక్‌మంథన్. దక్షిణ భారతదేశంలో మొట్టమొదటిసారి హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, పలురాష్ట్రాల గవర్నర్లు, ఆచార్య మిథిలేశ్, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ సహా వివిధ రంగాల ప్రముఖులు హాజరు కానున్నారు. కేంద్ర మంత్రి, లోక్‌మంథన్ ఆహ్వాన కమిటీ గౌరవ అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారు. దేశంలోని జానపద కళాకారులు అందరినీ ఒకేచోటుకు చేర్చి, వారి ప్రతిభాపాటవాలు నైపుణ్యాన్ని ప్రదర్శించే వేదికను ప్రజ్ఞా ప్రవాహ్ అనే సంస్థ ఏర్పాటు చేసింది. దేశంలోని మారుమూల ప్రాంతం నుంచి మొదలుకొని విదేశాల నుంచి సైతం ప్రతినిధులు జానపద కళాకారులు హాజరుకానున్నారని నిర్వాహకులు వెల్లడించారు. లోక్‌మంథన్ వేడుకలో గిరిజనుల చేతివృత్తుల కళారూపాలు, కళాప్రదర్శనలు ఉంటాయి. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసే స్టాళ్లలో పలు ఉత్పత్తుల ప్రదర్శనతో పాటు, ప్రజలకు సైతం తమ నైపుణ్యాన్ని ప్రదర్శించే కార్యక్రమం ఉంటుంది. వందకు పైగా సాంస్కృతిక కార్యక్రమాలు, దాదాపు 1500 మందికి పైగా కళాకారులతో సంప్రదాయ సంగీత వాయిద్యాలు, పనిముట్ల ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కాగా గురు, శుక్రవారాల్లో రాష్ట్రపతి ముర్ము హైదరాబాద్‌లో పర్యటిస్తారు. గురువారం ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకుంటారు. ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కోటి దీపోత్సవంలో పాల్గొంటారు. రాత్రి 7:10కి రాజ్‌భవన్‌కు చేరుకొని అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం లోక్‌మంథన్‌లో పాల్గొని మధ్యాహ్నం 12:05 గంటలకు ఢిల్లీ బయలుదేరివెళతారు.

కాంగ్రెస్‌వి ప్రజా వంచన ఉత్సవాలు

- రేవంత్ రెడ్డి ఓ అసమర్థ ముఖ్యమంత్రి
- ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు: ఏలేటి
- రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు: రాణి రుద్రమ



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అన్ని విధాలుగా మోసం చేసిందని, కాంగ్రెస్ చేసుకునేవి ప్రజాపాలన విజయోత్సవాలు కాదని.. ప్రజా వంచన ఉత్సవాలంటూ బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, ప్రజలకు చెప్పుకునేది ఏమీ లేకే విజయోత్సవ సభలో రేవంత్ రెడ్డి ప్రతిపక్షాలపై దాడి చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒక అసమర్థుడు సీఎం అయితే రాష్ట్రం ఏ రకంగా దివాలా తీస్తుందో, పాలన ఎలా అస్తవ్యస్తంగా మారుతుందో అనే వాటికి రేవంత్ రెడ్డే ఉదాహరణ అన్నారు. కాంగ్రెస్ 11 నెలల పాలనలో ప్రజలు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను ఎగ్గొట్టి ఎగవేతల సీఎంగా రేవంత్ గుర్తింపుపొందారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించలేని అసమర్థ సీఎం అని పేర్కొన్నారు. సీఎం పదవి ఎప్పుడు ఊడుతుందో తెలియకే సోనియా కాళ్లు కడిగి నీళ్లు నెత్తిన పోసుకుంటానని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు సోనియాను బలిదేవత అని సంబోధించిన రేవంత్, ఇవాళ తన పదవిని కాపాడుకునేందుకు దిగజారి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారని విమర్శించారు. రేవంత్ సొంత నియోజకవర్గంలో ఫార్మాసిటీ పేరుతో గిరిజనుల భూములు గుంజుకోవడానికి చేస్తున్న అరాచకాలు చూసి ప్రజలు అసహించుకుంటున్నారన్నారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అపజయోత్సవాలు చేసుకోవాల్సింది పోయి, విజయోత్సవాలు చేసుకుంటుందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో వరంగల్ ఆర్ట్స్ కళాశాల మైదానంలో రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ చేసిన ప్రకటనను అమలు చేయకుండా మళ్లీ ఇప్పుడు అదే చోటు నుంచి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. 64 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి 22 లక్షల మందికే మాఫీ చేశారని విమర్శించారు. కాగా తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు జరుగుతున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి రాణిరుద్రమ అన్నారు. అడ్డెడు ప్యాలాలు బుక్కిన ఆకలి తీరదన్నట్టు అడ్డమైన తిట్లు తిట్టినంత మాత్రాన పరిపాలన చేసినట్టు కాదు అనే సామెత సీఎం రేవంత్ రెడ్డికి సరిగ్గా సరిపోతుందన్నారు. కాగా రాష్ట్రంలో జరుగుతున్న కులగణను పారదర్శకంగా నిర్వహించి, ఆ వివరాలను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనందగౌడ్ అన్నారు. డెడికేటెడ్ బీసీ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లును బుధవారం కలిశారు. కులగణన సర్వేపై బీజేపీ ఓబీసీ మోర్చా అభిప్రాయాలను కమిషన్‌కు వివరించారు.

రేవంత్‌కు కేసీఆర్ భయం

వరంగల్ సభలో 50 సార్లు మాజీ సీఎం ప్రస్తావన.. రాష్ట్రంలో బీ.ఆర్.యూ ట్యాక్స్


- ప్రతి బిల్లుపై 8 నుంచి 10% వసూళ్లు
- పాలమూరు పర్యటనలో హరీశ్ రావు



మహబూబ్‌నగర్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుందని, అందుకే వరంగల్ సభలో మాజీ సీఎం పేరును 50 సార్లు ప్రస్తావించారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాష్ట్రంలో బీ.ఆర్.యూ(బ్రూ) ట్యాక్స్ అమలవుతోందని, ప్రతీ బిల్లుకు 8 నుంచి 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో ఇల్లు నిర్మాణం చేపడితే ఆర్ ట్యాక్స్ పేరిట వసూళ్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం పాల్గొన్న హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు. కురుమూర్తి స్వామి మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టులోపు రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇప్పటికీ సగం మంది రైతులకు మాఫీ చేయలేదన్నారు. పాలకుడు చేసిన పాపం ప్రజలకు చుట్టుకోకూడదని ఆయన ఒట్టు వేసిన దేవాలయాల్లో తాము పూజలు చేస్తున్నామని వివరించారు. మోసం చేయడం, మాట తప్పడం, అబద్ధాలాడటం రేవంత్ డీఎన్‌ఏలోనే ఉందని విమర్శించారు. వరంగల్ సభలో 45 నిమిషాలు ప్రసంగించిన ముఖ్యమంత్రి.. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన తొమ్మిది హామీలను ప్రస్తావించకుండా 50 సార్లు కేసీఆర్ పేరు యాదికి చేసుకున్నారని అన్నారు. ఎన్నో త్యాగాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పేరును కనుమరుగు చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. రేవంత్ పొందిన పీసీసీ, సీఎం పదవులు కేసీఆర్ భిక్షేనని అన్నారు. అయితే ఒట్లు లేకపోతే తిట్లు అన్నచందంగా రేవంత్ రెడ్డి పాలన తయారైందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా, పంటలకు బోనస్, రుణమాఫీ, కూలీలు, కౌలు రైతులకు సాయం ఇలా ఏ హామీ అమలు కాలేదని గుర్తు చేశారు. పాలమూరుకు ఉన్న మంచి పేరును సీఎం రేవంత్ చెడగొడుతున్నారని దుయ్యబట్టారు. రైతు బంధు, కేసీఆర్ కిట్, న్యూట్రీషన్ కిట్, బీసీ బంధు, దళిత బంధు, గొర్రెపిల్లలు, చేపపిల్లల పంపిణీ కార్యక్రమాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మెడలు వంచి ఆరు గ్యారంటీలను అమలు చేయిస్తామని స్పష్టం చేశారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ పీఆర్‌ఎల్‌ఐ ప్రాజెక్టును పడావు పెట్టారని, ఈ ఏడు వరదలు వచ్చినా నీరంతా సముద్రం పాలైందని హరీశ్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రూ.2500 ఇవ్వలేకపోయిన రేవంత్ రెడ్డి.. మహారాష్ట్ర పోయి అక్కడి మహిళలకు రూ.3వేలు ఇస్తామని అనడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కలుపు మొక్క కాదని, కల్పవృక్షమని, ప్రతిపక్షాలపై పగ సాధిస్తూ రేవంత్ ప్రజలను దగా చేస్తున్నారని తెలిపారు. శబ్దం ఎక్కువ, విషయం తక్కువలా పరిస్థితి తయారైందని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు జరగడం లేదని, పత్తికి మద్దతు ధర లభించడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో మద్యం అమ్మకాలు సరిగ్గా లేవని ఎక్సైజ్ శాఖ అధికారులకు నోటీసులిచ్చారని, ప్రజలతో మద్యం తాగించడమే పరిపాలనా? అని ప్రశ్నించారు. రూ.లక్ష కోట్లతో విద్యుత్ వ్యవస్థను కేసీఆర్ బాగుచేస్తే 11 నెలల్లో ఒక్క ట్రాన్స్‌కోకే నలుగురు సీఎండీలను మార్చారని విమర్శించారు.

లగచర్ల ఘటన కేటీఆర్ కుట్ర

- రైతుల అభిప్రాయం తెలుసుకునేందుకు కలెక్టర్, అధికార బృందం వెళ్లింది..
- భూములు లాక్కోవడానికి మాత్రం కాదు..
- ప్రజాభీష్టం మేరకే భూ సేకరణ..
- రైతులు వద్దంటే కారిడార్ వద్దు..
- నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి



లగచర్లలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి తదితరులు

వికారాబాద్ (ఆంధ్రజ్యోతి), కొడంగల్/బొంరాస్‌పేట్, నవంబరు 20: లగచర్ల ఘటన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుట్ర అని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి ఆరోపించారు. గిరిజనులను ఢిల్లీకి తీసుకుపోయి దొంగనే.. దొంగా దొంగా అన్నట్లుగా బీఆర్‌ఎస్ పార్టీ తీరు ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ సభ్యులు మల్లు రవి, వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ట్రైకార్ కమిషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కలిసి లగచర్ల ఘటనకు దారితీసిన పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ.. లగచర్లలో రైతుల అభిప్రాయం తెలుసుకునేందుకు కలెక్టర్, అధికార బృందం వెళ్లిందే తప్ప భూములు లాక్కోవడానికి మాత్రం కాదన్నారు. లగచర్లలో అధికారులపై దాడి చాలా దురదృష్టకరమని తెలిపారు. భూసేకరణ ప్రక్రియ పై చర్చ ప్రారంభం కాకుండానే పథకం ప్రకారం కలెక్టర్, అధికార బృందంపై దాడి చేశారన్నారు. అరెస్టులు.. యాక్షన్‌కు రియాక్షన్ అన్నారు. ఘటన వెనుక కొందరు ఉండి నడిపించారని.. సురేష్ అనే వ్యక్తితోనే కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయించడం ప్రణాళిక ప్రకారమే జరిగినట్టు తెలుస్తోందన్నారు. దాడి ఘటన సమయంలో ఎక్కువ మంది భూములు కోల్పోయేవారు లేరని చెప్పారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులు చేపట్టేందుకు ఎన్నో భూములు సేకరిస్తోందని, తాము ఫార్మా, పరిశ్రమల ఏర్పాటు కోసం 1,300 ఎకరాలు అభివృద్ధి చేయాలని భావిస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ ప్రాంతంలో రూ.4,500 కోట్లతో పలు ప్రాజెక్టులు, పనులు చేపడుతూ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.

రైతులు వద్దంటే కారిడార్ వద్దు

ప్రజాభీష్టం మేరకే భూసేకరణ జరుగుతుందని, రైతులు వద్దంటే ఇండస్ట్రియల్ కారిడార్ వద్దు అని మల్లు రవి అన్నారు. లగచర్లలో పర్యటించి అధికారులపై దాడి జరిగిన ప్రాంతంలో హనుమాన్ దేవాలయం ఎదుట రచ్చకట్టపై కూర్చొని రైతులతో మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా కొడంగల్ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టుతోపాటు వేలాది కోట్లతో మెడికల్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక కేటీఆర్, బీఆర్‌ఎస్ నాయకులు కుట్ర పన్నుతూ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఫార్మా వస్తుందో, ఇండస్ట్రీ వస్తుందో తెలియదని చెప్పారు. సీఎం కొడంగల్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తుంటే కేటీఆర్, నరేందర్‌రెడ్డి డైరెక్షన్‌లో సురేశ్ అనే వ్యక్తితో ప్రజలను రెచ్చగొట్టించి అధికారులపై దాడులు చేస్తే ఊరుకోవాలా? అని మల్లు రవి అన్నారు. టీజీఐఐసీ ద్వారా భూసేకరణ కొనసాగుతుందని తెలిపారు. రైతులు బీఆర్‌ఎస్ నాయకుల మాయలో పడొద్దన్నారు. ఇక్కడ అభివృద్ధి జరగకపోయినా రేవంత్‌రెడ్డి సీఎంగా ఉంటారని తెలిపారు. సీఎం హోదాలో ఈ ప్రాంతం అభివృద్ధి కావాలా వద్దా అని మల్లు రవి అడిగారు. భూములను ఇస్తామని మూడు గ్రామాల రైతులు కలిసి తీర్మానంతో ప్రజాప్రతినిధులతో కలిసి రావాలని అన్నారు. కాగా లగచర్ల ఘటనతో బీఆర్‌ఎస్ కుట్రలు బట్టబయలయ్యాయని, ఇక చర్యలు తప్పవని మల్లు రవి అన్నారు. కొడంగల్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కొడంగల్‌లో అల్లర్లు సృష్టించి చెడ్డపేరు తేవాలనే కుట్రపూరితంగా కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి.. సురేశ్‌తో కలిసి దాడులు చేయించారని ఆరోపించారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు సురేశ్ రైతు కాదని, మణికొండలో విల్లాలో ఉంటూ షార్ట్ ఫిల్మ్‌లు తీసేవాడని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అన్నారు.

నేడు రాష్ట్రానికి జస్టిస్ పినాకి చంద్రఘోష్

» 'కాళేశ్వరం'పై ఐఏఎస్‌లు, మాజీ ఐఏఎస్‌ల క్రాస్ ఎగ్జామినేషన్?

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ విచారణ పునఃప్రారంభానికి రంగం సిద్ధమైంది. విచారణ నిమిత్తం జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం సాయంత్రం హైదరాబాద్ వస్తున్నారు. డిసెంబరు 5వ తేదీ వరకు రాష్ట్రంలోనే ఉండనున్నారు. విచారణలో భాగంగా శనివారం(23వ తేదీ) నుంచి ఐఏఎస్‌లు/మాజీ ఐఏఎస్‌లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనున్నారని సమాచారం. ఎవరెవరినీ విచారణకు పిలవాలనే అంశంపై శుక్రవారం నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఈ నెలాఖరున లేదా డిసెంబరు తొలి వారంలో విచారణలో కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయని అధికారులు భావిస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల నిర్మాణంపై విధాన నిర్ణయం తీసుకున్న వారితోపాటు ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన మాజీ కీలక ప్రజాప్రతినిధులను విచారణకు పిలిచే అవకాశాలున్నాయి.

నల్లగొండలో రూ.44కోట్లతో మూడు లిఫ్టులు

» పరిపాలన అనుమతినిచ్చిన ప్రభుత్వం

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు కాలువ(లెఫ్ట్ బ్యాంక్ కెనాల్-ఎస్ఎల్‌బీసీ) హై లెవల్ కెనాల్ నుంచి నీటిని తరలించి, 4231 ఎకరాలకు సాగునీటిని అందించడానికి గాను నల్లగొండ జిల్లాలో రూ.44 కోట్లతో మూడు లిఫ్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కనగల్ మండలం పొనుగోడ్‌లో 510 ఎకరాలకు నీళ్లందించేలా రూ.6.83 కోట్లతో పొనుగోడ్ లిఫ్టుకు, నల్లగొండ మండలం నర్సింగ్‌భట్ల-దోమలపల్లి పరిధిలో 2484 ఎకరాలకు నీరందించేలా రూ.16.95కోట్లతో మరో లిఫ్టుకు, నల్లగొండ మండలంలో 1237 ఎకరాలకు నీరందించడానికిగాను రూ.20.22 కోట్లతో కాంచనపల్లి-బక్కతాయికుంట లిఫ్టుకు పరిపాలన అనుమతినిస్తూ నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా బుధవారం జీవో జారీ చేశారు.

ఖరీఫ్ పంట రుణాల పంపిణీ 56శాతమే!

» బ్యాంకర్ల రుణ లక్ష్యం రూ.48,888 కోట్లు

» రైతులకు ఇచ్చింది 27,485 కోట్లు మాత్రమే

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్‌లో రైతులకు అప్పులు మంజూరు చేయటంలో బ్యాంకర్లు పూర్తిగా వెనకబడ్డారు. ఈ సీజన్‌లో 56% రుణ లక్ష్యం మాత్రమే సాధించారు. స్వల్ప కాలిక పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు రకరకాల కొర్రీలు పెట్టడంతో.. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆమోదించిన రుణ ప్రణాళిక లక్ష్యం నీరుగారిపోయింది. రాష్ట్రంలో 70 లక్షల మంది పట్టాదారులు ఉండగా.. ఇందులో 21.67 లక్షల మంది రైతులకు మాత్రమే అప్పు పుట్టడం గమనార్హం. దీంతో రైతులు ప్రైవేటులో అధిక వడ్డీకి అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సి వచ్చింది. 2024-25 వానాకాలం(ఖరీఫ్) సీజన్‌లో బ్యాంకుల ద్వారా రూ.48,888 కోట్ల స్వల్పకాలిక పంట రుణాలు పంపిణీ చేస్తామని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ ప్రకటించింది. కానీ, రూ. 27,485 కోట్ల రుణాలను మాత్రమే రైతులకు అందజేశారు. రుణ మాఫీ పథకం వర్తించిన రైతులకు మాత్రమే పంట రుణాలు అందాయని, రుణమాఫీ పొందని రైతులకు మంజూరు చేయలేదని తెలుస్తోంది.

జీతాల్లో కోతలొద్దు: హోంగార్డుల జేఏసీ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తమ జీతాల్లో కోతలు విధించవద్దని హోంగార్డుల జేఏసీ డీజీపీకి విజ్ఞప్తి చేసింది. సాధారణంగా ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల బందోబస్తు నిర్వహించిన రోజుల్లో పోలీసులకు ఆ రాష్ట్రాలిచ్చే ప్రత్యేక అలవెన్స్‌లతో పాటు ప్రభుత్వం జీతం చెల్లిస్తోందని, హోంగార్డులకు మాత్రం కేవలం అలవెన్స్‌లు చెల్లించి జీతంలో కోతలు విధిస్తోందని డీజీపీకి రాసిన లేఖలో పేర్కొంది. వేతనంలో కోత పెట్టకుండా చూడాలని, అదేవిధంగా డిసెంబరు 6న హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని జేఏసీ డిమాండ్ చేసింది. రాష్ట్రంలో పనిచేస్తున్న 16వేల మంది హోంగార్డులను క్రమబద్ధీకరించాలని, విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబసభ్యులకు కారుణ్య నియామకం కింద ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. కాగా, బుధవారం మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల బందోబస్తుకు తెలంగాణ నుంచి మూడువేల మందికి పైగా హోంగార్డులు వెళ్లడం గమనార్హం.

90,56,383 నివాసాల్లో ఇంటింటి సర్వే


» లక్ష్యంలో 78% పూర్తి.. అగ్రస్థానంలో ములుగు, జనగామ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ, కులగణన రాష్ట్రంలో ముమ్మరంగా సాగుతోంది. బుధవారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా 90,56,383, నివాసాల్లో సర్వే పూర్తయింది. ఈ సమగ్ర ఇంటింటి సర్వేలో మొత్తం 1,16,14,349 నివాసాలు కాగా ఇప్పటిదాకా 90.56,383 నివాసాల్లో సర్వే చేసి 78 శాతం లక్ష్యం పూర్తిచేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ములుగు జిల్లాలో 97.552 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా లక్ష్యాన్ని మించి 98,080 నివాసాల సర్వేతో మొదటి స్థానంలో నిలిచింది. జనగాం జిల్లా 99.9 శాతం పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచింది. నల్లగొండ జిల్లా 97.7 శాతంతో తృతీయ స్థానంలో ఉంది. కామారెడ్డిలో 93.3 శాతం, మంచిర్యాల 93.2 శాతం, యాదాద్రి భువనగిరిలో 92.3 శాతం, నిజామాబాద్‌లో 91శాతం, సిరిసిల్ల 90.9శాతం, జగిత్యాలలో 90.6శాతం, మిగిలిన 9 జిల్లాలో 90 శాతం పైగా సర్వే పూర్తయింది. జీహెచ్ఎంసీ పరిధిలో సర్వే ప్రక్రియ ఊపందుకుంది. జీహెచ్ఎంసీ పరిధిలో 25,05,517 నివాసాలు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 13,91,817 నివాసాల్లో అంటే 55.6 శాతం సర్వే పూర్తి చేశారు. ఈ సర్వే కు ప్రజల నుంచి మంచి స్పందన ఉందని అధికారులు వివరించారు. 52,493 గ్రామీణ, 40,901 అర్బన్ బ్లాకులుగా మొత్తం 92,901 బ్లాకులుగా విభజించి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సర్వే పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా జిల్లా ఇన్‌చార్జి అధికారులు కలెకర్లు ఎప్పటిప్పుడు సమీక్షించి తగిన చర్యలు తీసుకుటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

రాష్ట్రంలో 2708 మెడికల్ పీజీ సీట్లు

» కళాశాలల వారీగా జాబితా విడుదల చేసిన ఎన్ఎంసీ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లోని పీజీ సీట్ల వివరాలను జాతీయ వైద్యమండలి(ఎన్ఎంసీ) బుధవారం విడుదల చేసింది. రాష్ట్రాలవారీగా అయా కళాశాలల్లోని పీజీ కోర్సులు, వాటిల్లోని సీట్ల వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. తెలంగాణలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో 2708 పీజీ వైద్యవిద్య సీట్లు ఉన్నట్లు ఎన్ఎంసీ పేర్కొంది. ఇందులో అత్యధికంగా ఉస్మానియాలో 495 పీజీ సీట్లుండగా, గాంధీలో 213, నిమ్స్‌లో 86, కేఎంసీలో 184, సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో 83 సీట్లున్నట్లు వెల్లడించింది.



ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఓ గ్రామంలో ప్రదర్శనవిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు

విజయోత్సవాల్లో సారథి కళాకారుల ప్రదర్శనలు

హైదరాబాద్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నెల రోజులు పాటు నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన విజయోత్సవాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులకు ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీలపై విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి పాటల రూపంలో ప్రజలకు చేరువ చేసేందుకు కళాకారుల బృందాలు ప్రదర్శనలివ్వనున్నాయి. విజయోత్సవాల సందర్భంగా నిర్వహించే సభలు, సమావేశాలకు ముందు ప్రదర్శనలు ఉండే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. డిసెంబర్ 10తేదీ వరకు సారథి కళాకారులు రోజుకు కనీసం మూడుచోట్ల ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ఇప్పటికే సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో కళాకారులకు ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. కాగా, ఇటీవలే తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా ప్రజాయుద్ధనౌక గద్దర్ కూతురు వెన్నెల నియమితులయ్యారు.





ప్రజాపాలన విజయోత్సవ సభకు హాజరైన జనం; వేదికపై నుంచి అభివాదం చేస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు, పీసీసీ చీఫ్

భూములు సేకరించొద్దా?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. బుధవారం పలువురు మంత్రులతో కలిసి వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని సీఎం రేవంత్ దర్శించుకున్నారు. సుమారు 1000 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవ సభలో మాట్లాడారు. "పదేళ్ల మీ హయాంలో భూసేకరణ చేయలేదా? మల్లన్నసాగర్ కోసం 10 గ్రామాల ప్రజలను నిండా ముంచలేదా? ఎయిర్ పోర్టు పక్కన ఫార్మాసిటీ కోసం 14 వేల ఎకరాలు సేకరించలేదా? ఇవాళ కొడంగల్‌లో భూమి సేకరిస్తే కడుపుమంట, వివక్ష ఎందుకు? నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటు చేయాలని భావించి.. భూసేకరణ చేయడానికి వెళ్లిన కలెక్టర్‌పై, ఇతర అధికారులపై బీఆర్ఎస్ నేతలు దాడులు చేశారు. ఇలాంటి వారిపై కేసులు పెడితే.. ఎలా పెడతారని ప్రశ్నిస్తున్నారు ఇది సమంజసమేనా? అని రేవంత్ ప్రశ్నించారు. రాష్ట్ర అభివృద్ధిని, అందుకు చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకునేందుకు కుట్రలు చేస్తే ఊచలు లెక్కించడం ఖాయమని హెచ్చరించారు.



భూసేకరణ జరగాల్సిందే..

పరిశ్రమలు స్థాపించాలంటే, అభివృద్ధి జరగాలంటే భూసేకరణ జరగాల్సిందేనని, ఎవరో ఒకరు భూమి కోల్పోవాల్సిందేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అయితే భూములు కోల్పోయిన వారి బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసునన్నారు. భూములు కోల్పోయే వారికి భూమి రేటును మూడు రెట్లు పెంచి పరిహారంగా ఇవ్వాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతామని, రైజింగ్ తెలంగాణగా నిలుపుతామని ప్రకటించారు. ఈ దేశానికి దశ దిశను నేర్పిన పీవీ నర్సింహారావు, చొక్కారావు, ఎంఎస్ఆర్‌ను అందించిన గడ్డ కరీంనగర్ అని రేవంత్ కొడియాడారు. పెప్పర్ స్ప్రేలకు భయపడకుండా తెలంగాణ నాడు ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ ఈ ప్రాంతానికి చెందిన వారు కావడం గర్వకారణమన్నారు. పొన్నంను ఎంపీని చేస్తే తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చారన్నారు. కానీ, బండి సంజయ్‌ను రెండుసార్లు గెలిపిస్తే ఆయన చేసిందేమి లేదని, మంత్రి మాత్రం అయ్యారని విమర్శించారు. ఈ ప్రాంతం నుంచి గల్ఫ్‌కు వలస వెళ్లేవారి కోసం గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేశామని, ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తున్నామని తెలిపారు.

కాళ్లలో కట్టెలు పెడుతున్నారు

తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేసీఆర్ చేయలేని పనులన్నింటినీ చేస్తున్నామని రేవంత్ చెప్పారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో పడుకుంటే.. కొడుకు, అల్లుడు తమ కాళ్లల్లో కట్టెలు పెడుతున్నారని మండిపడ్డారు. 25 రోజుల్లో 23 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ఇందుకు ఒక పెద్దమనిషిగా తమను అభినందించాల్సింది పోయి.. చిల్లర మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. "ఈ పదేళ్లలో నువ్వేమి చేశావో ఒక రోజంతా చర్చ చేద్దాం.. లెక్కలేందో తేలుద్దాం.. అసెంబ్లీకి రా సామీ. నువ్వు దిగిపో.. దిగిపో అని నీ కొడుకు, అల్లుడు అంటున్నారు. మీ నొప్పికి స్థానిక సంస్థల ఎన్నికల్లో మందు పెట్టేందుకు మావాళ్లు సిద్ధంగా ఉన్నారు" అని రేవంత్ అన్నారు. తాము వచ్చాక 50 వేల ఉద్యోగాలు కల్పించామని, వాళ్లందరినీ ఎల్‌బీ స్టేడియంకు పిలిపిస్తానని, వచ్చి లెక్కపెట్టుకోవాలని కేసీఆర్‌కు సవాల్ చేశారు. ఒక్క తల తగ్గినా తాను క్షమాపణ చెబుతానన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి ఒక్క చుక్క నీళ్లు రాకున్నా.. రైతులు ఈ సీజన్‌లో 66 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసి 1.53 కోట్ల టన్నుల దిగుబడులు సాధించారని తెలిపారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.1.83 లక్షల కోట్లు ఖర్చు పెట్టారని, కానీ.. ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదని ధ్వజమెత్తారు.

ఫామ్‌హౌస్‌ల కోసమే రిజర్వాయర్లు..

రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లను వాళ్ల ఫామ్ హౌస్‌ల కోసమే నిర్మించారని రేవంత్ ఆరోపించారు. ప్రాజెక్టుల కోసం సేకరించిన భూమిని బదలాయించుకుని హరీశ్‌రావు రంగనాయక సాగర్‌లో ఫామ్‌హౌస్ నిర్మించారని తెలిపారు. "హరీశ్‌రావ్.. ఏం చింతచేయకు.. నీ లెక్క కూడా తీస్తా. కేటీఆర్.. నువ్వు ఎక్కడ తిరిగినా, కుట్రలు చేసినందుకు ఊచలు లెక్క పెడతావు గుర్తుంచుకో" అని రేవంత్ హెచ్చరించారు. కొండపోచమ్మసాగర్ నుంచి కేసీఆర్ తన ఫామ్‌హౌస్‌కు నేరుగా కాలువ నిర్మించుకుని వందల ఎకరాలు సాగు చేస్తున్నారని తెలిపారు. దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసుకుని కొండపోచమ్మ వద్దకు రావాలని సవాల్ చేశారు. కేటీఆర్‌ను మునిసిపల్ శాఖ మంత్రిని చేస్తే జీవో 111 ఉండగా జన్వాడలో ఫామ్ నిర్మించారని, ఆయన బావమరిది మరొకటి నిర్మించుకున్నారని ఆరోపించారు. కొడంగల్ నియోజకవర్గం 75 ఏళ్లలో అభివృద్ధికి నోచుకోలేదని, తొండలు గుడ్లు పెట్టని వెయ్యి 1200 ఎకరాల భూమిని సేకరించి పారిశ్రామిక వాడ పెట్టి పరిశ్రమలు పెట్టి అక్కడి పిల్లలకు ఉద్యోగాలు కల్పించాలని తాను భావించానని అన్నారు. వంద మంది రౌడీ మూకలకు డబ్బులిచ్చి కలెక్టర్‌ను, ఆర్‌డీవోను, అధికారులను ఇష్టం వచ్చినట్లు కొట్టి చంపడానికి ప్రయత్నిస్తే కేసులు ఎందుకు పెడతారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారని మండిపడ్డారు.

రాజన్నకు.. కోడె మొక్కు!

సీఎం హోదాలో ఆలయానికి రేవంత్

వేములవాడ కల్చరల్: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామిని సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి బుధవారం దర్శించుకున్నారు. ఉదయం 10.57 గంటలకు రాజన్న ఆలయ గుడిచెరువు వద్ద హెలికాప్టర్ దిగిన ముఖ్యమంత్రి.. నేరుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవస్థానం ఆవరణలో ధర్మగుండం వద్ద రూ.76 కోట్లతో చేపట్టే ఆలయాభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధి పనులతో ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ఆలయంలో ధ్వజస్తంభం వద్ద కోడెను కట్టి మొక్కు చెల్లించుకున్నారు.

నాలుగేళ్లలో కొత్తగా 30 లక్షల ఎకరాల ఆయకట్టు

» తక్కువ ఖర్చు.. ఎక్కువ ఆయకట్టు ప్రాజెక్టులకు ప్రాధాన్యం: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

» ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు: పొంగులేటి

» విపక్ష నేతల మాటలను తిప్పికొట్టాలి: తుమ్మల

» నేతన్నలు, రైతన్నల సంక్షేమమే లక్ష్యం: పొన్నం

» కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్య పాలన: దామోదర

వేములవాడ, నవంబరు 20: రానున్న నాలుగు సంవత్సరాల కాలంలో తెలంగాణలో కొత్తగా 30 లక్షల ఎకరాల ఆయకట్టు అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు కోసం లక్షా 81 వేల కోట్లు ఖర్చుపెట్టి నామమాత్రపు ఆయకట్టు మాత్రమే అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానం గుడి చెరువు ప్రాంగణలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు స్టేజ్-2 ఫేస్-1 పనులు త్వరితగతిన పూర్తిచేసి కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లో లక్షా 51 వేల 400 ఎకరాలకు ఈ సంవత్సరంలోనే నీళ్లు అందిస్తామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వచ్చే నాలుగేళ్లలో లక్ష కోట్ల రూపాయల వ్యయంతో రాష్ట్రవ్యాప్తంగా 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని తెలిపారు. ప్రతీ నియోజకవర్గానికి 3500 ఇళ్ల చొప్పున.. ప్రతీ ఊరిలో, ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టించి ఇస్తామన్నారు. గత ప్రభుత్వం పేదల భూములను దోచుకునేందుకు 2020 చట్టాన్ని తీసుకొచ్చిందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దేశంలోనే రోల్ మోడల్‌గా ఉండేలా కొత్తగా 2024 రెవెన్యూ చట్టాన్ని తీసుకొచ్చి పేదల భూములను రక్షిస్తుందని హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈ వర్షాకాలం సీజన్‌లో కోటి 53 లక్షల మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వచ్చిందని, దేశంలోనే ఇది అత్యధికమని చెప్పారు. రైతన్నలకు 30 వేల కోట్లు రుణమాఫీ చేస్తామని మాట ఇచ్చామని, ఇప్పటికే 18 వేల కోట్ల రుణ మాఫీ చేశామని, త్వరలో మిగతా రుణ మాఫీ కూడా చేస్తామన్నారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ప్రతిపక్ష నేతలు చెప్పే మాటలను తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని ఇచ్చిన మాటను తప్పి శివునికి సైతం శఠగోపం పెట్టిన చరిత్ర కేసీఆర్‌ది అని విమర్శించారు. రాజన్న ఆలయ అభివృద్ధితో పాటు నేతన్నల, రైతన్నల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. మంత్రి దామోదర రాజనరసింహ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపిస్తే తొమ్మిదిన్నర సంవత్సరాలు నిరంకుశ పరిపాలన చూపించారని, కాంగ్రెస్ ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగిస్తోందన్నారు. పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి మధ్య ఉన్న తేడా ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ప్రతీ ఒక్కరికి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణంలో అలసత్వం వద్దు

» పనుల్లో వేగం పెంచండి.. ప్రతి వారం నివేదిక ఇవ్వండి

» సమస్యలను నా దృష్టికి తీసుకురండి

» మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులు రాష్ట్ర ప్రగతికి వెన్నెముకల్లాంటివని, వాటి నిర్మాణంలో అలసత్వానికి తావివ్వొద్దని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులకు సూచించారు. భూ సేకరణ, అటవీ అనుమతులు వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకుంటూ పని చేయాలన్నారు. జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించిన వివరాలను ప్రతి వారం నివేదిక రూపంలో సమర్పించాలన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎన్‌హెచ్‌ఏఐ తెలంగాణ రీజియన్ అధికారి శివశంకర్, అధికారులతో కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరైన జాతీయ రహదారుల గురించి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గతాన్ని వదిలేసి.. రోడ్ల నిర్మాణ పనులను పరుగులు పెట్టించాలని సూచించారు. రహదారుల నిర్మాణంలో ఎలాంటి సమస్యలున్నా.. తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. 24గంటలు తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. హైదరాబాద్-డిండి (ఎన్‌హెచ్-765) 85 కిలోమీటర్ల రోడ్డు అలైన్‌మెంట్ పెండింగ్‌లో ఉందని అధికారులు ప్రస్తావించగా.. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌తో సమావేశమై అలైన్‌మెంట్ ఖరారు చేస్తామని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఆ వెంటనే డీపీఆర్‌ను సిద్ధం చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్-విజయవాడ (ఎన్‌హెచ్-65) మార్గంలో గుర్తించిన బ్లాక్ స్పాట్ పనులను పూర్తిచేయడానికి ఇంకా రెండేళ్ల కాలపరిమితి ఉందని అధికారులు చెప్పగా.. కాలపరిమితితో సంబంధం లేకుండా పనుల్లో వేగం పెంచి, త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. హైదరాబాద్- మన్నెగూడ (ఎన్‌హెచ్-163)రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే, హైదరాబాద్-నాగ్‌పూర్ (ఎన్‌హెచ్- 44) మార్గంలోని రెండు ప్యాకేజీలు, హైదరాబాద్-బెంగళూరు హైవేలోని మూడో ప్యాకేజీ పనుల గురించి మంత్రి ఆరా తీశారు. వీటి విషయంలో భూ సేకరణ పెద్ద సమస్యగా మారిందని అధికారులు తెలపగా.. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. వీటితోపాటు కర్నూల్-రాయచూర్ (ఎన్‌హెచ్-150సీ) గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనుల వివరాలను మంత్రి అడగ్గా.. రెండో ప్యాకేజీలో టన్నెల్స్ నిర్మించాల్సి ఉందని, 2025 డిసెంబరు వరకు పనులు పూర్తవుతాయని అధికారులు పేర్కొన్నారు. విజయవాడ-నాగ్‌పూర్ (ఎన్‌హెచ్-163జీ) మార్గంలో భూ సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు ప్రస్తావించగా.. మంచిర్యాల, వరంగల్, ఖమ్మం జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి, భూ సేకరణను వేగవంతం చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెల్లడించారు.

ప్రజాపాలనకు తిరుగులేని సాక్ష్యం

మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకంపై సీఎం రేవంత్



సౌజన్యను అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

» ఇంటర్వ్యూ ద్వారా చైర్మన్ ఎంపిక

» ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు, చైర్‌పర్సన్‌గా ఎంపికైన సౌజన్యకు సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి అభినందన

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ కమిటీల చైర్మన్ పదవులు మంత్రులు, ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన వారికే సాధారణంగా దక్కుతాయి. కానీ, కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపిక వినూత్నంగా జరిగింది. ప్రతిభ కలిగిన విద్యావంతులు చైర్మన్ అయితే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందనే ఆలోచనతో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు వినూత్న ప్రయత్నం చేశారు. మూడు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ముగ్గురు సీనియర్ లీడర్లతో ఓ కమిటీ నియమించి ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యావంతురాలు, నిరుపేద కుటుంబానికి చెందిన అయిల్వార్ సౌజన్య అనే కాంగ్రెస్ కార్యకర్తను మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎంపిక చేసి నియామకం చేపట్టారు. సౌజన్య ఎమ్మెస్సీ బీఈడీ పూర్తి చేశారు. కాగా, సౌజన్య నియామకంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రతిభకు ప్రాధాన్యమిస్తూ, మహిళలను ప్రోత్సహించే విధంగా జరిగిన ఈ ఎంపిక కొత్త ఒరవడి సృష్టించిందని పేర్కొన్నారు. సౌజన్య ఎంపిక ప్రజాస్వామ్యంలో ఓ నూతన అధ్యాయమని, ప్రజాపాలనకు తిరుగులేని సాక్ష్యమని సీఎం రేవంత్ అన్నారు. ఈ నియామకంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుకు అభినందనలు తెలియజేశారు. ఇక, రాజకీయాల్లో ఎక్కడో ఓ చోట మార్పు మొదలుకావాలని, అలాంటి మార్పు సౌజన్య నియామకంతో మొదలైందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావుతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని సౌజన్య హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ లక్ష్మీకాంతరావు సమకాలీన రాజకీయాల్లో ఒక నూతన ఒరవడికి నాంది పలికారని ప్రశంసించారు. డబ్బు ప్రమేయం పెరిగిందన్న కారణంతో రాజకీయాలకు దూరంగా ఉంటున్న యువతకు ఇలాంటి ప్రయోగాలు నమ్మకాన్ని కలిగిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తనను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియమించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, పీసీసీ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్‌కు సౌజన్య ధన్యవాదాలు తెలియజేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులపై నివేదిక ఇవ్వండి

» 30 రోజుల్లోగా సమర్పించాలి.. అధికారులకు భట్టి ఆదేశాలు

» ప్రైవేటు కాలేజీల సమస్యలు దశలవారీగా పరిష్కరిస్తామని భరోసా



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వ్యయంపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. బుధవారం సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వ్యయానికి సంబంధించి 32 శాఖల పనితీరుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా కేటాయించిన నిధులు, వ్యయాలు, గతేడాది ఖర్చు చేయకుండా మిగిలిపోయిన నిధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం ప్రకారం అన్ని శాఖల్లో ఒక విధానాన్ని ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా ప్రతి శాఖలో ఒక సపోర్ట్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అన్ని శాఖల్లో సబ్ ప్లాన్ నిధుల వ్యయాన్ని ఇక నుంచి ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వ్యయంపై అన్ని శాఖలు 30 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గిరిజన తండాలకు త్రీ ఫేజ్ విద్యుత్తును సరఫరా చేయాలన్న డిమాండ్ల నేపథ్యంలో అధికారులు తదనుగుణ చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో 4 నెలల్లో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున... వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేయడానికి అన్ని శాఖల వారు కొత్త పథకాలను రూపొందించి, ఆర్థిక శాఖకు సమర్పించాలన్నారు. ఈ కొత్త పథకాల కోసం ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా ఓ రీసెర్చ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ప్రైవేటు కళాశాలల యజమానుల సంఘం సభ్యులతో భట్టి సమావేశమై చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ప్రైవేటు ఇంటర్మీడియట్, డిగ్రీ కళాశాలల సమస్యల పట్ల ప్రభుత్వానికి పూర్తి అవగాహన ఉందని, దశల వారీగా వాటిని పరిష్కరిస్తామని భరోసానిచ్చారు.

కేటీఆర్ దావాపై విచారణ 27కు వాయిదా

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వేసిన క్రిమినల్ పరువు నష్టం దావాపై తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా పడింది. సురేఖ తనపై చేసిన వివాదస్పద వ్యాఖ్యల గురించి నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఎక్సైజ్ కోర్టులో కేటీఆర్ క్రిమినల్ పరువు నష్టం దావా వేసిన విషయం తెలిసిందే. బుధవారం ఈ దావాపై విచారణ జరిపిన న్యాయస్థానం ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి నమోదు చేసిన వాంగ్మూలాలన్నింటినీ పరిశీలించింది. తదుపరి విచారణలో ఈ దావాకు సంబంధించి ఉత్తర్వులు ఇవ్వనుంది. ఇక ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే బాల సుమన్, తుల ఉమ స్టేట్‌మెంట్లను న్యాయస్థానం నమోదు చేసిన విషయం తెలిసిందే.


గిగ్ వర్కర్ల విధానంపై సంప్రదింపులు జరపండి

» అప్పుడే పటిష్ఠ విధానాన్ని రూపొందించొచ్చు

» సీఎం రేవంత్‌కు రాహుల్ లేఖ

» మీ ఆలోచనకు అనుగుణంగానే కొత్త విధానం

» రాహుల్‌కు బదులిచ్చిన రేవంత్



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గిగ్ వర్కర్ల విధానం ముసాయిదా రూపకల్పనకు అన్ని పక్షాలతో సంప్రదింపులు జరపాలని సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరారు. అన్ని పక్షాల అభిప్రాయాలను తీసుకోవడం వల్ల పటిష్ఠ, ప్రభావవంతమైన విధానాన్ని రూపొందించవచ్చని తెలిపారు. ఇటీవల తాను హైదరాబాద్ వచ్చినప్పుడు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై వివిధ వర్గాలతో నిర్వహించిన సంప్రదింపుల ప్రక్రియ తనను ఎంతగానో ఆకట్టుకుందని చెప్పారు. ఒక చట్టం, విధానాన్ని రూపొందించేటప్పుడు ప్రజల నుంచి నేరుగా అభిప్రాయం తెలుసుకునేందుకు ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. గిగ్ వర్కర్ల విధానం ముసాయిదా పైనా ఇదే తరహా ప్రక్రియ నిర్వహించాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు రాహుల్ లేఖ రాశారు. గడిచిన దశాబ్ద కాలంలో లక్షలాది మంది గిగ్ కార్మికులుగా చేరారన్నారు. ఈ వ్యవస్థలో కార్మికుల శ్రమ దోపిడీ, ఇతర సమస్యల పరిష్కార యంత్రాంగం లేదని, వారు సామాజిక వివక్షకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిగ్ కార్మికుల రక్షణ, సామాజిక భద్రతకు చట్టాన్ని రూపొందించడానికి కట్టుబడి ఉన్నట్లు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో చెప్పామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఆ దిశగా చర్యలూ తీసుకున్నాయన్నారు. రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి గిగ్ కార్మికుల సంక్షేమానికి చట్టం చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కూడా గిగ్ కార్మికుల సంక్షేమం కోసం కొత్త విధానంతో ముందుకు సాగుతున్నందుకు సంతోషిస్తున్నానన్నారు. ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డికి రాహుల్‌గాంధీ ఈ మేరకు లేఖ రాశారు. దీనికి సీఎం బదులిస్తూ.. రాహుల్ ప్రజలకు ఇచ్చిన హామీ, ఆయన ఆలోచనకు అనుగుణంగా సమగ్ర గిగ్ వర్కర్ల విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కుల సర్వే ఆయన గర్వపడేలా చేయడం తమకు మరింత శక్తినిస్తోందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో రాహుల్ రాసిన లేఖను పోస్ట్ చేశారు.



శ్రీవారి ఆలయం ఎదుట కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తదితరులు

టీటీడీ బోర్డు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా

- హిందూ ఆలయాల్లో అన్యమత ఉద్యోగుల వల్లే భేదాభిప్రాయాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

తిరుమల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల్లో అన్యమత ఉద్యోగులు ఉండడం వల్లే అభిప్రాయ భేదాలు వస్తున్నాయని, వారిని ఇతర శాఖల్లో పంపడమే మంచిదని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. టీటీడీ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డితో కలిసి బుధవారం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఏర్పాటైన టీటీడీ బోర్డు.. తొలి సమావేశంలోనే కొన్ని సానుకూల, అద్భుతమైన నిర్ణయాలను తీసుకుందని ప్రశంసించారు. ఏ మతం వారైనా వారి వారి మత విశ్వాసాలున్న ప్రాంగణంలో పని చేస్తేనే బాగుంటుందని అన్నారు. స్థానికులకు శ్రీవారి దర్శనాన్ని తిరిగి ప్రారంభించడం కూడా మంచి విషయమన్నారు. టూరిజం టికెట్ల రద్దు నిర్ణయంపై స్పందిస్తూ.. ఈ టికెట్లు దుర్వినియోగమైనట్లు తెలిసిందన్నారు. తిరుమల పర్యాటక ప్రాంతం కాదని, హిందూ దేవతలపై విశ్వాసం ఉన్న వారే రావాలని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.

ఘనంగా చుక్కా రామయ్య 98వ జన్మదినోత్సవం

- కేక్ కట్ చేయించిన సీఎస్ శాంతికుమారి



చుక్కా రామయ్యను సత్కరిస్తున్న సీఎస్ శాంతికుమారి

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలుగునేలపై విద్యారంగ వికాసానికి చుక్కాని మన లెక్కల మాస్టారు చుక్కా రామయ్య 98వ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. బుధవారం నల్లకుంట, విద్యానగర్‌లోని ఆయన స్వగృహానికి వచ్చిన ప్రముఖులు రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చుక్కా రామయ్యను శాలువాతో సత్కరించారు. పూలమొక్కను అందజేసి, రామయ్యతో కేకు కట్ చేయించారు. కాంగ్రెస్ నేత జానారెడ్డి, జస్టిస్ సుదర్శన్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సీనియర్ జర్నలిస్టు కె.రామచంద్రమూర్తి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కోదండరాం, హరగోపాల్ తదితరులు చుక్కా రామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 50 జూనియర్ కళాశాలల్లో విద్యారంగంపై రామయ్య రాసిన పుస్తకాలను పునరావిష్కరించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం నేత కె.ఎస్.రామారావు తెలిపారు.

తెలంగాణ క్యాడర్ ప్రాసిక్యూటర్ల సంఘం అధ్యక్షుడిగా రాంరెడ్డి



హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ క్యాడర్ ప్రాసిక్యూటర్ల సంక్షేమ, అభివృద్ధి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎ.రాంరెడ్డి ఎన్నికయ్యారు. నూతనంగా ఏర్పడిన ఈ సంఘం ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆన్‌లైన్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి జొన్న శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా ఎ.రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీవాణి, ఉపాధ్యక్షులుగా పి.రవికిరణ్, పి.సత్యనారాయణ, కోశాధికారిగా రాఘవేందర్ ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

ముగిసిన టెట్ గడువు..22 వరకు ఎడిట్ ఆప్షన్

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టెట్‌కు దరఖాస్తు చేసుకునే గడువు బుధవారంతో ముగిసింది. మొత్తం 2,48,172 దరఖాస్తులు దాఖలు అయ్యాయి. పేపర్-1కు 71,655, పేపర్-2కు 1,55,971, రెండు పేపర్లకు 20,546 దరఖాస్తులు వచ్చాయి. కాగా, అభ్యర్థుల దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకోవడానికి వీలుగా ఈ నెల 22వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్‌ను కల్పించారు. కాగా, రంగారెడ్డి జిల్లాలో ఈ నెల 17 నుంచి సర్వర్లు మొరాయించాయి. దీంతో చాలామంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. గడువు పెంచాలని కోరుతున్నారు.

డైట్ కాలేజీల్లో ముఖ గుర్తింపు హాజరు విధానం

రాష్ట్రంలోని డైట్ కాలేజీల్లో ముఖ గుర్తింపు హాజరు విధానాన్ని అమలు పరచాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు బుధవారం నాడు విద్యాశాఖ అధికారులు సర్క్యులర్‌ను జారీ చేశారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ డైట్ కాలేజీలకు వర్తించనుంది. ఈ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులతో పాటు, బోధన, బోధనేతర సిబ్బందికి కూడా ఈ విధానాన్ని వర్తింపజేయనున్నారు.

ముత్తిరెడ్డి చెరువు శిఖం ఆక్రమించారు

- హైడ్రాకు బోడుప్పల్ డిప్యూటీ మేయర్ ఫిర్యాదు

ఉప్పల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చెరువుశిఖం ఆక్రమించారంటూ బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ హైడ్రా కమిషనర్ రంగానాథ్‌కు ఫిర్యాదు చేశారు. చెంగిచర్ల సర్వే నంబరు 57లోని చింతలచెరువు ఆక్రమణ చేసి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. సర్వే నంబరు 59లో 4.12 ఎకరాల భూమిని గతంలో పంచాయతీగా ఉన్న సమయంలోనే ముత్తిరెడ్డి లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయించారన్నారు. కానీ సర్వే నంబరు 59లో ఖాళీ స్థలం ఉందంటూ హెచ్ఎండీఏ, మునిసిపల్ అధికారులకు తప్పుడు సమాచారమిచ్చి బహుళ అంతస్తులు నిర్మాణం చేపడుతున్నారని, తక్షణమే ఆనిర్మాణాలను నిలిపేయాలని కోరారు. చెరువు భూమిని సర్వే చేసి ఆక్రమణలు అడ్డుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

భారత్ నుంచి అమెరికా వస్తున్న విద్యార్థుల్లో 56 శాతం తెలుగువారే!

- అమెరికన్ కాన్సుల్ జనరల్ రెబకా డ్రామె వెల్లడి

విశాఖపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అమెరికాలో చదువుకోడానికి భారతదేశం నుంచి వస్తున్నవారిలో 56 శాతం మంది తెలుగు రాష్ట్రాలవారే ఉన్నారని అమెరికన్ కాన్సుల్ జనరల్(హైదరాబాద్) రెబకా డ్రామె తెలిపారు. విశాఖపట్నం పర్యటనకు వచ్చిన ఆమె ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. చైనాను అధిగమించి భారత్ మొదటి స్థానం ఆక్రమించిందని చెప్పారు. 2023-24లో భారత్ నుంచి 3.3 లక్షల మంది అమెరికాకు రాగా వారిలో 56శాతం మంది తెలుగువారే ఉన్నారని, అందులో తెలంగాణ నుంచి 34శాతం, ఆంధ్రప్రదేశ్ నుంచి 22శాతం ఉన్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం రోజుకు 1,600 వీసాలు ఇస్తున్నామని, 2025 ఫిబ్రవరి నుంచి 2,500 వీసాలు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించుకున్నామన్నారు. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని అపాయింట్‌మెంట్ వెయిటింగ్ పీరియడ్‌ను మూడు నెలలకు తగ్గించామని చెప్పారు. విశాఖపట్నంలో ఇంటర్వ్యూ సెంటర్ ఏర్పాటుచేసే ఆలోచన ఏమైనా ఉందా? అని ప్రశ్నించగా.. ఈ విషయాన్ని తమ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.



'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ రాధాకృష్ణను కలిసిన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

- మంత్రి కోమటిరెడ్డితోనూ చైర్మన్ భేటీ

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) బోర్డు చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బీఆర్ నాయుడు బుధవారం హైదరాబాద్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని అందించారు. ఈ సదర్భంగా ఇరువురు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. తిరుమల ఆలయ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాగా టీటీడీ చైర్మన్ నాయుడు.. రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కూడా కలిశారు. మంత్రికి స్వామివారి ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా టీటీడీ పాలకమండలి తీసుకున్న నిర్ణయాలను మంత్రి కోమటిరెడ్డి అభినందించారు.

తిరుమలలో మా లేఖలూ పరిగణించండి

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు కేటీఆర్ వినతి

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే తెలంగాణ భక్తుల దర్శనానికి ఇక్కడి ప్రజాప్రతినిధులైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇచ్చే లేఖలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. టీటీడీ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన బీఆర్‌నాయుడును కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, కరీంనగర్, సిరిసిల్లలో గతంలో శంకుస్థాపన చేసిన టీటీడీ దేవాలయాల నిర్మాణాలు శరవేగంగా పూర్తిచేయాలని బీఆర్ నాయుడును కేటీఆర్ విన్నవించారు.

చెరువుల ఆక్రమణలను కనికరిస్తే విధ్వంసమే!

ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపాలి.. బిల్డర్లు, భూ మాఫియాతోనే చెరువులకీ దుస్థితి

- 'ఆంధ్రజ్యోతి'తో 'లేక్‌మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆనంద్



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో కలిసి హైదరాబాద్‌లో ఓ చెరువును పరిశీలిస్తున్న ఆనంద్

హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): టెకీ నుంచి పర్యావరణవేత్తగా మారారు.. ఏడేళ్లలో 115 చెరువులను పునరుద్ధరించారు.. 12 రాష్ట్రాలకు సలహాదారుగా ఉన్నారు.. 'లేక్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందారు. ఆయనే కర్ణాటకకు చెందిన ఆనంద్ మల్లిగావడ్. బెంగళూరులో తీవ్రమవుతున్న నీటి సమస్యను పరిష్కరించడమే లక్ష్యంగా.. పర్యావరణవేత్తగా మారిన ఆయన.. ఏడేళ్లలో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారు. బెంగళూరు, హైదరాబాద్‌తోపాటు 15 రాష్ట్రాల్లో 115 మురికినీటి చెరువులను శుద్ధి చేసి, తాగునీటి వనరులుగా మార్చారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు హైదరాబాద్ వచ్చిన ఆనంద్.. మూడు రోజులుగా రాజధానిలో పర్యటిస్తున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, జలమండలి ఉన్నతాధికారులతో కలిసి.. మురికికూపాలుగా మారిన చెరువులను పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మూసీ ప్రాజెక్టుకు సాంకేతిక సలహాదారుడిగానూ వ్యవహరిస్తున్నారు. 43 ఏళ్ల ఆనంద్.. తాను సాధించిన అసాధారణ విజయాలు.. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి అనేక అంశాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఐటీ ఉద్యోగం వదిలి చెరువుల వైపు ప్రయాణానికి కారణం?

2016 వరకు చెరువుల స్వచ్ఛత గురించి ఎలాంటి ఆలోచనా లేదు. నేను పుట్టి పెరిగిందంతా కర్ణాటక రాష్ట్రంలోని కొప్పాల్ జిల్లా. రాజధాని బెంగళూరుకు 450 కి.మీ. దూరంలో ఉంది. నిజాం కాలంలో హైదరాబాద్ స్టేట్‌లో భాగంగానే ఉండేది. బాల్యమంతా అక్కడి చెరువుల్లోనే గడిచింది. బెంగళూరు జీరో వాటర్ సిటీగా మారుతోందన్న ఓ వార్త 2016లో నన్ను తీవ్రంగా ఆలోచింపజేసింది. 2030నాటికి దేశంలోని 21 నగరాల్లో ఇదే సమస్య రాబోతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. వర్షాకాలం నీటిలో పదోవంతు సంరక్షించినా ఏడాదంతా పుష్కలంగా నీరు అందుబాటులో ఉంటుంది. కర్ణాటకలో సరిపడా వర్షపాతం కూడా నమోదవుతోంది. అయినా బెంగళూరుకు ఈ సమస్య ఎందుకన్న ప్రశ్న నన్ను తీవ్రంగా కలచివేసింది. దీంతో బెంగళూరులోని పలు చెరువులను పరిశీలించా. కబ్జాలు, ఆక్రమణలు, మురికినీరంతా చెరువుల్లోకి మళ్లించడం, వర్షపు నీరు రాకుండా అడ్డుకోవడం లాంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించా. క్యాలసనహళ్లి చెరువును బాగు చేయాలని నిర్ణయించా. నేను పనిచేస్తున్న కంపెనీని సంప్రదించగా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.95 లక్షలు అందించారు. సిమెంట్, స్టీల్, కాంక్రీట్ వాడకుండా పూర్తిగా సహజమైన పద్ధతిలో 45 రోజుల్లో 36ఎకరాల మురికి చెరువును స్వచ్ఛమైన నీటి చెరువుగా మార్చా. ఆ ఉత్సాహంతో బెంగళూరులోని మరో మూడు చెరువుల్లో మార్పు తెచ్చా. ఒకప్పుడు బెంగళూరు, పరిసరాల్లో 1850 చెరువులుండగా.. ఇప్పుడు400 మాత్రమే ఉన్నాయి. ఉన్న వాటినైనా సంరక్షించి సహజ నీటి వనరులుగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో ఉద్యోగం వదిలి 2019లో మల్లిగావడ్ ఫౌండేషన్ ప్రారంభించా. బెంగళూరులో 35 చెరువుల్ని బాగుచేశా. హైదరాబాద్‌లో చందానగర్‌లోని 5 ఎకరాల భక్షికుంట, మియాపూర్ దీప్తిశ్రీనగర్‌లోని 18 ఎకరాల రేగులకుంట చెరువులతోపాటు వివిధ రాష్ట్రాల్లో 115చెరువులను స్వచ్ఛ తటాకాలుగా మార్చాం.

మురికి నుంచి స్వచ్ఛ చెరువుగా ఎలా అభివృద్ధి చేస్తారు?

నేను కొత్తగా కనుగొన్న విధానమేమీ లేదు. చెరువులకు వర్షపు నీరే ప్రధాన ఆధారం. చెరువు కలుషితమైతే భూగర్భ జలాలూ కలుషితమవుతాయి. వర్షపు నీరు చెరువులోకి చేరేందుకు గతంలో ప్రత్యేక కాలువలు ఉండేవి. వాటిని కబ్జా చేయడంతో వర్షాలు పడుతున్నా చెరువుల్లోకి నీరు చేరట్లేదు. మరోవైపు మురుగును చెరువుల్లోకి మళ్లిస్తున్నారు. ఇది జల, వాయు కాలుష్యానికి దారితీస్తోంది. చెరువులోకి మురుగునీరు చేరకుండా కట్టడి చేయడం, వర్షపు నీటిని మళ్లించడంపైనే ప్రధానంగా దృష్టి పెడతా. పూడికతీత, పిచ్చిమొక్కల తొలగింపు తర్వాత ప్రక్రియలో భాగం. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎకరానికి రూ.7-10 లక్షల ఖర్చు అవుతుంది. నగరాల్లో అయితే రూ.17-20 లక్షల వరకు అవుతుంది. శుద్ధి చేసిన చెరువులో క్రమంగా నీటి నాణ్యతతోపాటు భూగర్భ జలాలు పెరుగుతూనే ఉంటాయి. వాయు కాలుష్యం తగ్గుతుంది. జీవ వైవిధ్యం పెరుగుతుంది. ప్రజలకు ఆరోగ్యకరమైన గాలి లభిస్తుంది.

ఆక్రమణల తొలగింపుతో అక్కడి పేదలకు న్యాయం చేసేదెలా?

ప్రభుత్వాల ముందున్న అతిపెద్ద సవాల్ ఇదే. అనేక చోట్ల అధికార పార్టీ నేతలే చెరువులను ఆక్రమిస్తున్నారు. నగరాల్లో భూముల ధరలు పెరగడంతో బిల్డర్లు, భూ మాఫియాకు చెరువులే వనరులుగా మారాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెరువుల ఆక్రమణల తొలగింపునకు తెలంగాణ ప్రభుత్వం హైడ్రా లాంటి ప్రత్యేక వ్యవస్థను తీసుకురావడం అభినందనీయం. చెరువుల్లో ఆక్రమణల తొలగింపు ఎంత ముఖ్యమో, అనేక సంవత్సరాలుగా అక్కడుంటున్న పేదలకు పునరావాసం కూడా అంతే ముఖ్యం కావాలి. నిరుపేదలకు పీఎంఏవై లాంటి కేంద్ర ప్రభుత్వ గృహనిర్మాణ పథకం, ఇందిరమ్మ లాంటి రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో ఇళ్లు అందించాలి. చెరువుల్లో కబ్జాలను ప్రోత్సహిస్తున్నవారిపై ఉక్కుపాదం మోపాలి. ఆక్రమణదారులను కనికరిస్తే మొత్తం సమాజం తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ప్రభుత్వంతో భాగస్వామ్యం ఎలా?

హైదరాబాద్‌తో ఎప్పటి నుంచో ప్రత్యేక అనుబంధం ఉంది. ఇక్కడి వాలంటీర్లతో కలిసి ఇప్పటికే రెండు చెరువుల్ని పునరుద్ధరించాం. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో వందలాది చెరువులున్నాయి. పునరుద్ధరణకు ప్రభుత్వం సహకారం కోరింది. ఇటీవలే హైడ్రా కమిషనర్ బెంగళూరులోని చెరువులను పరిశీలించారు. ఆయన ఆహ్వానంపై హైదరాబాద్ వచ్చా. మూడు రోజులుగా అనేక చెరువులను పరిశీలించా. ఇక్కడ మాకు 800 మంది వాలంటీర్లు ఉన్నారు. 2030 వరకు ఇక్కడ 50 చెరువులను స్వచ్ఛ చెరువులుగా మార్చాలని భావిస్తున్నాం. అలాగే మూసీ ప్రాజెక్టులోనూ ప్రభుత్వానికి సాంకేతిక సహకారం అందిస్తున్నా. మూసీలో రోజూ 1000 ఎంఎల్‌డీ మురుగు కలుస్తున్నట్లు తేలింది. హైదరాబాద్ పర్యావరణ పరిరక్షణకు మూసీ ప్రాజెక్టును పూర్తి చేయడం అత్యవసరం. దీంతో వాయు, జల కాలుష్యం గణనీయంగా తగ్గుతుంది. ప్రాజెక్టు పూర్తయితే ప్రపంచం ఆశ్చర్యపోయేలా హైదరాబాద్ మారుతుంది. చెరువుల పరిరక్షణకు హైడ్రాను ప్రారంభించడం, అంకితభావం గల సీనియర్ ఐపీఎస్ రంగనాథ్‌ను కమిషనర్‌గా నియమించడం అభినందనీయం. సీఎం రేవంత్ నిర్ణయం దేశానికే ఆదర్శం. ఉత్తరప్రదేశ్‌తోపాటు 12 రాష్ట్రాలకు చెరువుల పరిరక్షణలో సలహాదారుగా ఉన్నా. హైడ్రా లాంటి వ్యవస్థ అన్ని రాష్ట్రాల్లో ఏర్పాటు చేయాలని చెబుతున్నా. ఈ దిశగా యూపీ సీఎం యోగి ఆసక్తి చూపుతున్నారు. రేవంత్ నిజాయితీ నచ్చడంతోనే చెరువుల పరిరక్షణ, మూసీ ప్రాజెక్టులో భాగస్వామ్యం అవుతున్నా.



మక్తల్ ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మాగనూరు ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- 100 మంది విద్యార్థులకు అస్వస్థత
- ఆస్పత్రికి తరలింపు.. ముగ్గురు మినహా అందరి ఆరోగ్యం నిలకడగానే
- ఘటనపై సీఎం రేవంత్ తీవ్ర ఆగ్రహం

మాగనూరు/ హైదరాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనం వికటించి దాదాపు 100 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత కొందరు విద్యార్థులు వాంతులు చేసుకోగా మరి కొందరు కడుపునొప్పి, తలనొప్పితో బాధపడ్డారు. మొత్తం 100 మంది విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ఉపాధ్యాయులు వెంటనే వారిని మాగనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కొందరిని మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి, మరికొందరిని మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లలో తరలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని వారిని పరామర్శించారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ముగ్గురు విద్యార్థులు మినహా మిగతా వారి పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు. కాగా, మాగనూరు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, విచారణ జరిపి వారు తప్పు చేసినట్లు తేలితే సస్పెండ్ చేయాలని నారాయణపేట కలెక్టర్‌ను ఆదేశించారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, విచారణ జరిపి.. తనకు నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. కాగా, బడుల్లో అధ్వాన భోజనం పెట్టి.. పేద విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ఆటలాడుతోందని హరీశ్‌రావు విమర్శించారు.

ఒరిగిన భవనం.. వణికిన జనం!

పక్కన సెల్లార్ తవ్వడంతో కదిలిన పిల్లర్లు.. 50 గజాల్లో 4 అంతస్తులు, పెంట్‌హౌజ్ నిర్మాణం

- హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారుల ఆధ్వర్యంలో భవనం కూల్చివేత
- భవన యజమానులైన దంపతులు, పక్కన సెల్లార్ తవ్విన వ్యక్తిపై కేసులు

గచ్చిబౌలి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉన్నట్టుండి కాళ్ల కింద నేల కదిలినట్టు అనిపిస్తే? ఆ ఐదు అంతస్తుల భవనంలో ఉంటున్న వారు ఒక్కసారిగా అలానే ఫీలయ్యారు! దిగ్భ్రాంతి నుంచి తేరుకొని తామున్న భవనం ఓ వైపు ఒరుగుతున్నట్టు గుర్తించి కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు! శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ పరిధిలోని సిద్ధిక్‌నగర్‌లో మంగళవారం రాత్రి 8:30కు ఈ ఘటన జరిగింది. పక్కనే ఎలాంటి అనుమతుల్లేకుండా సెల్లార్ తవ్వడంతో పిల్లర్లపై ప్రభావం పడి భవనం ఒరిగింది. ఈ భవనాన్ని 50 గజాల స్థలంలో నిర్మించి అద్దెకిచ్చారు. ఈ భవనంలో తొమ్మిది కుటుంబాలు ఉంటున్నాయి. మంగళవారం రాత్రి భవనం ఒరిగిన సమయంలో లోపల 35మంది ఉండగా.. కట్టుబట్టలతో బయటకు పరుగులు తీశారు. స్థానికుల ఫిర్యాదుతో అక్కడికి చేరుకున్న అధికారులు చుట్టుపక్కల 20 భవనాల్లో ఉన్న వారిని కూడా ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. బుధవారం ఉదయం 10గంటలకుభారీ బందోబస్తు మధ్య హైడ్రా, జీహెచ్ఎంసీ అధికారులు హైడ్రాలిక్ యంత్రంతో కూల్చివేతలు ప్రారంభించారు. మధ్యలో యంత్రంలో సాంకేతిక లోపం తలెత్తి పనులు ఆగినా రాత్రి 9 గంటల వరకు భవనాన్ని నేలమట్టం చేశారు. ఘటనా స్థలానికి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి చేరుకుని పరిశీలించారు. కాగా, భవనం పక్కనే సెల్లార్ తవ్వింది ఆ స్థల యాజమాని యాస్మిన్ అని గుర్తించారు. అతడు కుటుంబసభ్యులతో సహా పరారీలో ఉన్నాడు. అతడిపైనా.. 50గజాల స్థలంలో నాలుగు అంతస్తులు, ఓ పెంట్ హౌజ్ నిర్మించిన భవన యజమానులు లక్ష్మణ్-స్వప్న దంపతులపైనా పోలీసులకు జీహెచ్ఎంసీ అధికారులు ఫిర్యాదు చేశారు ఈ మేరకు కేసులు నమోదయ్యాయి. సిద్ధిక్‌నగర్‌లో భవనం ఓ వైపు ఒరగడంతో కాలనీ వాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. భవనం పూర్తిగా కూల్చే వరకు ఖాళీ చేసిన ఇళ్లలోకి వారిని పంపే పరిస్థితి లేదని అధికారులు తేల్చి చెప్పడంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు తిండి తిప్పలు లేకుండా, చలిగాలిలో కాలం వెళ్లదీశారు. కాగా 50, 100 గజాల స్థలాల్లో భారీ భవనాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపించారు.



ఒరిగిన భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

నగదు, బంగారం తెచ్చుకుంటామన్నా..

కుంగిన భవనం గ్రౌండ్ ఫ్లోర్‌లో నివాసం ఉంటున్న అంజన సర్దార్ పోలీసులతో వాగ్వాదానికి దిగింది. భవనంలో భర్త, ఇద్దరు కుమారులతో ఆమె నివాసం ఉంటుంది. భవనంలో ఏడాది నుంచి నివాసం ఉంటున్నామని ఆమె చెప్పింది. బంగారం, నగదు, ఫోన్లు ఇంట్లోనే ఉండిపోయానని, తెచ్చుకుంటామని ఆమె పోలీసులను వేడుకుంది. మూడో అంతస్తులో అసోంకు చెందిన సరిముల్లాహలం, నూర్ అహ్మద్ ఉంటున్నారు. లోపల తమ విలువైన వస్తువులు, టెన్త్, ఇంటర్‌కు సంబంధించిన ఒర్జినల్ సర్టిఫికెట్లు, పాన్, ఆధార్ ఉన్నాయని తెచ్చుకుంటామని పోలీసులను వేడుకున్నారు. అయితే ఎవ్వరినీ పోలీసులు లోపలికి అనుమతించలేదు.

నా కార్లు తీసుకెళ్లారు.. అడిగితే చంపేస్తామంటున్నారు

ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులపై బాధితుడు, తెలంగాణ వాసి వీడియో

కడప, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): 'నా వాహనాలను కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి అనుచరులు తీసుకెళ్లారు. తిరిగి అడిగితే ఇష్టమొచ్చినట్లు కొట్టి, చంపేస్తామని బెదిరించారు. నానా దుర్భాషలాడారు. ఇప్పటికీ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి' అంటూ తెలంగాణ, రంగారెడ్డి జిల్లాకు చెందిన సతీశ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన విడుదల చేసిన సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో సతీశ్ పేర్కొన్న వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లాలో ఆయన ట్రావెల్స్ నడుపుతున్నారు. వికారాబాద్‌కు చెందిన మణిరాజ్ తరుచూ సతీశ్ దగ్గర బాడుగకు వాహనాలు తీసుకొని వెళ్తాండేవారు. అలాగే ఓ రోజు వచ్చి పులివెందుల వైద్య కళాశాలకు నడపడానికి మాట్లాడుకున్నానంటూ మూడు వాహనాలు తీసుకొని వెళ్లారు. ఆ తరువాత కొద్ది రోజులకే మరో రెండు వాహనాలు కావాలంటూ వచ్చారు. రెండు మూడు నెలలపాటు క్రమం తప్పకుండా మణిరాజ్ అద్దె చెల్లించారు. ఓ రోజు సతీశ్ వద్దకు వచ్చి 'కార్లు రిపేర్‌కు వచ్చాయి. ప్రస్తుతం బాడుగ కూడా ఇవ్వలేను. రూ.2 లక్షలు సర్దుబాటు చేస్తే వాహనాలను బాగుచేయిస్తా' అని వేడుకున్నారు. తన కార్లు అతని వద్దే ఉన్నాయిగా అన్న ధీమాతో మణిరాజ్ అడిగిన సొమ్ములను సతీశ్ సర్దుబాటు చేశారు. తరువాత కొద్ది రోజులకే మణిరాజ్ ఫోన్ స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో వాహనాల కోసం 2022లో పులివెందుల వెళ్లిన సతీశ్, పోలీసుల సహాయం కోరారు. కార్లు అవినాశ్‌రెడ్డి అనుచరులైన మహిళా ఎంపీటీసీ, వేంపల్లె జడ్పీటీసీ రవి, ప్రసాద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి వద్ద ఉన్నాయని పోలీసులు గుర్తించారు. కాని, సహాయం చేయడానికి ముందుకు రాలేదు. విషయం తెలుసుకున్న శంకర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి... సతీశ్‌కు కాల్ చేసి రమ్మని పిలిచారు. రాగానే ఇడుపులపాయలోని ఓ భవనంలోకి తీసుకొని వెళ్లి ఇష్టమొచ్చినట్లు కొట్టారు. చంపేస్తామని బెదిరించారు. చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న సతీశ్ వారి చెర నుంచి తప్పించుకున్నారు. 'ప్రభుత్వం మారినా ఇప్పటికీ పులివెందుల పోలీసులు వైసీపీ నేతల చెప్పుచేతల్లోనే ఉన్నారు. కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఆయన అనుచరుడు శంకర్‌రెడ్డి మాటే చెల్లుబాటు అవుతోంది. పోలీసుల నుంచి నాకు ఎలాంటి సహకారం అందడం లేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాకు న్యాయం చేయాలి. ఇప్పటికీ నాకు బెదిరింపు కాల్స్ వస్తూనే ఉన్నాయి' అని సతీశ్ వీడియోలో పేర్కొన్నారు. వివేకా హత్యకేసులో కదలిక రావడం, ఎంపీ అనుచరుడు వర్రాను పోలీసులు అరెస్టు చేయడం తదితర పరిణామాల నేపథ్యంలో సతీశ్ సెల్ఫీ వీడియో హల్‌చల్ చేస్తోంది. తెలంగాణలో అద్దెకు తెచ్చిన వాహనాలను పులివెందుల, వేంపల్లెలో తాకట్టు పెట్టారు. స్థానిక వైసీపీ నేతలు తక్కువ డబ్బుతో తాకట్టు వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. అయితే ఆయా కారు ఓనర్లలో ఇద్దరు ఇప్పటికే తమ కార్లను వెనక్కు తీసుకొని వెళ్లిపోయారు. మరో మూడు కార్లు మాత్రం ఇప్పటికీ అవినాశ్ అనుచరుల వద్దే ఉన్నాయని సతీశ్ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.